ఏప్రిల్ - 2020

DECCAN LAND, HYDERABAD

92

₹30

దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

- అంబేద్కర్‌ని ఆవాహన చేసుకున్న హైదరాబాద్
- పర్యావరణం - తాత్విక దృక్పథాలు
- ఉద్యమస్ఫూర్తితో కరోనాపై యుద్ధం: కేసీఆర్
- కరోనాపై మైఖేల్ బెర్క్ ప్రత్యేక ఇంటర్వ్యూ

ఐకాన్ ఆర్ట్ గ్యాలరీకి చెందిన ఆర్టిస్ట్, క్యూరేటర్ **అవని రావు గంధ్ర** ఏప్రిల్ 12 నుండి మే 12 వరకు నెల రోజులు పాటు కరోనా మహమ్మారి కారణంగా తలెత్తిన అనేక సమస్యలను వ్యక్తపరుస్తూ **'లైట్ ఎట్ ది ఎండ్ ఆఫ్ ది టన్నెల్ కోవిడ్-19'** పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఆమె గత చిత్రాల శ్రేణికి బలమైన రూపక ప్రతీక ఉంది. ప్రకృతి, పర్యావరణంకు సంబంధించి అనేక సమస్యలను తన చిత్రాల ద్వారా వ్యక్తపరిచి పరిశీలించేటట్లు చేశాయి. భయంకరమైన సమస్యలను చిత్రీకరించినప్పుడు కూడా తన చిత్రంలో కళా సౌందర్యం సున్నితంగా ఉండాలని కోరుకుంటుంది. ఈ నెలరోజులు కష్టమైనా గతంలో కంటే భిన్నంగా మార్క్ మేకింగ్, స్ట్రోకులు, రంగులు ఉంటాయంటున్నారు.



కరోనా నేర్పిన పాఠాలు

కరోనా యావత్ ప్రపంచానికి ఎన్నో అంశాల్లో మరెన్నో పాఠాలు నేర్పింది. తక్షణ ప్రభావం కలిగే అంశాలపైనే మానవాళి స్పందిస్తుందనే విషయం మరోసారి స్పష్టమైంది. పర్యావరణం, శీతోష్ణస్థితి మార్పులు లాంటి అంశాలపై దశాబ్దాలుగా ఉద్యమకారులు ఎన్ని సూచనలు చేసినా ప్రభుత్వాలు వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. అలాంటిది కరోనా నేపథ్యంలో ఒక్కసారిగా వాహనాల రాకపోకలు బాగా తగ్గిపోయాయి. పరిశ్రమలు మూతపడ్డాయి. దీనితో కాలుష్య స్థాయిలు పడిపోయాయి. అడవి జంతువులకు స్వేచ్ఛ అంటే ఏమిటో తెలిసింది. రాత్రివేళ నింగిలో చుక్కలు కనిపిస్తున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు పెరిగాయి. ప్రజలు, ప్రభుత్వాలు తలుచుకుంటే ఏమేం చేయవచ్చో అర్థమైంది.

TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com   website : www.deccanland.com



పరమ శోభితను సంతరించుకున్న దక్కన్ ల్యాండ్

గౌరవ సంపాదకులు! మీ సంపాదకత్వమున "దక్కన్ ల్యాండ్" పరమ శోభను సంతరించుకున్నది. మార్చి సంచికలో అంబటి వేకువగారి 'చందాల' వారిని గురించిన వ్యాసం బాగుంది. నలభై వసంతాల 'మాభూమి' మళ్ళీ మళ్ళీ చదవాలనిపించిన వ్యాసం. సంస్కృత సాహిత్యంలో డా. పెన్నా మధుసూదన్ గురించిన డా. రఘుగారి విశ్లేషణ బాగుంది. పుస్తక సమీక్ష విషయంలో (ప్రాణం వాసన) వినాయకం ప్రకాష్‌గారి వైదుష్యం వెనకబడింది. సమీక్ష ఇంచుమించు విమర్శవ్యాసం వంటిది. సమీక్షకునకు చదవటం, చెప్పటం బాగా తెలిసుండాలి.

-సాంధ్యశ్రీ, మౌలాలి, హైదరాబాద్

❖ ❖ ❖

మనసును ఆకట్టుకున్న పత్రిక

విభిన్న కథనాలతో, విశ్లేషణాత్మక వ్యాసాలతో, ప్రతినెలా మీరందిస్తున్న 'దక్కన్ ల్యాండ్' మాసపత్రిక నిజంగా మనసును ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ప్రతినెలా ఒక చిత్రకారుని పరిచయం చేయడం పత్రికా వ్యవస్థాపకుల కళాభిరుచికి నిదర్శనం. అలాగే శిల్పకళను కూడా పరిచయం చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. కారణం తెలంగాణ, ముఖ్యంగా కాకతీయుల శిల్పకళకు పేరెన్నికగన్నది.

-డా॥ పి. వేణుగోపాల్, (ఇంటాక్), కడప

❖ ❖ ❖

అమ్మంగిగారి సాహిత్య విశ్వరూపం

సృజనాత్మక రచయిత, కవి, వినమ్ర విమర్శకులు, బహుగ్రంథ అధ్యయన కారుడు, సాహిత్య ప్రపంచానికి సహృదయ ఆత్మీయుడు, కాళోజీ ప్రథమ పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్‌గారు. సంగిశెట్టిగారు అమ్మంగిగారి సమగ్ర సాహిత్య విశ్వరూపాన్ని ఈ వ్యాసంలో తెలుగు పాఠక ప్రపంచానికి చూపించారు.

హిందూ ముస్లిం సమైఖ్యతకు సంకేతం చార్మినార్ వెనుక వున్న మనకు తెలియని 1591 నాటి దాని నిర్మాణ అవసరాలను, విశేషాలను పరవస్తు లోకేశ్వర్‌గారు సవివరంగా తెలియజేశారు. ఇద్దరికీ అభివందనాలు.

-మారెడ్డి కిరణ్‌కుమార్, హైద్రాబాద్

❖ ❖ ❖

నాటి జ్ఞాపకాలను గుర్తు చేసిన 'మా భూమి'

40 వసంతాల మా భూమి మళ్ళీ ఆనాటి తెలంగా ఉద్యమాల సాంస్కృతిక ఉత్తేజపు జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లింది. మా భూమి వెండితెరపై ప్రజల పోరాట చరిత్ర. మా భూమి వచ్చి నలభై ఏండ్లయిందంటే నమ్మలేకపోతున్నాం. ఈ సినిమాలో అన్నీ ఆనాడు జరుగుతున్న పాత్రలే కనిపించాయి. ఎవరూ నటించలేదు.

-కటకం మల్లేష్, కోరుట్ల

త్వరలో మీ ముందుకు 'బాలచెలిమి'

చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాస పత్రికను రంగులతో 52 పేజీలు త్వరలో అందచేస్తామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. బాలలలో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన, వినోదాలను అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగే 'బాల చెలిమి'ని త్వరలో మీ ముందుకు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి నెలా రెండవ శనివారం నిర్వహిస్తున్న **'బాలచెలిమి-ముచ్చట్ల'**లో ప్రసిద్ధ రచయితలు, మేధావులు, ఆర్టిస్టులు, ఫోటోగ్రాఫర్‌లు, పబ్లిషర్స్, ప్రింటర్స్ పాల్గొని తమ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. బాల రచయితల నుండి బాలల కథలు, గేయాలు, కవితలు, స్కెచ్‌లు, వ్యాసాలు, పొడుపుకథలు, సామెతలు, జాతీయాలు బాలచెలిమిలో ప్రచురణ కోసం ఆహ్వానిస్తున్నాం. బాలచెలిమిని www.balachelimi.com వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు.

-చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

బాల చెలిమి

మీ రచనలు మాకు పంపవలసిన చిరునామా:

ఎడిటర్, **"బాలచెలిమి", చంద్రం,** 3-6-712/2, స్ట్రీట్ నెం:12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029, తెలంగాణ.

Mobile: 9030626288

E-Mail: desk.chelimi@gmail.com

Website: www.balachelimi.com

ఆన్‌లైన్ ద్వారా దక్కన్ ల్యాండ్ చందా చెల్లింపు

దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరాలు

Name : DECCAN LAND,
Kotak Account No: 7111218829
Bank: KOTAK MAHINDRA BANK
IFSC Code: KKBK0007463
Branch Code : 007463

ISSN 2581-3188

విషయసూచిక

దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 8 సంచిక : 8 పేజీలు : 68

ఏప్రిల్- 2020

లోపలి పేజీల్లో...

సుమిత్రాదేవి	డా॥ ముక్తేవి భారతి	6
కరోనాను కట్టడి చేద్దాం (ఎడిటోరియల్)	ఎం. వేదకుమార్	7
అంబేద్కర్‌ని ఆవాహన చేసుకున్న హైదరాబాద్	సంగిశెట్టి శ్రీనివాస్	9
రాజును బంధించిన చెరసాల 'సీతారాంబాగ్ దేవాలయం'	పరవస్తు లోకేశ్వర్	13
పర్యావరణం - శాస్త్రం - నైతికత - తాత్విక దృక్పథాలు	డా॥ ఆర్. సీతారామారావు	15
దేశపతి శ్రీనివాస్ పదాల జోరు	అంబటి వేకువ	21
భూతాపంపై ప్రజల్లో చైతన్యం పెంచాలి	ఆదర్శ్	25
జలవనరుల సంరక్షణే ఇక కీలకం	కట్టా ప్రభాకర్	26
వ్యక్తి, మానవ సమాజం... నడుమ కరోనా	డా॥ నాగశూరి. వి, కె. శైలజ	27
సత్ఫలితాలు ఇచ్చిన సీఎం కేసీఆర్ నిర్ణయాలు	కట్టా ప్రభాకర్	31
వందేళ్లకు ముందే క్వారంటైన్ ఆసుపత్రి	శ్రీహరి	32
ఉద్యమ స్ఫూర్తితో కరోనాపై యుద్ధం	నమస్తే తెలంగాణ సౌజన్యంతో	33
1897 చట్ట ప్రకారం లాక్ డౌన్	నమస్తే తెలంగాణ సౌజన్యంతో	35
రాబోయే సంఘటనలకు సన్నద్ధం	మైఖేల్ బెర్క్(ఇంటర్వ్యూ)	37
'మేడ్ ఇన్ ఇండియా' హస్తకళానైపుణ్యం	జయా జైట్లీ	43
కరోనాపై అవగాహన కల్పిస్తున్న ఆర్టిస్ట్ అవనిరావు	అనిల్	45
వాస్తవ దృశ్యాల్ని తెల్పిన డా॥ కసప నరేందర్ పుస్తకాలు	సృజన్	47
విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయాలి	జుగాష్ విలి	49
దేశంలో గొప్ప విద్యా విధానం రావాలి	రామకృష్ణ కాంపాటి	53
వెంట వచ్చునది ఏది?	శ్రీ సాయిపల్లవి	55
వెలిగే చీకటి (కథ)	మోని శ్రీనివాస్	59
ఈ పుస్తకం రాయడానికి ప్రేరణ ఏమిటీ?	సచిన్	62
అంబర్‌పేట - ఆకాశానికి పూచిన మందారం	ఆడెపు లక్ష్మిపతి	63
పుస్తక పరిచయం	దక్కన్ న్యూస్	65
స్వీకారం	దక్కన్ న్యూస్	66

సంపాదకులు
మణికొండ వేదకుమార్
9848044713
editordeccan@gmail.com

సహాయ సంపాదకులు
కట్టా ప్రభాకర్
జుగాష్ విలి

సర్క్యులేషన్
హెచ్. మోహన్‌లాల్

వాణిజ్య ప్రకటనలు
సయ్యద్ ఖైజర్ భాష
9030626288

ఫొటోగ్రాఫర్
టి.స్వామి
8374995555

కవర్‌పేజీ
అవనిరావు గంద్ర

చిత్రాలు
కూరెళ్ల శ్రీనివాస్

layout & composing @
CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE
DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288 Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

కృతజ్ఞతలు

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక సాహిత్యం విభాగంలో సలహాలు, సూచనలు అందించిన **డా॥ ఎస్. రఘు**కు మా కృతజ్ఞతలు.

'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను ప్రజాస్వామిక అభిప్రాయ వేదికగా, ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక సాహిత్య విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, సమస్యలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

సుమిత్రాదేవి

సాంఘిక సేవారంగంలో కృషి చేసిన మహిళలెందరో ఉన్నారు. సమాజంలో వున్న దురాచారాలను రూపుమాపటానికి వారంతా దీక్ష పూనినవారే. అనాథలు, పతితలు, భ్రష్టులు లాంటి వారెవరైనా సరే, వారెందరికీ తమవంతు సేవలందించటానికి వెనుకాడక ముందుకొచ్చే సాంఘిక సేవా తత్పరులైన మహిళామణులకు సమాజం ఎప్పుడూ కృతజ్ఞతలు చెప్పుకోవలసిందే.

సాంఘిక సేవారంగంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొంది, తెలంగాణా ప్రాంతం నుంచి వచ్చిన గొప్ప నాయకురాలు సుమిత్రాదేవి. దళితవాడలో పుట్టి, మహోన్నత వ్యక్తిత్వంతో అలరారిన సుమిత్రాదేవి విశిష్టమైన సేవలందించిన సంఘసేవిక, సంస్కార హృదయం మానవీయ విలువలకు పట్టం కట్టిన ఆదర్శమహిళ దళితురాలై, సాంఘిక సేవాతత్పరురాలై విశేషమైన కీర్తి నార్జించిన వ్యక్తి సుమిత్రా దేవి.

ఈమె వివాహమాడిన వ్యక్తి క్షత్రియ వంశీయుడైన దేవీప్రసాద్. సుమిత్రాదేవి, దేవిప్రసాద్‌లది ఆదర్శదాంపత్యం. భర్తను గురువుగా భావించి వారి అడుగుజాడలలో నడిచి, వారి ఆశయాలను అనుసరించింది సుమిత్రాదేవి. సంఘసేవ, దేశసేవ లక్ష్యంగా జీవితాన్ని సార్థకం చేసుకుంది సుమిత్రాదేవి. తన భార్య కూడా తనతోబాటు రాజకీయాల్లోకి రావాలిని, తోటి మానవులకు సేవలందించాలని కోరుకున్నారు దేవీప్రసాద్‌గారు. భార్య సుమిత్రాదేవిని గాంధీయవాదిగా తీర్చిదిద్దారు. గాంధీ సిద్ధాంతాలు ప్రచారం చేస్తూ, గాంధీ శిష్యురాలయింది సుమిత్రాదేవి. సత్యాహింసలు గాంధీగారి ఆయుధాలైతే, అవే తనూ స్వీకరించాలని త్రికరణశుద్ధిగా విశ్వసించింది సుమిత్రాదేవి. గాంధీగారి వార్ధా ఆశ్రమం ఆమెను చాలా ఆకర్షించింది. వార్ధా ఆశ్రమంలో గాంధీగారితోపాటు సేవాకార్యక్రమాలు చేస్తూ, మూడు సంవత్సరాలున్నారక్కడ. అక్కడనుంచి శ్రమసేవిక శిక్షను పొందటం సుమిత్రాదేవి జీవితంలో గొప్ప మలుపు.

సుమిత్రాదేవి కులమతాలకు అతీతంగా ఎదిగి పోయారు. గొప్ప కవయిత్రి అయిన సరోజినీ నాయుడుతోను, గడ్డిమోపు నెత్తినపెట్టుకు అమ్ముకునే ఆడవాళ్ళతోను సమంగా సమరస భావంతో మెలిగి అందరి మన్ననలను పొందారు. సుమిత్రాదేవిని అందరూ కూడా అక్క అని ఆత్మీయంగా పిలిచేవారు. అలాగే భావించి గౌరవించేవారు.

సుమిత్రాదేవి ఎన్ని పదవుల్లోవున్నా, ఆపదవులు ప్రజాసంక్షేమం కోసమే ఉపయోగించారు.

సుమిత్రాదేవి రాష్ట్ర కాంగ్రెస్ సభ్యులరాలయ్యారు నగర పురపాలక సంఘం ప్రతినిధిగా ఎన్నుకోబడ్డారు. గృహపరిశ్రమల సలహా సంఘ సభ్యురాలు. జిల్లా డెవలప్‌మెంటు బోర్డు సభ్యురాలు. వెనుకబడిన తరగుతుల సంస్థకు ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ సోషల్ సర్వీసుకు సభ్యురాలు గౌరవ మెజిస్ట్రేటు. ఉస్మానియా విశ్వవిద్యాల సిండికేట్ సభ్యురాలు, ఈ పదవులేవీ ఆమెకి అధికారాన్ని, అహంకారాన్ని అందియ్యలేదు. ఈ పదువులు, బాధ్యతలు ఆమెను సంఘ సంస్కర్తగా, దళిత వర్గాల సేవలె దోహదం చేస్తాయి. శాసన సభ్యులు ఆమె ఆమటను గౌరవించి సుమిత్రక్కా అని పిలిచేవారు.

సుమిత్రాదేవి చేసిన మంచి పనులెన్నెన్నో. తన డబ్బు ఖర్చు చేసి ఓ మంచి పనికి అంకురార్పణ చేసారు. అదే చిక్కడపల్లి (హైదరాబాద్)లోని ఆర్య యువజన పాఠశాల. ఈ పాఠశాలను ఎంతో విజయవంతంగా నడిపి, విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపారు.

గాంధీ మార్గానుయాయి అయిన సుమిత్రాదేవి, ఖాదీ, చెరఖా ప్రచార కేంద్రాలు నెలకొల్పారు. అంతేకాక, సుమిత్రాదేవి రాష్ట్ర కాంగ్రెస్ సభ్యురాలయినప్పుడు జగ్‌జీవన్ పాఠశాల నడిపారు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం చేసి అరెస్టయ్యారు.

సుమిత్రాదేవిగారి సాంఘీక సేవాకార్యక్రమాలు ఎన్నో మార్గాలలో సాగేవి. నిజాం ప్రభువు, కోడలు దుర్రెషనబేగమ్ గారి ఆధ్వర్యంలో నడుపబడే ఆహార ధాన్యాల చౌక దుకాణాలలో సభ్యురాలిగా చేసారు.

సుమిత్రాదేవిగారు సంఘంలో సభ్యురాలిగా వుంటూ కార్యనిర్వహణ దక్షురాలిగా పేరు పొందారు. ఆంధ్రయువతీ మండలి కార్య నిర్వాహక సభ్యురాలిగా పనిచేసారు. నిజాం రాష్ట్రంలో నిమ్నజాతి మహా సభకు అధ్యక్షురాలిగా ఎన్నికై, చాలా సేవలందించారు దళిత సంఘాలకు చేయూతనిచ్చారు.

(మిగతా 8వ పేజీలో)

కరోనాను కట్టడి చేద్దాం

ఒక్కో శతాబ్దంలో ఒక్కో అంటువ్యాధి మానవాళిని వేధించింది. మిగితా అంటువ్యాధులతో పోలిస్తే కరోనా వైరస్ ప్రభావం ముందెన్నడూ ఊహించనిది. సినిమాల్లో, నవలాసాహిత్యంలో ఈ రకమైన వైరస్ ప్రస్తావనలు ఉన్నప్పటికీ, అవి నిజమయ్యే అవకాశం ఉందని ఏ దేశ ప్రభుత్వం కూడా ఊహించలేకపోయింది. అందుకే దాదాపుగా అన్ని దేశాల్లోనూ ఈ వైరస్‌ను కట్టడి చేసే చర్యలు తీసుకోవడంలో కొంత అయోమయం నెలకొంది.

ఈ వైరస్ ధాటికి మొదట యూరప్, ఆ తరువాత అమెరికా అతలాకుతలమైపోయాయి. ఆగ్నేయాసియాలోనూ దీని ప్రభావం అధికంగానే ఉంది. దక్షిణాసియాలో మాత్రం ఇప్పటివరకైతే పరిస్థితి అదుపులోనే ఉంది. కాకపోతే ఏ క్షణంలోనైనా వైరస్ విశ్వరూపం ప్రదర్శించవచ్చనే అనుమానాలు ఉన్నాయి.

చైనా, దక్షిణ కొరియా, తైవాన్ లాంటి కొన్ని దేశాలు మినహాయిస్తే ఇతర దేశాలేవీ కూడా కరోనాను సమర్థంగా కట్టడి చేయలేకపోయాయి. భారత్ సైతం ఈ విషయంలో తగినంత కృషి చేస్తుంది.

ఒక మహమ్మారి వ్యాపించే సందర్భంలో దాన్ని ఎలా కట్టడి చేయాలనే విషయంలో సాధారణంగా ప్రతి దేశం కూడా ముందు నుంచే ఓ ప్రణాళికతో ఉంటుంది. కాకపోతే కరోనాను కట్టడి చేసే వ్యూహం మిగితా వైరస్‌లతో పోలిస్తే భిన్నమైంది.

కరోనా కట్టడికి ప్రభుత్వాలకీ, ప్రజలకీ ఏకీభావంతో కూడిన నిబద్ధత, సంసిద్ధత ముఖ్యం. ప్రభుత్వ ఆదేశాలను, చర్యలను చైతన్యంతో అర్థం చేసుకుని చిత్తశుద్ధితో స్వీయ క్రమశిక్షణను పాటించిన దేశాలు కరోనాని కట్టడి చేయడంలో సఫలీకృతమవుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందేమోనన్న భయంతో అమెరికా చివరి క్షణం దాకా కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేసింది.

మొత్తం మీద కరోనా యావత్ ప్రపంచానికి ఎన్నో అంశాల్లో మరెన్నో పాఠాలు నేర్పింది. తక్షణ ప్రభావం కలిగే అంశాలపైనే మానవాళి స్పందిస్తుందనే విషయం మరోసారి స్పష్టమైంది. పర్యావరణం, శీతోష్ణస్థితి మార్పులు లాంటి అంశాలపై దశాబ్దాలుగా ఉద్యమకారులు ఎన్ని సూచనలు చేసినా ప్రభుత్వాలు వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. అలాంటిది కరోనా నేపథ్యంలో ఒక్కసారిగా వాహనాల రాకపోకలు బాగా తగ్గిపోయాయి. పరిశ్రమలు మూతపడ్డాయి. దీనితో కాలుష్యస్థాయిలు పడిపోయాయి. అడవి జంతువులకు స్వేచ్ఛ అంటే ఏమిటో తెలిసింది. రాత్రివేళ నింగిలో చుక్కలు కనిపిస్తున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు పెరిగాయి. ప్రజలు, ప్రభుత్వాలు తలుచుకుంటే ఏమేం చేయవచ్చో అర్థమైంది. అంతే కాదు... ఒక ఉత్పాతాన్ని ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలంటే ఏం చేయాలో అర్థమైంది. వివిధ రకాల కష్టాలు ఎలా ఉంటాయో నవతరానికి అర్థమైంది. ప్రపంచరాజకీయాల్లోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

'బతికుంటే బలుసాకు తిని బతుకొచ్చు. పోయిన ప్రాణాలు తేగలమా' అన్న కేసీఆర్ మాట తోటి మానవాళిపట్ల ఉన్న మానవీయ బాధ్యతకు, ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలకు ప్రేరణగా నిలిచింది. ఈ విపత్కర స్థితిలో ఫెడరల్ స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయడం హర్షణీయం.

ఇవన్నీ సరే.... మనిషి ఆలోచనల్లో సానుకూల మార్పు రానిది మాత్రం ఇలాంటి ఉత్పాతాలను ఎదుర్కోలేము. ఇలాంటివి మరెన్నో చూడాల్సి రావొచ్చు. అలాంటి వాటికి సైతం ఇప్పటి నుంచే శాస్త్రీయమైన పరిశోధనలను, కార్యాచరణలను సిద్ధం చేసుకోవాలి.

వేదకుమార్.యం
(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

స్త్రీలకై సేవచేయుట ఆమె లక్ష్యమైంది. పోలీసు చర్య తర్వాత, రెస్క్యూ వర్క్ ఆర్గనైజేషన్‌లో సభ్యురాలిగా చేరి స్త్రీలను ఎన్నో విధాల రక్షించారు. దళితులకై ఐదువందల యిళ్ళు కట్టించి, ఆ ఇళ్ళలో వారిని ప్రవేశపెట్టడం కోసం చాలా శ్రమించారు. శాసన సభ్యురాలిగా ప్రజలమధ్యకెళ్ళి వారి అవసరాలు కనుగొనేవారు సుమిత్రాదేవిగారు. ఆ విధంగా రాజేంద్రనగర్, హయత్‌నగర్, మేడ్చల్‌లకు ఎంతో మేలు జరిగింది.

దళిత వాడలో మంచినీటి కరువును గుర్తించిన సుమిత్రాదేవి చాలా ఆవేదన చెందారు. ఆమె బాధ్యతగా అరవై మంచినీటి బావులు చెరువులు తవ్వించటం మరపు రాని మహోపకారం. విద్యుత్ దీపాలు పెట్టించారు. ఆమె చేసే సేవా కార్యక్రమాలు చాలామందికి జీవనోపాధి కల్పించాయి.

సుమిత్రాదేవి గారి మనసు సహకార వ్యవసాయ పద్ధతిపై నిల్చింది. రెండువేలకు పైగా సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టి గొప్ప ఉపకారం చేసారు. ఉప్పల్ అన్నోజీగూడ గ్రామంలో దళితులకు భూమి మాత్రమే కాకుండా, భూమి దున్నటానికి వారికి ఎద్దులను కూడా పంచిపెట్టడం ఎంత ప్రత్యేకమైన పనో తల్చుకుంటే సుమిత్రాదేవి గారి సమర్థతకి ఆశ్చర్యపోక తప్పదు.

సమాజంలో జరిగే అక్రమాలను, అన్యాయాలను చూసి సహించలేకపోయేవారు. భార్య ఉండగా ద్వితీయ వివాహం చేసుకోరాదనే చట్టం వచ్చింది. ప్రభుత్వోద్యోగులు చేస్తే వారి ఉద్యోగాలు పోతాయి. ఇతరులు శిక్షార్హులే. ఈ చట్టం స్త్రీలకు న్యాయం చేస్తుందనిపించింది సుమిత్రాదేవికి. కాని ఒక విషయం ఆమె దృష్టికొచ్చింది. ఇద్దరు ప్రభుత్వ డాక్టర్లు భార్యలుండగా మళ్ళీ వివాహం చేసుకున్న విషయం ఆమెకు తెలిసింది. సుమిత్రాదేవి మనసు రగిలిపోయింది. ఆ ఇద్దరినీ ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆమె రాష్ట్ర శాసనసభ వద్ద ఆ సంఘటనను పలువిధాల విమర్శించి, స్త్రీకి జరిగే అన్యాయాన్ని సాటి స్త్రీగా తను క్షమించనని, అందరి మనసులు కరిగేట్టుగా ప్రసంగించింది సుమిత్రాదేవి.

"ఆ ప్రసంగం చాలా చారిత్రాత్మకమైంది. ఇప్పటి సభ్యుల హృదయాల్లో ఇంకా ఆ ప్రసంగం నిలిచేవున్నది ఇప్పటికి" అని 'తేజోమూర్తులు' గ్రంథంలో ఇల్లిందల సరస్వతీదేవిగారన్నారు.

సుమిత్రాదేవి దళితజాతుల సంక్షేమానికే ఆమె జీవితాన్ని అంకితం చేసిందంటే అతిశయోక్తికాదు. ఆమె చదువుకోకపోయినా, దళిత పిల్లలుగూడ చదువుకోవాలని ఆమె కాంక్షించింది. దళిత స్త్రీ జనాభ్యుదయ లక్ష్యంతో ఉప్పల గ్రామాలలో బాపుజీ సేవా సదనాన్ని నిర్మించింది. ముప్పయిమందిదాకా దళిత స్త్రీలు ఆ సమాజంలో చేరి చేతిపనులలో శిక్షణ పొంది జీవనోపాధిని పొందారు. బాలబాలికలు దగ్గర పాఠశాలల్లో చదువుకున్నారు. ఆర్యసమాజ పద్ధతులు ఆ సేవాసదనంలో ప్రవేశపెట్టారు. ప్రార్థన చేయుటం, కవాతు చేయటం, కర్రసాము నేర్పటం మొదలైనవి నిత్య కార్యక్రమాలు.

నిస్వార్థ సేవాపరాయణురాలైన సుమిత్రాదేవి రాజకీయ బాధితుల కోసం ప్రభుత్వం ఇచ్చిన పదెకరాల భూమిని ఈ సంస్థకు విరాళంగా యిచ్చేసారు. ఆమెకు మంత్రి పదవి ఇస్తామంటే తిరస్కరించారన్న విషయం వింటే ఆమె వ్యక్తిత్వం ఎంత గొప్పదో తెలుస్తుంది.

సుమిత్రాదేవి విశిష్ఠ వ్యక్తిత్వం గురించి ఎన్నో కోణాలలో ఆవిష్కరించారు. ఇల్లిందుల సర్వతీదేవిగారు. "మా తల్లి సల్లగుంటే మాకు బుక్కెడు బువ్వ దొరుకుద్ది" "మాయమ్మ సల్లగుంటె తల దాచుకోటానికి గుడిసెయిస్తది" "ఆ తల్లి సల్లగుంటే దున్నుకోటానికి చేరదు భూమియిస్తుంది" చల్లటివేళ ఇలా దళిత వర్గాలు ఆమె దొడ్డ మనసునూ శక్తి సామర్థ్యాలను తలుచుకుని ఆశలను వెలిబుచ్చుకుంటూ వుంటారు" అన్నారు. దీన జన బంధువుగా, కరుణామయిగా, బీదలపాలిట పెన్నిధిగా సుమిత్రాదేవి అందించిన సేవలు చిరస్మరణీయాలు.

సుమిత్రాదేవి గొప్ప సాహసవంతురాలు. చాలాసార్లు రజాకార్లను ఎదిరించారు. చాలాసార్లు ఏదో వంకతో నేరం మోపి, అరెస్టు చేసి వ్యానులో ఎక్కిస్తే సుమిత్రాదేవి వారందరితో పోట్లాడి, వాదించి, వారిని బెదరగొట్టినపుడు, రజకార్లు వ్యానులో ఆమెను ఊరంతా తిప్పి, ఆమె ముందు నిలువలేక, చివరకు, ఆ వ్యాన్‌లో ఎక్కించిన స్త్రీలందర్నీ హుస్సేన్‌సాగర్ కట్టమీద వదలి వెళ్ళిపోవటం సుమిత్రాదేవి ధైర్యసాహసాలకి, స్త్రీల విజయానికి ఉదాహరణలు.

రాజబహదూర్ వేంకటరామిరెడ్డి కళాశాల భవనానికి శంఖుస్థాన జరగాలి. ఆ స్థలంలో దళితుల గుడిసెలున్నాయి. ఆ గుడిసెలు తియ్యాలి. నాయకురాలు సుమిత్రాదేవి ఆ గుడెసెలు తీయడానికి వీల్లేదంది. మాడపాటి హనుమంతరావుగారు సుమిత్రాదేవిని బతిమాలాడారు. ఎన్నో విధాల నచ్చచెప్పారు. సుమిత్రాదేవి పట్టువీడలేదు. గుడిసెల సంగతి తేల్చకుండా కళాశాల శంఖుస్థాపన చేయనీయనంది. మరొకచోట స్థలం చూపించండి. గుడిసెలు అక్కడ వేసుకోటానికి తగిన డబ్బు ఇయ్యండి అని హనుమంతరావుగారితో మాట్లాడింది. ఆమె మాట నెగ్గింది. వేరొకచోట గుడిసెల నిర్మాణం పూర్తయ్యింది. సుమిత్రాదేవి కళ్ళలో ఆనందభాష్పాలు. హనుమంతరావుగారితో వాగ్వాదానికి దిగినా, ఆయనపై తనకున్న గౌరవంతో, ఆ కాలనీకి హనుమంతరావు కాలని అని పేరు పెట్టడం సుమిత్రాదేవి సహృదయం.

దళిత వర్గాలు అందరితో సమంగా హక్కులు పొందాలనీ, వారిని ఉన్నతస్థాయిలో చూడాలని సుమిత్రాదేవి కోరిక. దళిత వర్గాలు ఆమెను దేవతలా సేవిస్తారు. ఆమె వారిపాలిట కల్పతరువని విశ్వసిస్తారు. ఆమె దళిత స్పృహతో వారి జీవితాలలో వెలుగులు ప్రసరింపజేసిన తేజోమయి.

-డా॥ ముక్తేవి భారతి

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన **'తెలంగాణ తేజోమూర్తులు'** నుంచి)*

ద

అంబేద్కర్‌ని ఆవాహన చేసుకున్న హైదరాబాద్

అసఫ్జాహీలు ముఖ్యంగా ఏడో నిజాం ఉస్మానలీఖాన్ పాలనలో హైదరాబాద్ రాజ్యంలో బయటి వ్యక్తులు రాజకీయ, ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనడంపై ఆంక్షలుండేవి. దాదాపు నిషేధం ఉండేది. ఒక వేళ ఎవరైనా కచ్చితంగా పాల్గొనాల్సి వస్తే వారికి సంబంధించిన పూర్తి వివరాలు ముందుగానే ప్రభుత్వానికి అందజేయాలి. అనుమతి తీసుకోవాలి. ఆ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొనడానికి వస్తున్న రాష్ట్రేతర వ్యక్తుల ప్రసంగ పాఠాన్ని కూడా పోలీసు అధికారులకు ముందుగానే అందజేయాల్సి ఉండేది. ఇన్ని ఆంక్షలు ఉన్నప్పటికీ భాగ్యరెడ్డి వర్మ తాను నిర్వహించిన 'ఆదిహిందూ సోషల్ సర్వీస్ లీగ్' సభలకు కర్నాటకకు చెందిన రావు సాహెబ్ టి.జె.పాపన్న, మద్రాసుకు చెందిన ఎం.సి. రాజా తదితరులను పిలిపించి సమావేశాలు నిర్వహించాడు. అయితే తన జీవిత కాలంలో ఆయన అంబేద్కర్‌ని పిలిపించి సమావేశం ఏర్పాటు చేయలేక పోయినాడు. కానీ అంబేద్కర్‌ని భారతదేశ దళిత ప్రజల ఏకైక ప్రతినిధిగా గుర్తించి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు పంపించడంలో ఆయన కృతకృత్యులయ్యారు. ఇదే సందర్భంలో హైదరాబాద్ రాజ్య ప్రభుత్వమే అంబేద్కర్ సేవలను గుర్తించి కొంత గ్రాంటుని మంజూరు చేసింది. అంతేగాకుండా అంబేద్కర్ దళితుల అభ్యున్నతికి చేస్తున్న సేవలకు అండగా నిలబడేందుకు గాను నిజాం ప్రభుత్వం ప్రతినెలా 500ల రూపాయలు అందించేలా కూడా ఏర్పాటు చేసింది. ఇలా హైదరాబాద్‌కు అంబేద్కర్‌కు అతి సన్నిహితమైన, సమాజహితమైన సంబంధాలున్నాయి.

హైదరాబాద్ స్టేట్‌లో మే 1950న షెడ్యూల్డ్ కులాల సమాఖ్య వారు నిర్వహించిన సమావేశానికి హాజరైన అంబేద్కర్, పి.ఎన్.రాజ్‌భోజ్

1931 సెప్టెంబర్‌లో ఆలిండియా ఆది-హిందూ పొలిటికల్ కాన్ఫరెన్స్ (రాజకీయ సభలు) లక్నోలో జరిగాయి. ఆ సమావేశానికి భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలోనే చట్టసభలకు దళితుల ఎంపిక కోసం ప్రత్యేక విధానాన్ని అమలు పరచాలని తీర్మానించారు. అలాగే రెండో రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి జాతీయ స్థాయిలో దళితుల ఏకైక ప్రతినిధిగా, సర్వామోదమైన వ్యక్తిగా అంబేద్కర్‌ని నిర్ధారించడంలో ఈ సభ కీలక పాత్ర పోషించింది. ఇది మొదటి సారిగా హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అంబేద్కర్‌ని అక్కున చేర్చుకున్న సంఘటన. అంబేద్కర్ రెండోసారి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆయన ప్రతిభను గుర్తించి, రాజకీయ కార్యకలాపాలకు ప్రోత్సాహమిచ్చి, మొత్తం దళిత సమాజానికి మేలు చేసే ఉద్దేశ్యంతో నిజాం ప్రభుత్వం ప్రతినెలా ఐదువందల రూపాయలను గ్రాంటుగా ఇచ్చింది. హైదరాబాద్ రాజ్యంలో దళితుల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలను ప్రచారం చేసుకునేందుకు నిజాం ప్రభుత్వం ఇదొక అవకాశంగా భావించింది.

నిజానికి అంబేద్కర్‌కు హైదరాబాద్‌కు చాలా దగ్గరితనమున్నది. హైదరాబాద్ రాజ్యంలో మరఠ్వాడా ప్రాంతం కూడా భాగం. ఈ ప్రాంతంలోని దళితులపై అంబేద్కర్ ప్రభావం ప్రగాఢంగా ఉండింది. మరఠ్వాడాలో భాగమైన ఔరంగబాద్‌లో మిలింద్ కళాశాల ఏర్పాటులో అంబేద్కర్‌కు హైదరాబాద్ ప్రభుత్వం సహకరించింది. మరఠ్వాడా ప్రాంతంలో విద్యావ్యాప్తికి అంబేద్కర్ చేసిన కృషి గణనీయమైనది. ఆయన వేసిన పునాదులపై 1958లో మరఠ్వాడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినారు. ఈ విశ్వవిద్యాలయం పేరు మార్పు కోసం 1978నుంచి ఉద్యమాలు జరిగాయి. చివరికి ఈ విశ్వవిద్యాలయం పేరును 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరఠ్వాడా విశ్వవిద్యాలయం'గా మార్చినారు.

హైదరాబాద్ రాజ్యంలో భాగమైన మరఠ్వాడా ప్రాంతంలో అంబేద్కర్ చాలా సార్లు వివిధ సభలు, సమావేశాల్లో పాల్గొన్నారు. ఔరంగాబాద్ కేంద్రంగా అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యంగా విద్యారంగంలో ఔరంగాబాద్‌కు విశిష్టత చేకూర్చినాడు. అయితే ఆయన జీవితకాలంలో హైదరాబాద్ నగరంలో ఆరేడు సార్లకన్నా ఎక్కువగా పర్యటించలేదు. ఇందుకు ప్రధానకారణం తాను దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్న దళితహిత కార్యకలాపాలు, హైదరాబాద్ రాజ్యంలో దాదాపు అమల్లో ఉండడమే కారణం. దళితుల కోసం ప్రత్యేక పాఠశాలలు, స్కాలర్‌షిప్, వాణిజ్య రంగాల్లో దళితులను ప్రోత్సహించడం తదితర కార్యకలాపాలన్నింటిని నిజాం ప్రభుత్వం అమలు చేయడంతో హైదరాబాద్‌లో తన కార్యకలాపాలు నిర్వహించాల్సిన అవసరం లేకుండా పోయింది. అంతేగాకుండా హైదరాబాద్‌లో భాగ్యరెడ్డి వర్మ, అరిగె రామస్వామి, ఎం.ఎల్.ఆదయ్య, వల్తాటి శేషయ్య తదితరులు అంబేద్కర్ కన్నా ముందు నుంచే సామాజిక, సేవా రంగాల్లో విశేషమైన కృషిని చేసినారు. వీరితో పాటుగా చైతన్యవంతులు, విద్యావంతులైన జె.హెచ్.సుబ్బయ్య, బి.శ్యామ్‌సుందర్, కె.ఆర్.వీరాస్వామి తదితరులు అంబేద్కర్ ఐడియాలజీని విస్తృతంగా ప్రచారం చేసినారు. అంతగా విద్యాధికుడు గాకున్నా బి.ఎస్. వెంకటరావు కూడా ఈ విషయంలో గణనీయమైన కృషి చేసినాడు.

హైదరాబాద్ నగరంలో మొట్టమొదటిసారిగా అంబేద్కర్ 1932లో పర్యటించినాడు. 1932 సెప్టెంబర్ మూడు నాడు హైదరాబాద్‌లో జరిగిన హైదరాబాద్ రాజ్య '72వ విదేశీ సంబంధాల కమిటీ సమావేశం'లో అంబేద్కర్ ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో సర్ అక్బర్ హైదరీ, ఆర్.సి.ట్రెంచ్, ఎం.ఎస్.ఎ.హైదరీ, కె.పి.మున్షీలు పాల్గొన్నారు. ఈ సమావేశం హైదరాబాద్‌లోని ఫైనాన్స్ కార్యాలయంలో సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల మధ్యన జరిగింది.

ఈ సందర్భంగా అంబేద్కర్ మాటల గురించి నిజాం ప్రభుత్వ కాన్ఫిడెన్సియల్ రిపోర్టులో వివరంగానే రాశారు. దీని ప్రకారం దళితుల

అభ్యున్నతికి నిజాం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కొనియాడారు. అలాగే ఈ కార్యకలాపాలను మరింత ముందుకు తీసుకు పోవడానికీ, దేశ వ్యాప్తంగా దళితుల అభ్యున్నతికి తాము చేపడుతున్న కార్యక్రమాలకు రెండు లక్షల గ్రాంటు మంజూరు చేయవలసిందిగా నిజాం ప్రభుత్వాన్ని అంబేద్కర్ కోరినారు. అయితే నిజాం ప్రభుత్వం అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని 15,000ల రూపాయల గ్రాంటుని జారీ చేయడమే కాక 1932 నుంచి మూడేండ్ల పాటు నెలకు 500ల రూపాయల చొప్పున గ్రాంటు ఇవ్వడానికి (నిజాం ప్రభుత్వం) నిర్ణయించింది. అలాగే ఈ విషయానికి అంతగా ప్రచారం కల్పించాల్సిన అవసరం లేదని కూడా తీర్మానించినారు. ఈ మేరకు నిజాం ప్రభుత్వ కార్యదర్శి సర్ అక్బర్ హైదరీ కుమారుడు బొంబాయిలో అంబేద్కర్‌ని కలుసుకొని 15వేల రూపాయల చెక్, మరో చెక్ ఐదు వందల రూపాయలది (ప్రతినెలా ఇచ్చే గ్రాంటులో మొదటిది) రెండూ అందజేసినాడు. దీనికి కృతజ్ఞతలు చెబుతూ అంబేద్కర్ నిజాం ప్రభుత్వ పొలిటికల్ సభ్యుడు నవాబ్ మెహదీయార్ జంగ్‌కు అక్టోబర్ నాలుగు, 1932 నాడు ఉత్తరం కూడా రాయడం జరిగింది. ఇదంతా హైదరాబాద్‌కు అంబేద్కర్‌కు ఉన్న సన్నిహిత సంబంధాన్ని తెలియ చెబుతున్నది. అంబేద్కర్ హాజరైన విదేశి సంబంధాల కమిటీ సమావేశంలో అంబేద్కర్ మాటలను రికార్డు చేసినారు. నిజానికి అంబేద్కర్ ఆనాడు తమ కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి కొంత భూమిని కేటాయించాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నాడు. దళితులకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు నిర్వహించడానికి ఇది వేదికగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డాడు. అయితే ప్రభుత్వం ఈ డిమాండ్‌ని సున్నితంగా తిరస్కరిస్తూ గ్రాంటుని మాత్రం విడుదల చేసింది.

"He ascribed the gradual awakening the depressed classes to a consciousness of their political and social rights and to the sesentment threat of caste Hindus. He said that as one who was very largely responsible for this awakening he had drawn a good deal of hostility to his own person and mentioned some of the attempts made by congress partisans to isolate him. The organization, which he had built up was in sure need of habitation and therefore of funds. He wanted a small piece of land on which he could build. the premises would accommodate a press and also contaion a meeting hall. The ground floor would be rented by shopkeepers the rent from whom would go towards meeting the expenses of his orgnization. When not in use for his own meetings he could also hire out lumpsum grant of 2 lakhs. He said tha a large proportion of Hyderabad's population belonged the Depressed classes and that she had a duty to this community. He appreciated the fact that any grant given to him would be an expenditure outside the State and could only be justified on political grounds. He felt that a grant made to him and his organiztiaon would evoke the gratitude of the Depressed classes all over India inluding Hyderabad. He had a certain position as their spokesman and protaganist. The efforts of himself and his supporters could in many ways ensure that the Depressed classes in the State would provide a solid element of stability there in. while appreciating the fact that other commitments in the State had a cliam on Governement's assistance, he argued that the Depressed classes had received little support so far because they had been inarticulate. They also had a claim. (Confidential; HEH The Nizam's Political department, round table conference, 1932)." హైదరాబాద్ ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ ప్రజాహిత కార్యక్రమాలను అంబేద్కర్ ప్రశంసించిన సంగతి కూడా ఈ ప్రసంగం ద్వారా తెలుస్తుంది. ఏది ఏమైనప్పటికీ అంబేద్కర్ రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ సందర్భంగా దేశ దళితుల దయనీయ స్థితిగతులను సమర్ధవంతంగా చాటి చెప్పగలిగినాడు. ఈ సమావేశాల్లో హైదరాబాద్ రాజ్య ప్రతినిధిగా సర్ అక్బర్ హైదరీ కూడా పాల్గొనడంతో ఆయన్ని మరింత దగ్గరగా చూడడానికి, నైతికంగా మద్దతుగా నిలబడడానికి వీలయింది. ఆనాటి నుంచి హైదరాబాద్ ప్రభుత్వం ఆయనకు అండగా నిలిచింది. ఇందుకు అంబేద్కర్ ప్రతిభతో పాటు అక్బర్ హైదరీ ఉదారగుణం కూడా కారణం.

1935నాటి చట్టంలో దళితులందరినీ 'షెడ్యూల్డ్ కాస్ట్స్'గా గుర్తించిన అనంతరం వారి అభ్యున్నతి కోసం ఒక రాజకీయ పార్టీని అంబేద్కర్ ఏర్పాటు చేసినాడు. ఒక వైపు గాంధీ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ శాఖను ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదూ అని ప్రకటిస్తే మరో వైపు అదే హైదరాబాద్‌లో అంబేద్కర్ దళితుల మేలుకోసం 'షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫెడరేషన్' శాఖను ఏర్పాటు చేసినాడు. ఈ శాఖ నిర్వహణలో జె. హెచ్.సుబ్బయ్య, పి.వి.మనోహర్, రాజమణీదేవి, ఎం.ఆర్.కృష్ణ తదితరులు ప్రముఖంగా పనిచేశారు. వీరి కృషికి గుర్తింపుగా హైదరాబాద్ రాష్ట్ర ప్రజలు షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫెడరేషన్ తరపున ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక లోక్‌సభ సభ్యుడిని మొదటి సాధారణ ఎన్నికల్లో గెలిపించారు. ఈ సంస్థ అనేక ఉద్యమాలను హైదరాబాద్ కేంద్రంగా నడిపించింది. పూనా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేసింది. దళితులకు ప్రత్యేక ఎలక్టోరేట్ ఉండాలని, జనాభా దామాషాలో వారికి ప్రాతినిధ్యం కల్పించాలని, దళితుల అభ్యున్నతి కోసం ఒక కోటి రూపాయల ఫండ్‌ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. విలియమ్ బార్టన్ స్కూల్‌ని ఉత్తమంగా తీర్చిదిద్దడంలోనూ ఈ ఫెడరేషన్ కీలకంగా వ్యవహరించింది. తర్వాతి కాలంలో గాంధీ(మాలవ్యా)–అంబేద్కర్‌ల మధ్యన జరిగిన పూనా ఒప్పందాన్ని హైదరాబాద్ దళితులు నిర్ద్వందంగా వ్యతిరేకించారు. దానికి నాయకత్వం వహించింది ఈ షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ పార్టి. దళితులకు ప్రత్యేకమైన నియోజకవర్గాలు కేటాయించకుండా అందరితో పాటు కలిసి పోటీచేయాలనడం అన్యాయమని షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ తరపున జె. హెచ్.సుబ్బయ్య, రాజమణీదేవి తదితరులు వ్యతిరేకించినారు. సెప్టెంబర్ –9నాడు (1944) 'పూనా ఒప్పంద' వ్యతిరేక దినాన్ని హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున నిర్వహించారు. నిరసన సభలు, సమావేశాలు నిర్వహించారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లో అరవముదం అయ్యంగార్ నేతృత్వంలోని 'రాజ్యంగ సంస్కరణల' కమిటీ చట్టసభలో 50శాతం సీట్లు ముస్లింలకు, మిగతా 50 శాతం సీట్లు హిందువులకు, ఈ హిందువుల్లో ఐదు సీట్లు దళితులకు కేటాయించాలని నివేదిక సమర్పించారు. ఈ నివేదిక పట్ల దళితులు తీవ్ర నిరసన వ్యక్తం జేసినారు. మొత్తం 85 సీట్లలో తమకు హిందువులతో సంబంధం లేకుండా పది సీట్లను దళితులకు కేటాయించాలని డిమాండ్ చేసినారు. అక్టోబర్ చివరి వారం (1944)నాడు రాజమణీదేవి నాయకత్వంలో సికింద్రాబాద్‌లో

పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టినారు. వీటన్నింటికీ స్ఫూర్తి అంబేద్కర్ దిశా నిర్దేశమే!

హైదరాబాద్ కేంద్రంగా రాజకీయాలు నడిపిన వారిలో శ్యామ్‌సుందర్, బి.ఎస్.వెంకటరావులు మరత్వాడాతో మమేకమయినారు. వీరిద్దరూ రాజకీయాల్లో తమ తొలి ఓనమాలను ఔరంగాబాద్‌లోనే నేర్చుకున్నారు. ఔరంగాబాద్ కేంద్రంగా ప్రజాభ్యుదయ కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాతి కాలంలో 'హైదరాబాద్ అంబేద్కర్'గా పేరుగాంచిన బి.ఎస్. వెంకటరావు అంబేద్కర్ స్ఫూర్తితో హైదరాబాద్ కేంద్రంగా ఉద్యమాలు నడిపినాడు. అంతేగాదు అంబేద్కర్ మహారాష్ట్రలో నిర్వహించే సభలు, సమావేశాలకు అతిథిగా హాజరై అక్కడి ప్రజలను ఆకట్టుకునే విధంగా ప్రసంగాలు చేశాడు. అందుకే అక్కడి ప్రజలు ఆయనకి 'హైదరాబాద్ అంబేద్కర్'అనే బిరుదునిచ్చారు. హైదరాబాద్‌లో పుట్టి మహారాష్ట్రలో చదువుకున్న రాజారామ్ భోలే కూడా అంబేద్కర్‌తో సన్నిహితంగా ఉన్నాడు. పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యక్రమాలు నిర్వహించాడు. ఆ తర్వాత బొంబాయి నుంచి లోక్‌సభకు ఎన్నికయినాడు.

జె.హెచ్.సుబ్బయ్య, పి.ఆర్.వెంకటస్వామి నాయకత్వంలో కొంతమంది దళిత నాయకులు పూనాకు వెళ్ళి అంబేద్కర్‌ని కలిసి ఆయన చేస్తున్న ఉద్యమాలకు సంఘీభావాన్ని ప్రకటించారు. పి.ఆర్.వెంకటస్వామి తర్వాతి కాలంలో హైదరాబాద్‌లో 'అంబేద్కర్ యూత్‌లీగ్'ని ఏర్పాటు చేసి దళితోద్యమ కార్యకలాపాలను చేపట్టారు. దీనికి కొనసాగింపుగానే హైదరాబాద్ షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ ఏర్పాటయింది. హైదరాబాద్ డిప్రెస్డ్ క్లాసెస్ అసోసియేషన్ ఏర్పాటైన తర్వాత రాజకీయ పరిణామాలను అంబేద్కర్‌తో చర్చించాలని జె.హెచ్.సుబ్బయ్య తదితరులు భావించారు. దీంతో జె.హెచ్.సుబ్బయ్య, పి.వి.మనోహర్, తుకారామ్ గాడే, పి.ఆర్.వెంకటస్వామి ప్రభృతులు ఢిల్లీ వెళ్ళి అంబేద్కర్‌ని కలిశారు. ఈ సంఘటన 1943లో ప్రారంభంలో జరిగింది. విద్యావంతులు, నిస్వార్థులైన యువకులు షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ కార్యకలాపాలు నిర్వహించడం పట్ల అంబేద్కర్ హర్షం వ్యక్తం చేశారు. (పి.ఆర్.వెంకటస్వామి; 1955, వాల్యూమ్ -1; పి.పి.255) ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంత్యుత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేవారు. అంబేద్కర్ పోరాట స్ఫూర్తి యువతరానికి అందజేయడంలో ఈ ఉత్సవాలు కీలకంగా పనిజేసేవి. ఇలాంటిదే అంబేద్కర్ 55వ జయంత్యుత్సవాలను పండిత ప్రేమకుమార్ ఆధ్వర్యంలో 1944 ఏప్రిల్ 14నాడు సికింద్రాబాద్‌లో నిర్వహించారు. జె.హెచ్.సుబ్బయ్య భవనంలో జరిగిన ఈ సమావేశం గురించి పత్రికల్లో బాగా ప్రచారం చేసినారు. అంబేద్కర్ తొలిసారిగా 1944 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఆంధ్రాలోని గుడివాడ, ఏలూరు, కాకినాడ, విశాఖపట్టణం, అనకాపల్లి, నెల్లూరు, కొవ్వలి, రామచంద్రాపురంలలో పర్యటించాడు. మరోవైపు దాదాపు అదే సమయంలో హైదరాబాద్‌లో కమ్యూనిస్టు ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఈ దశలో బ్రిటీష్ వైస్రాయ్ కౌన్సిల్‌లో లేబర్ మంత్రిగా ఉంటూ దేశంలోని వివిధ ప్రదేశాల్లో అంబేద్కర్ పర్యటించారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో 1944 సెప్టెంబర్‌లో పర్యటించాడు. సెప్టెంబర్ 20, 1944 నాడు అంబేద్కర్ హైదరాబాద్‌కు వచ్చారు. ఆయన నాంపల్లి రైల్వే స్టేషన్‌కు పి.ఎన్.రాజ్‌భోజ్‌తో కలిసి వచ్చాడు. అయితే ఈ సందర్భంలో అంబేద్కర్‌ని డిప్రెస్డ్ క్లాసెస్ అసోసియేషన్ తరపున బి.ఎస్.వెంకటరావు ఆహ్వానం పలకాల్సి ఉండింది. బి.ఎస్.వెంకటరావు రాజకీయ ప్రత్యర్థి, అంబేద్కర్ హైదరాబాద్ పర్యటన నిర్వాహకులయిన జె.హెచ్.సుబ్బయ్య పన్నాగం పన్ని బి.ఎస్.వెంకటరావుకు స్థానం లేకుండా చేశాడు. దీంతో బి.ఎస్.వెంకటరావు అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. దీన్ని బట్టి ఆనాటి నాయకుల్లో ఒకరిపై ఒకరు పైచేయి సాధించడానికి ఎన్ని ఎత్తుగడలు వేసేవారో అర్థమవుతుంది.

పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న అంబేద్కర్ తాను ఔరంగాబాద్‌లో నిర్మించ తలపెట్టిన మిలింద్ కళాశాల కోసం ఆర్థిక సహాయం (గ్రాంట్) గురించి మిలిటరీ (హైదరాబాద్) ప్రభుత్వంతో చర్చల కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సారి కూడా గతంలో మాదిరిగానే సికింద్రాబాద్ ప్రెండర్‌గాస్ట్ రోడ్డులో ఉన్న జె.హెచ్.సుబ్బయ్య భవనంలోనే మకాం వేశాడు. ఈ సమయంలో గృహ నిర్బంధంలో ఉన్నటువంటి బి.ఎస్.వెంకటరావుని విడిపించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కొంతమంది మరత్వాడా నాయకులు అంబేద్కర్‌ని కోరినారు. అందుకు సిద్ధపడి నిర్బంధంలో ఉన్నటువంటి వెంకటరావుని కలిసేందుకు సమ్మతిని తెలిపాడు. అయితే ఇక్కడ వెంకటరావుపై పైచేయి సాధించేందుకు సుబ్బయ్య చక్రం తిప్పి ఆ సమావేశం జరగకుండా అడ్డుకట్ట వేయగలిగిండు.

హైదరాబాద్‌పై పోలీసు చర్య అనంతరం 'డిప్రెస్డ్ క్లాసెస్ వెల్ఫేర్ ఫండ్' పేరుని 'షెడ్యూల్డ్ కాస్ట్ ట్రస్ట్ ఫండ్'గా మార్చినారు. ఇందులోని సభ్యుల్లో కూడా భారీ మార్పులు జరిగాయి. ఇందులో ఎక్కువ మేరకు 'షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్' నాయకులకు స్థానం దక్కింది. ఈ ట్రస్ట్ ఫండ్ బోర్డులో మొత్తం పదిమంది సభ్యులున్నారు. వారిలో జె.హెచ్.సుబ్బయ్య, పి.వి.మనోహర్, కె.ఆర్.వీరస్వామి, కృష్ణకుమార్ మానె, పి.ఎస్.సర్వడె, తర్వాతి కాలంలో, ఎం.ఆర్.కృష్ణ, జె.హెచ్.కృష్ణమూర్తి సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ హైదరాబాద్ రాజ్యంలో భాగమైన ఔరంగాబాద్‌లో పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్మించ తలపెట్టిన కళాశాలకు 12 లక్షల రూపాయలను అప్పుగా ఇవ్వాలని నిర్ణయించింది.

1950, మే మూడోవారంలో అంబేద్కర్ మరోసారి హైదరాబాద్‌కు విచ్చేశారు. ఈసారి తాను ఔరంగాబాద్‌లో నిర్మించ తలపెట్టిన కళాశాల 12 లక్షల అప్పు ఒప్పందం చేసుకున్నారు. ఇంతకు ముందే చెప్పుకున్నట్లు నిజాం ప్రభుత్వం దళితుల అభ్యున్నతికోసం ఏర్పాటు చేసిన ఒక కోటి రూపాయల షెడ్యూల్డ్ కాస్ట్ ట్రస్ట్‌ఫండ్ నుంచి ఈ మొత్తాన్ని అప్పుగా కేటాయించారు. హైదరాబాద్ రాజ్యం పోలీసు చర్య అనంతరం ఇండియాలో భాగమైన తర్వాత కూడా ఈ కమిటీ కొనసాగింది. ఇక్కడే ఒక విషయం చెప్పాలి. గ్రాంటుగా విడుదల చేసిన ఈ మొత్తాన్ని చెల్లించాల్సిందిగా తర్వాతి కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బొంబాయిలోని పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీకి తాఖీదులు జారీ చేసింది. గ్రాంటుని విరాళంగా ప్రకటించి మాఫీచేయాలని సొసైటీ తరపున మాజీ

చీఫ్ జస్టిస్ సికింద్రాబాద్‌కు చెందిన రాజారామ్ భోలే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నారు. ఈ కేసు హైకోర్టులో విచారణకు వచ్చింది. జస్టిస్ కోట పున్నయ్య జడ్జిగా ఉన్నారు. ప్రభుత్వం తరపున కాంగ్రెస్‌కు చెందిన ఎం.ఎస్.రాజలింగం వాదించినాడు. అయితే ఆనాడు విద్యాశాఖ మంత్రిగా ఉన్నటువంటి మాజీ చీఫ్ జస్టిస్ గోపాలరావు ఎగ్బోటే పూనిక మేరకు ఆ రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తున్నదని ప్రకటించినాడు. ఎగ్బోటే పూర్వీకులు మహరాష్ట్రీయులు కావడం కూడా ఇందుకు తోడ్పడింది.

అంబేద్కర్ ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా ఒక్క దళితులే గాకుండా హైదరాబాద్ సమాజం మొత్తం ముఖ్యంగా హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న మహరాష్ట్రీయులు ఆసక్తిగా, ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేవారు. నిజాం ప్రభుత్వంతో గ్రాంటు విషయంలో ఒప్పందం చేసుకునేందుకు అంబేద్కర్ హైదరాబాద్‌లో ఉన్న సమయంలో హైదరాబాద్ బోట్స్ క్లబ్‌లో కొంతమంది విద్యావంతులతో సమావేశమయ్యారు. ఇక్కడ ఉపన్యాసమివ్వకుండా సభికుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన బుద్ధిజంలోకి దళిత సమాజం మారడానికి సంబంధించి, ఐక్యరాజ్యసమితిలో షెడ్యూల్డ్ కులాల వారి స్థితిగతుల చర్చించాలనే అంశాలపై స్పందించారు. ఈ దేశంలో దళితులకు సమాన హోదా ఉండాలి, ఐక్య రాజ్యసమితిలో విషయం చర్చించడంపై తనకేమి అభ్యంతరం లేదని చెప్పాడు. "he would not give any other lead to the Sechdeuled Castes except asking them to become men, equal men in this country and not to accept to be the second grade citizens.

Answering a question on democracy he said that "Hindu society is not ideally suited for democrary. It is against democratic tradations by its caste and such-caste divisions. Even untouchability grave even. Asked "whether it was true that the Scheduled Castes Federation passed a resolution saying that they would take the matter before U.N.O." Dr. Ambedkar denied any resolution being passed. He said, however, there was nothing against any citizen carrying a subject before U.N.O." (పి.ఆర్.వెంకటస్వామి; భాగం-2; 1955) అంబేద్కర్ మరోసారి డిసెంబర్ 31, 1950, 1 జనవరి 1951లో హైదరాబాద్‌కి వచ్చారు. ఈసారి హైదరాబాద్ తాత్కాలిక ప్రభుత్వంలో దళితులకు దక్కాల్సిన న్యాయమైన వాటా గురించి చర్చలు జరిపినారు. ప్రభుత్వ అతిథిగా లేక్‌వ్యూ గెస్ట్ హౌజ్‌లో ఉన్నారు. జె.హెచ్.సుబ్బయ్య తన స్వప్రయోజనాల కోసం అంబేద్కర్‌ని తప్పుదారి పట్టిస్తున్నారని భావించిన కొంతమంది దళిత నాయకులు అంబేద్కర్‌ని కలవాలని ప్రయత్నించారు. ఇందులో లీలావతి నాథమ్, జె.పి.నారాయణ, పి.వి.మోహన్ తదితరులున్నారు. ఇందులో లీలావతినాథమ్ అంబేద్కర్‌ని కలిసి ఒక నివేదికను సమర్పించింది. మాలకులానికి చెందిన లీలావతినాథమ్ క్రిస్టియన్ మతం పుచ్చుకున్నారన్న ప్రచారంతో ఆమె రిజర్వేషన్ సీటు నుంచి నామినేషన్ వేసిన తర్వాత ప్రత్యర్థులు దాన్ని చెల్లకుండా చేసినారు. రాజకీయాల్లో ఒకరిపై ఒకరు పైచేయి సాధించడానికి ఎత్తులు, పై ఎత్తులుగా దీన్ని చూడాల్సి ఉంటుంది. అలాగే హైదరాబాద్‌కే చెందిన డిప్రెస్డ్ క్లాసెస్ అసోసియేషన్ నాయకులు విద్యావంతులైన కె.ఆర్.వీరాస్వామి 1949లో ఢిల్లీలో అంబేద్కర్‌ని కలిసి 'పోలీసు చర్య' గురించి చర్చలు చేసినారు. రజాకార్లుగా వ్యవహరించినవారే వేషం మార్చి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన నివేదించారు.

మరోవైపు జనవరి 12, 1953 ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు దేశంలోనే మొట్టమొదటిసారిగా అంబేద్కర్‌కు గౌరవ డాక్టరేట్‌ని (డి.లిట్) ప్రదానం చేసింది. ఈ డిలిట్‌ని స్వీకరించడానికి అంబేద్కర్ స్వయంగా హైదరాబాద్‌కు వచ్చినారు. విదేశాల్లో ఉన్నత చదువులు, డాక్టరేట్ పొందినప్పటికీ, ప్రపంచంలోని మొత్తం ఐదారుగురు మేధావుల్లో ఒక్కడుగా ఆనాడే గుర్తించబడ్డప్పటికీ ఆయనకు స్వదేశంలో ఏ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ని ప్రకటించలేదు. ఈ పనిని ఉస్మానియా విశ్వవిద్యాలయం చేసింది. అనంతరం 1954 నవంబర్‌లో మరోసారి ఆయన హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సారి సికింద్రాబాద్ ప్యారడైజ్ హోటల్‌లో మకాం చేశారు. నవంబర్ -14వ తేదీ కొంతమంది దళిత విద్యార్థుల కోరిక మేరకు కాచీగూడాలోని ఎస్సీ హాస్టల్‌ని సందర్శించి వారి నుద్దేశించి ప్రసంగించారు. అలాగే 15వ తేదీన కోఠీ (జాంబాగ్)లోని వివేకవర్ధని విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి కళాశాల అధ్యాపకులు డా.ఎస్.డి.సత్వాలేకర్, సచిన్ మాడేకర్, గోపాలరావు ఎగ్బోటే (ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్) తదితరులు పాల్గొన్నారు. 'నాయకుడు ఎలా ఉండాలి అనే అంశంపై ఆయన ప్రసంగిస్తూ "నాయకుడనేవాడు సమాజానికి ఆదర్శంగా వుండాలి, ప్రజ్ఞావంతుడుగా, క్రమశిక్షణా పరుడిగా, శీలవంతుడిగా, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేవాడిగా, మార్గదర్శకుడిగా వుండాలి" అని అన్నారు.

ఏది ఏమైనా హైదరాబాద్‌కు అంబేద్కర్‌కు అవినాభావ సంబంధమున్నది. ఆయన రాజకీయ కార్యాచరణ స్ఫూర్తితో 'హైదరాబాద్ అంబేద్కర్'గా బి.ఎస్.వెంకటరావు వెలుగొందినాడు. నిజాం ప్రభుత్వంలో విద్యాశాఖా మంత్రిగా రాణించినాడు. బత్తుల శ్యామ్‌సుందర్ అంబేద్కర్ భావజాలాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి కృషి చేసినాడు. ముఖ్యంగా హైదరాబాద్, పాత హైదరాబాద్-కర్నాటక, మరఠ్వాడా ప్రాంతాల్లో బలమైన నాయకుడిగా ఎదిగినాడు. నిజానికి ఈనాడు గ్రామ గ్రామాన అంబేద్కర్ విగ్రహాల స్థాపనకు నాంది శ్రీకారం చుట్టింది శ్యామ్‌సుందర్. ఆయన బీదర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి 1957 ఆ ప్రాంతంలోనే హైకోర్టు దాకా కొట్లాడి సాధించినాడు. అంబేద్కర్ విగ్రహం స్థాపించడం ఆత్మగౌరవ ప్రకటనలో భాగం చేసినవాడు శ్యామ్‌సుందర్. అంబేద్కర్ 'ఎడ్యుకేట్, ఆర్గనైజ్, అజిటేట్' అనే నినాదాన్ని 'ట్రూ స్పిరిట్'తో ఆచరించింది కె.ఆర్.వీరస్వామి. ఈయన హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా దళితుల విద్యాసదస్సుని నిర్వహించడమే గాకుండా ఎమ్మెల్యేగా, విద్యావేత్తగా రాణించినారు. వీరి స్ఫూర్తిని, అంబేద్కర్‌ని ఆచరణను కలుపుకొని కొట్లాడాల్సిన బాధ్యత నేటి యువతరం మీద ఉన్నది.

-సంగిశెట్టి శ్రీనివాస్,
m : 9849220321
e : sangishettysrinivas@gmail.com

రాజును బంధించిన చెరసాల

'సీతారాంబాగ్ దేవాలయం'

అడుగడుగునా అనేకానేక సతత హరిత, సప్త రంగుల తీరున్నొక్క, ఫల పుష్ప సుగంధ భరిత ఉద్యానవనాలు, తుమ్మెదల ఝంకారపు ధ్వనులు ప్రతిధ్వనించే పూదోటలు, పొదరిండ్ల వలన ఆ బంగారు దినాలలో భాగ్య నగరాన్ని "భాగ్ నగర్" అని కూడా అనేవారు. నిజంగానే అదొక సార్థక నామధేయం. భాగ్‌ల పేరుతోనే అనేకానేక బస్తీలు అవతరించాయి. ఉదాహరణకు సీతారాం బాగ్, బషీర్ భాగ్, జాం భాగ్, అజీజ్ భాగ్, మురళీధర్ బాగ్, ఇబ్రాహీం భాగ్, పూల్ భాగ్, మూసారాం భాగ్, రాం భాగ్, కిషన్ భాగ్, లలితా భాగ్, అసద్ భాగ్ (నేటి నిజాం కాలేజీ), భాగ్ లింగంపల్లి, భాగ్ అంబర్ పేట్, భాగే ఆం (పబ్లిక్ గార్డెన్). మరి ఆ తోటలన్నీ ఏమైపోయినాయి? నగరం నిప్పుల కొలిమిలా ఎట్లా మారింది?

విజ్ఞులు, పెద్దలు ఆగ్రహించకపోతే ఒక చిన్న మాట సెలవిస్తాను. భారతదేశంలోని ఈ ఉద్యానవనాల పోషణా, పెంపకం సంస్కృతి (సెంటర్ ఫర్ హార్టికల్చర్) మధ్య ఆసియా దేశాల నుండి దిగుమతి అయిందని కూడా ఒక ఆలోచన చెలామణీలో ఉంది. మధ్యాసియా లోని ఉజ్బెకిస్తాన్ నుండి వచ్చిన బాబర్ ''భాగ్‌లు లేని భారతదేశాన్ని'' చూసి ఆశ్చర్యపోయాడట. హిమము కురిసే మంచు ప్రాంతాల నుండి వచ్చిన మొగలులు మన దేశంలోని వేడిని తట్టుకోలేక విశాలమైన సతతహరిత ఉద్యానవనాలను పెంచి పోషించారు. ఫలితంగా షాజహాన్ కాలంలోనే కాశ్మీరులో "షాలిమార్ గార్డెన్" ఏర్పడింది. దానిని సందర్శించిన ఆ షహెన్‌షా భూమ్మీద వెలిసిన స్వర్గం అంటూ ఏదైనా ఉంటే అది ఇదే ఇదే ఇదే అని ఫార్సీ కవిత్వ భాషలో ముమ్మార్లు కీర్తించాడట. ఏసిలు లేని ఆ కాలంలో వేడి వాతావరణాన్ని చల్లబరచటం కోసం ఉద్యానవనాలలో వాటర్ ఫౌంటేన్‌లను అనగా జల యంత్రములను పరిచయం చేసిన ఘనత కూడా మొగలులదే.. మండుటెండలను పండు వెన్నెలలుగా మార్చేందుకు మన దేశానికి కర్బూజాలను, తర్బూజాలను పట్టుకొచ్చింది వారే. మన ప్రాచీన కట్టడాలు, శిల్ప వైభవానికి తోడుగా మినార్‌లు, కమాన్‌లు, గుంబజ్‌లు, మహళ్ళు, మక్బరాలను నిర్మించి భారతదేశ వాస్తు శిల్ప నైపుణ్యానికి నగిషీలు అద్దింది మొగలులే. వారే రాకపోతే, లేకపోతే మనకు ఒక ఎర్రకోట, ఒక తాజ్ మహలు లేకపోయేది కదా.. ఇకపోతే బిర్యానీలు, పులావ్‌లు కూడా తెలియని మనం పులిహోరా, దద్దోజనం, చెక్కర పొంగళిలతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చేది కదా!

సరే మళ్ళీ మన సీతారాం భాగ్ దేవాలయానికి పోదాం పదండి. మంగళ్ హాట్ నుండి మల్లేపల్లికి వెళ్ళే దారిలో ఎడమవైపు కొంచెం లోపల ఈ పురాతన దేవాలయం ఉంది. రాజస్థాన్ నుండి తెప్పించిన పాలరాతితో సీతారాముల విగ్రహాలను తొలిచి 1833 ప్రాంతంలో అనగా 182 సంవత్సరాల క్రిందట ఈ దేవాలయాన్ని పురాన్ మల్ గనేరీ వాలా అనే ఒక రాజస్థానీ బ్యాంకర్ నిర్మించాడు. 25 ఎకరాల విశాలమైన ఉద్యానవనం మధ్యలో ఉన్న ఈ దేవాలయాన్ని ప్రజలు సీతారాం భాగ్ అన్నారు. ఈ దేవాలయం నిర్వహణ కోసం నిజాం నవాబులు ఒక జాగీరును దానం చేసారు. ఈ దేవాలయం వాస్తు శిల్ప నిర్మాణ నైపుణ్యమంతా మొగలాయీ, రాజస్థానీ, పద్ధతులలో ఉంది. ఇప్పటికీ గనేరీ వాలా వంశ వారసులే ఈ దేవాలయాన్ని నిర్వహిస్తున్నారు.

సరే ఇక అసలు కథకు వద్దాం. ఈ సీతారాం భాగ్ దేవాలయానికి వనపర్తి సంస్థానాధీశుడైన రాజా రామేశ్వరరావుకు సంబంధించిన జనరంజకమైన, మనో రంజకమైన "మజేదార్" కహానీ ఒకటి ఉంది. ఇక ఆ కథ కూడా చెప్పుకుందాం.

సీతారాంబాగ్ దేవాలయం

వనపర్తి సంస్థానానికి చెందిన రాజా రామేశ్వరరావు ఒక అద్భుత సాహస వీరుడు. రాబిన్ హుడ్ లాంటివాడు. కేవలం వీరుడే కాక అష్ట భాషా కోవిదుడు. తెలుగు, ఉర్దూ, పర్షియన్, ఇంగ్లీష్ భాషలలో బాగా పట్టున్నవాడు. పద్నాలుగు సంవత్సరాలకే సింహాసనాన్ని అధిష్టించాడు. 1830లలోనే అతను యూరోపియన్ పాశ్చాత్య జీవన శైలిని అనుసరించాడు. యూరపుకు సంబంధించిన మిలిటరీ దుస్తులను, ఫర్నీచర్‌ను, క్రాకరీ, కట్లరీని వాడేవాడు. హైద్రాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెంటుతో స్నేహ సంబంధాలను నిర్వహించేవాడు.

కోడె వయసులో శంకరమ్మ అనే పల్లె పడుచును ప్రథమ వీక్షణంలోనే మోహించి ఆమెను గుర్రంపై తన గడీకి ఎత్తుకొచ్చి పెళ్ళి చేసుకున్నాడు. శంకరమ్మతో పాటు ఆమె చిన్నారి చెల్లె "జానమ్మ" అనే మూడు సంవత్సరాల పాప కూడా గడీలోనే పెరిగి పెద్దదయ్యింది. ఆమెకు కరోలినా అనే కొత్త పేరు పెట్టి మద్రాసులోని కాన్వెంటు విద్యాభ్యాసానికి పంపాడు. అక్కడామె ప్రతిభావంతురాలుగా పేరు తెచ్చుకుంది.

శంకరమ్మకు పిల్లలు కలగనందున రాజావారు కరోలినాను కూడా వివాహం చేసుకున్నాడు. కరోలినా పాశ్చాత్య జీవన శైలిని అనుసరించింది.

రాజా రామేశ్వరరావు అతి పెద్ద సైనిక పటాలాన్ని నిర్వహించే వాడు. అది చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. దాని వలన ఖజానా ఎప్పుడూ ఖాళీగా ఉండేది. ఖజానా నిండుకున్నది మహా ప్రభూ అని మంత్రి చెప్పగానే మరి ఎటువైపు బయలుదేరుదాం అని అడిగి తనకు వ్యతిరేకులైన జాగీరులవైపో లేక సంస్థానాల వైపో దాడికి బయలుదేరే వాడు. ఉన్న వాళ్ళను కొట్టి తన ఖజానాను నింపేవాడు. ఒకరోజు ఒక వార్త వేగుల ద్వారా అందింది. నిజాం సర్కారు వారి జమాబందీ "పేష్‌కష్" (ఆదాయం) కర్నూలు నుండి హైద్రాబాద్ వైపు బయలు దేరిందని. దానికి కాపలాగా సైనికుల బందోబస్తు కూడా ఉందని ఉప్పు అందింది. దేనికీ బెదరని గండరగండడు, సాహసకార్యాలపై మక్కువ కల్గిన రాజావారు తన ఆఫ్రికన్ సైనికులతో బయలుదేరి జడ్చర్ల వద్ద మెరుపుదాడి చేసి బొక్కసాన్ని దోచుకున్నాడు. వార్త విని నిజాం నవాబు పరేషాన్ ఐపోయాడు. ఆఖరికి మంచి మాటలతో రాజావారిని హైద్రాబాద్‌కు రప్పించి మోసంతో సీతారాంభాగ్ దేవాలయంలోని ఒక గదిలో ఖైదు చేశాడు.

రాజావారు తన భోజనం తన వంటవారు మాత్రమే వండాలని నిజాం నవాబుకు షరతు పెట్టాడు. గుడి అవతల కొద్ది దూరంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని కొద్దిమంది వంట బ్రాహ్మలు ప్రతిరోజు రాజాకు భోజనం సిద్ధం చేసి పంపేవారు. రాజాగార్ని బంధించిన గది చుట్టూ విచ్చుకత్తుల సైనికుల పహారా ఉండేది.

ఒకరోజు రాజుగారు తన తండ్రి తద్దినం ఉందని బ్రాహ్మలతో తన గదిలో పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని నిజాంను కోరాడు. "కొండ ఎలుక" లాంటి రాజా మనస్తత్వం తెలియని నవాబు సరే అన్నాడు. బ్రాహ్మలు రాగానే గది తలుపులు బిడాయించుకున్నాయి. పురోహితుల మంత్రాలు, గంటల గణగణలు లోపల నుండి వినబడుతున్నాయి. అపరాహ్ణం వేళ దాటిపోయింది. ఇంకా ఎంత సేపని ఇవతలి నుండి సైనికులు తలుపులను దబదబా బాదారు. మరి కొంచెం సేపు అని రాజావారి గొంతు వినబడింది. మరో గంట కూడా గడిచింది. గంటల గణగణ అలానే కొనసాగుతుంది. మంత్రోచ్చారణలు మాత్రం లేవు. అనుమానం వచ్చిన సైనికులు తలుపులు బద్దలు కొట్టి లోపలికి దూసుకు వెళ్ళారు. గదిలో ఎవరూ లేరు ఒక పెద్ద సొరంగం తప్ప. ఆ సొరంగం చుట్టూ ఒక గండుపిల్లి చక్కర్లు కొడుతుంది. దాని మెడలో వ్రేలాడుతున్న గంట గణగణా మ్రోగుతుంది. ఆదరాబాదరాగా సొరంగంలోకి దిగిన సైనికులు చివరికి గుడి అవతల ఉన్న వంట గదిలో తేలారు.

నిజాం నవాబుగారికి ఈ పిడుగులాంటి వార్త చేరేసరికి రాజా రామేశ్వరరావు తన అనుచరులతో వాయువేగంతో వెళ్ళే అరబ్బీ గుర్రాలను అధిరోహించి మనోవేగంతో పురానాపూల్ దాటి తన వనపర్తి సంస్థానంవైపు దూసుకువెళ్తున్నాడు. "చిక్కడు దొరకడు" సామెత అతని పట్ల నిజం అయ్యింది.

రాజులు మారారు. రోజులూ మారాయి. తర్వాతర్వాత ఘనత వహించిన ఆ పురాతన పవిత్ర సీతారాం భాగ్ దేవాలయ ప్రాంగణంలో సంస్కృత పాఠశాల వెలిసింది. దాని పేరు "వేదాంత వర్ధని". దానిని స్థాపించిన మహానుభావుడు "నాగులపల్లి కోదండరామారావు. అందరూ ఈయన్ని ఎన్.కే.రావు అనేవారు. వృత్తి రీత్యా న్యాయవాది. తన ప్రజ్ఞను ప్రజలకోసం వినియోగించాడు. తన సంపాదన కూడా దేశం కోసమే హారతి కర్పూరంలా వెచ్చించాడు. తన గ్రంథాలయాన్ని వేదాంత వర్ధనికి సమర్పించాడు. ఆయన పాండిత్యం ముందు ఎవరు మాట్లాడినా, చేతులు కట్టుకుని మాట్లాడేవారు. మాడపాటి హన్మంతరావు, సురవరం ప్రతాపరెడ్డి తర్వాత ఆంధ్రమహాసభను నడిపించిన మూడవ కార్యకర్త ఇతనే. ఈయన ఆంధ్ర విద్యాలయాన్ని కూడా స్థాపించాడు. టీచర్లు రాకపోతే తనే క్లాసులను నిర్వహించేవాడు. పేద విద్యార్థులకు ప్రతి వారం 200 రూ॥లు విరాళంగా ఇచ్చేవాడు. కాంగ్రేసు కేసులను ఉచితంగా వాదించటమే గాక కాంగ్రేసు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష కూడా అనుభవించాడు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం రాగానే కె.ఎన్.రావు ప్రతిభను గుర్తించిన సర్దార్‌పటేల్ కేంద్రంలో ఆర్థిక సలహాదారుడుగా నియమించాడు. తన కూతురు పెళ్లి ఉన్నందున ఆ పదవిలో అపుడే చేరలేనని ఒక నెల గడువు కావాలని ప్రార్థించాడు. సరే అన్నాడు సర్దార్ పటేల్. నెల తర్వాత ఢిల్లీ వెళ్లగానే రాజకీయ కారణాల వలన ఆ పదవి రద్దు అయ్యింది. అయినా పటేల్ ఆ నెల జీతాన్ని లక్ష రూ॥ల చెక్కుతో రావుగారికి అందచేశాడు. చేయని ఉద్యోగానికి జీతం తీసుకుని దేశానికి నష్టం చేయనని ఆ డబ్బును వినయంగా నిరాకరించి కనీసం రైలు చార్జీలు, హోటల్ చార్జీలన్నా తీసుకోక హైద్రాబాద్‌కు వాపస్ వచ్చాడు.

1948లో పోలీస్ యాక్షన్ జరిగాక హైద్రాబాద్ రాష్ట్రంలో మిలిటరీ పరిపాలన ఉన్నప్పుడు కొంతకాలం ఆర్థిక సలహాదారుడిగా పనిచేశారు. తర్వాత వచ్చిన ప్రజాప్రతినిధుల పరిపాలనలో ఇటువంటి దేశభక్తులకు స్థానం కరువయ్యింది. ఆయన జీవితాంతం ఎటువంటి పదవులు, భోగభాగ్యాలు ఆశించలేదు. అందుకే కాంగ్రేసు పార్టీ వాళ్లెవరికీ అప్పుడు, ఇప్పుడు కూడా కనీసం నాగులపల్లి కోదండరావు అన్న పేరైనా తెలియదు.

వేదాంత వర్ధని విద్యార్థుల వేద ఘోషలతో సీతారాంభాగ్ దేవాలయం పులకించి పోయింది. ఉచిత విద్యాదానం వెల్లివిరిసింది. ఆచార్య ఖండవల్లి నరసింహ శాస్త్రి వ్యాకరణ పండితులుగా ఇక్కడే పని చేశారు. వారు అమరభారతి అను లిఖిత మాస పత్రికను ఈ నేల మీదే నిర్వహించారు. ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు రవ్వా శ్రీహరి, కేకే రంగనాథాచార్యుల వారు ఇక్కడే ఈ పూదోటలో పూచిన పువ్వులే. మన కాలం వీరుడు, విప్లవ కవి జ్వాలాముఖి అను కొమాండూరు వీర రాఘవాచార్యులు ఈ ప్రాంగణంలోనే జన్మించి ఈ పాఠశాలలోనే ఓనమాలు దిద్దుకుని "ఇంతింతై వటుడింతై" అన్నట్లు కారాగారాన్ని దర్శించి కటకటాలను లెక్కించాడు.

అట్లా గుడి బడి కలగిలిస్తే కలసి నడిస్తే ఒక సీతారాంభాగ్ దేవాలయం అయ్యింది.

(షహర్ నామా (హైద్రాబాద్ వీధులు - గాథలు) పుస్తకం నుంచి)

-పరవస్తు లోకేశ్వర్
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

పర్యావరణం - శాస్త్రం - నైతికత - తాత్విక దృక్పథాలు

(గత సంచిక తరువాయి)

జీవ కేంద్రక నైతికత - అంతర్నిహిత విలువలు

భూమిపై గల జీవ వైవిధ్యం అత్యంత సంక్లిష్టమైంది. దీనిని అర్థం చేసుకోవటం మానవాళికి అవసరం అని ఆవరణ శాస్త్రం చెపుతుంది. జీవశాస్త్రం రెండు వేల ఏళ్ల సంవత్సరాల క్రిందటే జంతు, వృక్ష జాతులను వర్గీకరించడం మొదలు పెట్టింది. శాస్త్రీయంగా ఈ పనిని అరిస్టాటిల్ కూడా నిర్వర్తించాడు. శాస్త్రీయంగా ప్రస్తుతం 1.4 మిలియన్ల జాతులను వర్గీకరించారు. అసలు ఉనికిలో ఉన్న జాతుల కంటే, వర్గీకరించినవి అతి స్వల్పశాతం మాత్రమే.

ప్రతి జాతి కొద్ది సంఖ్య మొదలుకొని బిలియన్ల కొద్దీ సభ్యులను కలిగి ఉంటుంది. ప్రతి జాతి పర్యావరణంలో తన ఆవాస స్థానంలో ఉంటూ తన పరిసర జీవులతో చర్య జరుపుతూ ఉంటుంది. జీవిక కోసం. ప్రతి జీవి తనుండే పరిసరం నుండి పోషకాహారం స్వీకరించుతుంది. తన సంతతిని వృద్ధి పరచుకుంటుంది. ఇందుకు అవసరమైన సామర్థ్యం మిలియన్ల కొద్దీ సంవత్సరాల మారుతున్న పర్యావరణం, పరివర్తనలు, సహజ ఎంపిక అనే పరిణామాలపై ఆధారపడి మార్పులు పొందుతూ వచ్చింది. అయితే ఈ సామర్థ్యం ప్రతి జాతి యొక్క జన్యు సంగీతం (జెనెటిక్ కోడ్)లో నిక్షిప్తమై ఉంటుంది. ప్రతి జీవి ఒక బిలియన్ మొదలుకొని పది బిలియన్ల పరిమాణం గల సమాచార శకలాలను తన జన్యు సంకేతంలో కలిగి ఉంటుంది.

ఇంత వైవిధ్యం ఉన్నప్పటికీ వాటికి ముప్పుకలుగుతున్నది. దీనిపై శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతూనే కలుగుతున్న ముప్పును అంచనా కడుతున్నారు. Some Scientists, including E.O. Wilson, estimate that over one hundred species per day, almost 50,000 species each year become extincts.

ఈ విధమైన అంతరింపులు అనేవి ఒక జీవ వాస్తవం అని శిలాజ రికార్డులు తెలుపుతున్నాయి. ఈ శిలాజ ఆధారాలు తెలుపుతూ ఉన్న మరొక వాస్తవం కూడా ఉంది. అదేమంటే ఇటువంటి అంతరింపులు మానవ కారణాలు, ప్రమేయాలు లేకుండానే సహజంగా జరుగుతున్నాయి, వీటిని నేపథ్య అంతరింపు వృద్ధిరేటుగా (background exinction rate) శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇట్లాంటి అంతరింపులు ప్రస్తుతం సంభవిస్తున్న వాటికంటే అతి తక్కువగా ఉన్నాయి. నేపథ్య అంతరింపులు వృద్ధి రేటుకంటే వందరెట్లు అధికంగా ఈనాడు క్షీరదాలు అంతరిస్తున్నాయి. అసలు భూమి ఏక మొత్తంగా అంతరింపుకు అనే సంఘటనకు గురయ్యే అవకాశం పెరిగిందనేది వాస్తవం. వీటి నుండి భూమి తిరిగి కోలుకొని యథాతథ స్థితికి రావడానికి పదిమిలియన్ల సంవత్సరాలు పట్టవచ్చుని కొన్ని అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతుంది. జీవితానికి జీవికి ఉన్న విలువ ఏమిటనేది ప్రశ్న. అయితే కొన్ని మంచి ప్రయోజనాత్మక వాదాలు జీవ వైవిధ్యం కాపాడబడాలనే వాదనను బలపరుస్తాయి. మరికొన్ని ఇంకొంత మౌలికమైన విషయాలను తీవ్రంగా చర్చకు పెట్టవచ్చు. ఈ విధంగా ఇటువంటి సమస్యలు, సందర్భాలు ఎదురైనప్పుడు వీటి వల్ల మానవులకు ఇతర జీవరూపాలతో ఉన్న నైతిక సంబంధం ఏమిటనేది ప్రధానంగా మారుతుంది.

ఈ నైతిక సంబంధం విషయంగా జరిగిన చర్చ జీవకేంద్రత లేదా ప్రాణి కేంద్రక నైతికతగా రూపు దిద్దుకుని పర్యావరణ తత్వంలో ముఖ్య భాగమై నిలుస్తుంది. ఇప్పటి వరకు జరిగిందేమిటి? మానవులకు ఇతర జీవరూపాలతో సంబంధం, నైతిక బాధ్యతల విషయంగా సంప్రదాయ నైతికతలను విస్తరించడం మీద దృష్టి పెట్టాయి. అసలు జీవకేంద్రక నైతికత గురించి మాట్లాడటం హేతుబద్ధమేనా అనే విషయమూ చర్చింబడింది. Much of the recent Philosophical work on the environment breaks with standard ethical theory and strikes to re think the human nature relationship. దీనిని బట్టి చూస్తే ప్రాణికి నైతిక సిద్ధాంతంతో పర్యావరణ తాత్త్విక రచన ఇటీవల తెగదెంపులు చేసుకొని మనిషి - ప్రకృతిపై పునరాలోచనకు దిగాయని తెలుస్తున్నది. ఇటీవల తాత్విక రచనల్లో ఆ ధోరణి ప్రతిఫలించింది. ఈ తరహా ఆలోచనా ధార పర్యావరణ నైతికతగా కంటే పర్యావరణ తాత్వికతగానే వ్యవహరించ బడుతున్నది. సహజ ప్రకృతి ప్రపంచంలో మానవుల స్థానం నిర్ధారించబడాలంటే తాత్త్వికుల కేవలం నైతిక ప్రశ్నలకంటే మిగిలిన ఎన్నిటినో సంబోధించ వలసి వస్తుంది. అది భౌతిక శాస్త్రాంగాలు, జ్ఞాన సిద్ధాంతాలు, సౌందర్య శాస్త్రం, రాజనీతి తత్వం మొదలైనవి నైతికతను గురించి పునరాలోచన చేస్తున్నప్పుడు ప్రధానమవుతాయి.

ఇంతకుముందే రూపొందించబడిన నైతిక సిద్ధాంతాలను పర్యావరణ సమస్యల పరిష్కారం విషయంగా అన్వయించే ఏ తాత్విక విధానాన్నైనా ప్రక్కకు నెట్టి, పర్యావరణ దృక్పథంతో సమగ్రమైన పర్యావరణ తాత్త్వికతను వృద్ధి పొందించే విధానం రూపొందాలి.

ఇక్కడ ఎదురయ్యే ఎన్నో ప్రశ్నలకు ఒకే సమాధానం

లభించదు. కొన్నిటిలో మన హేతువు పర్యావరణ విధ్వంసంలో భాగంగా ఉంది. మానవులకు ముప్పును తెచ్చి పెడుతూ అనేక రకాల ప్రశ్నలు లేవనెత్త బడతాయి. మరికొన్ని విషయాల్లో మనం ప్రకృతితో వ్యవహరించే విధానంలోని నైతికత / విలువ ఆధ్యాత్మిక, సౌందర్యాత్మక, సాంస్కృతిక విలువలను బాధిస్తుంది. మరికొన్నిటిలో ప్రకృతి వస్తువులకు మానవులు ప్రత్యక్ష హానినే తలపెడుతుండటాన్ని గమనించవచ్చు. ఈ విధంగా చూస్తే పర్యావరణ తాత్త్వికతకు ఒక లక్ష్యం ఉందని చెప్పడానికి సందేహమేలేదు. The goal of many environmental philosophers is to provide a single systematic principal or theary that | can account for these various concens.

ఇటువంటి లక్ష్యం నెరవేరబడాలంటే నైతిక శాస్త్రంతో పనిచేస్తేనే చాలదు. అధి భౌతిక శాస్త్రం, జ్ఞాన సిద్ధాంతం, సౌందర్య శాస్త్రం రాజకీయ తత్వశాస్త్రాలలోని ఆలోచనలు ఉపకరిస్తాయి.

తాత్త్వికంగా వచ్చిన మార్పును అర్థం చేసుకోవడం ఈ సందర్భంలో గుర్తించాలి. ఈ మార్పు నైతికతకు సంబంధించిన ప్రశ్నలకు విలువకు సంబంధించిన సాధారణ ప్రశ్నలకు మధ్య తేడాల ఆధారంగా గమనించవచ్చు. అయితే ఇక్కడ నైతికతను ఏవిధంగా అర్థం చేసుకుంటూ మనేది కూడా ముఖ్యం. "Morality, narrowly understood, has always taken human well being and the relationship between human as its focus" 'మానవుల సంక్షేమాన్ని ప్రధానంగా కోరుకుంటూ మానవసంబంధాలు, మనుషులపై దృష్టి నిలపటమే నైతికంగా పరిగణించబడింది. అలాగే నైతికత అంటే ఇతరుల పట్ల మానవులకున్న బాధ్యతలు గాను, ఇతరులకు వ్యతిరేకంగా ఉన్నవి హక్కులుగాను గ్రహింపబడుతూ ఉంది. కాబట్టి పర్యావరణ విషయాల పట్ల సంబంధం కలిగి ఉండటమనేది నైతికతగా పరిగణింపబడటానికి తాత్త్వికులు సుముఖంగా లేరు. అంటే సంప్రదాయ నైతికత అనే భూమిక మీద పర్యావరణాంశాలు నిలవవు సరికదా వాటికి నైతిక పరిగణన లేదు.

కానీ విస్తృతార్థంలో తాత్త్విక నైతికత మంచి జీవితం గురించి, మానవ వికాసాభివృద్ధి గురించి కొన్ని సాధారణ ప్రశ్నలను అడిగేదిగా అర్థం చేసుకోబడుతుంది. ఈ ప్రశ్నలు విలువలకు సంబంధించినవి. ఈ దృక్కోణం నుంచి చూస్తే పర్యావరణ సంబంధం అనేది నైతిక సంబంధాన్ని కలిగి ఉండటంగానే పేర్కొనాలి.

విలువలకు సంబంధించిన ప్రశ్నలు లేవనెత్తటమే కాకుండా, మానవులు ఎట్లా జీవించాలి అనే విషయంగా కొన్ని నియమాలను కూడ స్థాపించగలుగుతాయి. విలువల సంబంధిత ప్రశ్నలన్నీ నైతిక విలువకు సంబంధించినవి మాత్రమే కాకపోవచ్చు. అవి సౌందర్య, ఆధ్యాత్మిక, శాస్త్రీయ, సాంస్కృతిక విలువలు కూడా గౌరవ అర్హమైనవిగా, సమర్థమైనవిగాను గుర్తించాలి.

కాబట్టి పర్యావరణ తత్త్వం ప్రకృతిని మరియు దానికి గల విలువ పరిధిని సమగ్రంగా కీలకమైందిగా పరిగణిస్తుంది.

లెక్కలేనన్ని క్రిమికీటకాదులు ఇవ్వాళ విధ్వంసం వల్ల అంతరిస్తున్నాయి. మానవ ఉద్దేశాల కారణంగానే ఈ విధ్వంసం సంభవిస్తున్నదని, ఈ విషయాన్ని అందరూ అంగీకరిస్తారు. మిలియన్ల కొద్ది కీటకాలు అంతరించటంలో కచ్చితమైన దోషమేది? ఎక్కడుంది? ఈ విషయమై పర్యావరణ తాత్త్విక నైతిక విలువలు గురించి వ్యాఖ్యానించిన వారు యిలా అభిప్రాయపడుతున్నారు. Insects do not feel pain, are not conscious, and are not subjects - of - a - lifle. కీటకాలకు బాధ, స్పృహ లేవు కాబట్టి అవి ప్రాణం గల విషయాలుగా పరిగణన పొందటం లేదు. ఏ విధంగా చూసినా అవి నైతికమైనవి కావు. ఇక్కడ విలువకు సంబంధించిన విషయం ఏదో లోపించింది. నిజానికి ఉద్దేశపూర్వక మానవ కార్యకలాపమే వాటిని మట్టుబెట్టింది. మనిషి దురాశ వల్లగాని తెలియకపోవటం వలనగాని ఈ విలువలను తరచు పోగొట్టుకోవడం జరుగుతుంది. అంటే నైతికతను సంకుచితమైన పరిధిలో అర్థం చేసుకోవటం నుంచి దానిని నైతిక విలువకు సంబంధించి విశాలార్థంలో స్వీకరించడానికి ఉద్యుక్తం కావడం జరుగుతుంది.

ఈ తరహా ఆలోచనా విధానాలలో మానవ సంవేదనలు లేవు కనుక క్రిమికీటకాదులు నైతిక జీవులు కావనే మానవ నిర్ధారణ వల్ల వాటి పట్ల మానవ బాధ్యత ఏమీ లేదనే సమర్థన దాకా వస్తుంది. ఉద్దేశపూర్వక మానవ ప్రయోజనాల వల్ల అవి అంతరి స్తుంటే ఒక విలువేదో మానవాళి కోల్పోయిందని భావించాలి. ఆ లుప్త విలువను తిరిగి సాధించడం కొరకు నైతికత జంతు సంక్షేమం అనే వాదం నుండి మరింత సమగ్ర పూర్ణ పర్యావరణ తాత్వికతవైపు ఆలోచన మారింది. ఎందుకంటే నైతికత, నైతిక విలువ సంకుచి తంగా అర్థం చేసుకోవడం తప్ప విలువను విశాలార్థంలో గ్రహించలేదు.

తాత్త్వికులు నైతిక విలువను మానవ ప్రయోజనాలు అనే భావనల ద్వారా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించారు. ఇక్కడ ప్రయోజనాలకు బదులుగా మానవ వాంఛితాలు (interests) పరంగా చర్చించారు. వారిలో Joel, Feinberg, Christopher Stone, Peter Singer, కెన్నెత్ గుడ్ పాస్టర్లు ఏయే అంశాలు నైతిక పరిగణను పొందుతాయో నిర్ణయించడానికి 'వాంఛితం' భావన ఆధారంగా చేపట్టారు. ఒకటి ఏదైనా వాంఛిస్తున్నదంటే అది 'దాని కోసమే' నని ఫీన్‌బర్గ్, దానికదిగా విలువ గలదని స్టోన్, బెంతామ్, సింగర్లు దానిదే అయిన సంక్షేమమని, అంతర్నిహిత విలువ అని రీగన్‌లు, 'దానికదిగా బాగుండటం' అని గుడ్ పాస్టర్లు పేర్కొన్నారు.

ఏమైనా మానవులు ఆపాదించిన విలువ, సామర్థ్యాల కంటే భిన్నంగా, స్వతంత్రంగా అవి విలువ, సామర్థ్యాలను కలిగి

ఉంటాయి. వాటికి మానవులకున్న సంబంధం బట్టి విలువ ఇవ్వబడుతుందని, వాటంతట అవి విలువ, సామర్థ్యం గలవిగా గుర్తించనప్పుడు మాత్రమే మనం పొరబడతామని తెలుస్తుంది.

అంతర్నిహిత విలువ - ప్రకార్యాత్మక విలువ:

ఇతర ప్రాణులకు విలువ నివ్వటం ఎక్కువ సందర్భాలలో మానవులకు ఇవి ఉపయోగపడటం మీద ఆధారపడి జరుగుతూ ఉంటుంది. మానవ ప్రయోజనాలను నెరవేర్చేవి మాత్రమే విలువ గలవిగా గుర్తించడాన్ని ప్రకార్యాత్మక విలువగా పేర్కొంటున్నారు. మానవ ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా విలువ ఒకటి ఉందని గుర్తించడం అంతర్నిహిత విలువ.

ప్రకార్యాత్మక విలువ:

ఈ విలువ ప్రాణుల లేదా వస్తువుల ఉపయోగం ఆధారంగా గుర్తింపు పొందుతుంది. ఏ వస్తువైనా ప్రకార్యాత్మక విలువ కలిగి ఉందని భావించబడిందంటే, ఆ విలువ ద్వారా ఏదో ఒక ప్రయోజనం మానవాళి పొందుతుంది. The instrumental value of an object lies not in the object itself but in the uses to which that object can be put. దీనిని బట్టి చూసి ఒక వస్తువు విలువ దానిలో ఉండటం కాకుండా, దానిని ఉపయోగంలోకి తీసుకురావడం, అది ఉపయోగంలో ఉండటం అనే దానిపై ఆధారపడి నిర్ణయించబడుతూ ఉంటుంది. ఏదైనా వస్తువుకు ఇక ఏ మాత్రం ఉపయోగం లేనప్పుడు, దాని స్థానంలో మరొకటి వచ్చి చేరుతుంది. అప్పుడది దాని విలువలను కోల్పోయి నట్లు. ఇక ఆ వస్తువును విస్మరించడం లేదా త్యజించడం జరుగుతుంది.

సహజమైన వస్తువులు 'వనరులు'గా గుర్తింపబడుతూ ఉన్నాయంటే వాటికి ఉన్న ప్రయోజన లేదా ప్రకార్యాత్మక విలువ వల్లనే. గ్రిపోర్ట్ పివిడాట్ పరిరక్షణ ఉద్యమం సహజవనరుల ప్రయోజన విలువను నొక్కి చెప్పింది. అడవులు, వన్యప్రాంతాలు పరిరక్షింపబడటం ఎందుకంటే అవి విస్తారమైన వనరులు కలిగి ఉండటం వలన ఆ వనరులు మానవ వినియోగానికి ఉపకరిస్తాయి కాబట్టి. అయితే ఈ జాతీయ వనరుల విలువ తరచుగా అసహజంగా పంపిణీ చేయబడుతుంటాయి లేదా వ్యర్థం చేయబడతాయి. అంటే దీనర్థం వనరుల వినియోగం సరిగా జరగటం లేదని. పరిశుభ్రమైన నీరు, గాలి, ఎందుకు విలువైనవిగా పరిగణన పొందుతున్నాయి అంటే, అవి స్వచ్ఛంగా లేకపోతే మానవుల ఆరోగ్యం క్షీణింపజేస్తాయి. వృక్ష, జంతు జాతులు పరిరక్షించబడటానికి కారణం వాటికి వైద్య, వ్యవసాయ ఉపయోగాలు ఉండటం. అట్లా ప్రతిదీ ఉపయోగం లేదా ఆర్థిక ప్రయోజనం అనే ప్రకార్యాత్మక విలువ ప్రకృతికి ఇవ్వటం వలన అని భావించాలి. అయితే ప్రకార్యాత్మక విలువ పర్యావరణ నైతికత మీద ఆధారపడి ఉన్నప్పటికీ అది స్థిరం కాదు. ఇందుకు గల కారణం మానవ ప్రయోజనాలు, అవసరాలు, ఆకాంక్షలు స్థిరంగా ఉండవు మారుతూ ఉంటాయి. ఇవి మారినప్పుడల్లా, ప్రకృతిని ఉపయోగించే మానవ అవసరాలు కూడా మారతాయి.

అంతర్నిహిత విలువ :

ప్రకార్యాత్మక విలువ అన్నది ఆ సహజ వస్తువు వల్ల కలిగే ప్రయోజనం పై ఆధారపడి ఉన్నట్లే. అంతర్నిహిత విలువ అనేది దానికదే ఉపయోగంలో ఉండేది. అంతర్నిహిత విలువను ఉపయోగాలను బట్టి నిర్ణయించడం జరుగదు. అది అంతర్నిహితంగా ఉండేది. దేనికైనా అంతర్నిహిత విలువ ఉందంటే అది బాహ్య ఉపయోగాల మీద ఆధారపడి ఉండేది. కాదు. దానికదే విలువైనది. దానిలోపల విలువగలది. దానికది మేలు కలిగించేది. దీనిని ఈ విధంగా పేర్కొన్నారు. Nor all things that we value are valued instrumentally some things we value are valued natrumentally. Sometings we value because we recognize h them a moral spritual, symbolic, aesthetic or cultural importance" దేనికైనా విలువను కట్టేప్పుడు వాటి ప్రకార్యాత్మక విలువ ద్వారానే జరగదు కొన్నిటిని విలువైనవిగా గుర్తిస్తాం. అవి నైతిక, ప్రతీకాత్మక, సౌందర్యాత్మక, లేదా సాంస్కృతిక ప్రాధన్యాలను వాటిలో కనుగొంటాం. అవి సూచించేవి, అవి ఎందు నిమిత్తం ఉన్నవి, అవి ఎట్లా ఉపయోగపడుతున్నవి కూడా చూడం. మన పర్యావరణ పట్టింపు అనేది ఈ అంతర్నిహిత విలువ మీద ఆధారపడి ఉంటుంది. మనం మానవ కార్యకలాపం పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నదని పేర్కొంటున్నామంటే తరచుగా మనం దాని అంతర్నిహిత విలువ పట్ల అగౌరవాన్ని కలిగి ఉన్నామని లేదా పోగొట్టుకుంటున్నామని అర్థం.

ప్రకృతిని మనం ఏ విలువ ఆధారంగా చూస్తున్నామనే దానిని బట్టి మానవుడు మనమెటువంటి వాళ్ళం? మనమేమిటి అనేవి నిర్ధారణకు వస్తుంది. మానవులకు ఉపయోగపడే, ప్రయోజనం చేకూర్చడం ద్వారా 'విలువ'ను నిర్ణయించడం జరిగితే అది మానవ కేంద్రక పర్యావరణ నైతికతను లేదా తాత్వికతను సూచిస్తుంది. దీనికి విరుద్ధంగా విలువను పరిగణించేదే ప్రాణికేంద్రక నైతికత లేదా తత్వం. "Bio centric ethics refers to any theory that all life as possessing intrinsic value". ప్రతిదీ అంతర్నిహిత విలువను కలిగి ఉంటుందని చెప్పే ఏ సిద్ధాంతమైన ప్రాణి లేదా జీవి కేంద్రక నైతికత పరిధిలోకి వస్తుంది.

ఆల్బర్ట్ ష్వెట్జర్ : ప్రకృతి - నైతికత:

తొలినాళ్ళ జీవకేంద్రక నైతికతలో స్వెట్జర్‌ది ముఖ్య స్థానం. ఆయనది "reverence for life" అనే సూత్రం. జీవితం మొత్తం

ఇతరులను సంరక్షించడం, శ్రద్ధ వహించడం కోసం నిబద్ధమైన కృషిని సాగించాడు. ఆధునిక సమాజ నైతిక అనారోగ్యాలను గురించి విస్తృతంగా రచనలు చేశాడు. వాటికి చికిత్సలు కూడా సూచించాడు. జీవితం లేదా ప్రాణం పట్ల గౌరవ భావం అనే వైఖరిని విశ్వసించాడు. ఇదొక్కటే ప్రపంచంలోని సంఘర్షణలను నివారించగలదని భావించాడు.

ఆధునిక పారిశ్రామిక సమాజం ప్రకృతి మంచిగా ఉంటే జీవితంలోనూ మంచితనం ఉంటుందనే ప్రాపంచిక దృక్పధానికి దూరంగా జరిగింది. సైన్సు, సాంకేతిక రంగాలు వృద్ధి చెంది సహజ న్యాయ సూత్రాలను, సంప్రదాయ నైతిక భావనలను విచ్ఛిన్నం చేశాయి. పారిశ్రామికీకరణలో సంబంధంగల సమాజాలు నైతికత మంచి మనిషిని విడదీశాయి. ప్రకృతిని భిన్నంగా చూడటం మొదలైంది. ప్రకృతిపై ఆధునిక శాస్త్రానికి భిన్నమైన దృక్పథాలు కలిగాయి. ప్రకృతిని ఒక యంత్రంగా దర్శించి, భౌతిక, యాంత్రిక, నియమాలతో నడిచేదిగా భావించడం మొదలైంది. అందువల్ల మానవ నైతికతలు పునాదిలేని కట్టడాలుగా మారాయి. నైతిక విలువ అనగానే అదొక వ్యక్తిగత అభిప్రాయం అనే కుదింపుడు గురైంది. ఈ స్థితిలో ష్వెట్టర్ చేసిందేమంటే "Schweitzer s ethical thinking sought to reestablish the band between nature and ethics". జీవితం పట్ల గురి, గౌరవంతో పాటు భయం కూడా కలిసి ఉంటుందని ష్వెట్టర్ భావన. మానవ చైతన్యం యొక్క ప్రాధమిక వాస్తవం ఏమంటే "lam life which wills to live in the midst of life which wills to live." జీవించాలనే సంకల్పించుకున్న జీవితం జీవించాలని సంకల్పించు కున్న జీవితం మధ్య జీవిస్తుంది. దీనిని ఈ విధంగా వివరించాడు. "The man who has become a thinking being them a compuision to give to every will - to - live the same reverance for life that he gives to his own." తన జీవితానికి గౌరవం లాంటిదే ఇతర జీవితాలకు ఇవ్వడం. మరి జీవితం పట్ల గౌరవం ఏమి చేస్తుందనే విషయం గురించి ఆలోచించినప్పుడు సమాధానం ఈ విధంగా ఉంటుంది. "Rewrance for life is that character trait that sensitizes us to the responsibilty of these decisions | is an anti tude that makes us aware of the full implications of these decisions". మానవులు తాము తీసుకునే నిర్ణయాలకు బాధ్యత వహించడం విషయమై సున్నితపరస్తుంది. ఇది ఒక నియమం లేదా సూత్రం కాకుండా ఒక వైఖరిగా, జీవన విధానంగా మారుతుంది. దీనిని బట్టి చూస్తే ష్వెట్టర్ నైతికత, నేనేం చేయాలనే అంశం పై కాకుండా, నేనెటువంటి మానవుడిగా ఉండాలనే దానిపై దృష్టినిలిపింది. ఆ అయితే ష్వెట్టర్ అనంతరం పర్యావరణ నైతిక తాత్విక చింతన ఇంకొంత పురోగతిని సాధించింది.

పాల్, టేలర్.. PRILTivism:

1986లో 'Respect for nature' అనే గ్రంథం రాశాడు. ప్రాణికేంద్రక నైతికత గురించి ఆయన ఆలోచనలు మరికొంత తాత్విక బలాన్ని కలిగించాయి. ప్రకృతి పట్ల గౌరవ ప్రకటన ఎందుకుండాలంటే మానవులకు ప్రకృతి లేదా ఇతర ప్రాణులకు మధ్య ఉండే సంబంధాల మీద ఆధారపడి ఉంటుంది. సకల ప్రాణం అంతర్గతంగా విలువను కలిగి ఉంటుందని పేర్కొంటాడు. "The central tenet of the theory of environmental ethics that I am defendina is that actions are right and character traits are monally good in virtue of their expressing or embractlying a certain maral attitude, which I cal respect for nature"

ప్రకృతి పట్ల గౌరవం ప్రకటితమైనప్పుడు మాత్రమే మానవాళి సరైన నైతిక వైఖరులను కలిగి ఉన్నట్లు భావించవచ్చునని టేలర్ అభిప్రాయం. జీవించే ప్రాణులన్నీ "Teleological centers of life" అని టేలర్ పేర్కొన్నాడు. దీని ప్రకారం ప్రతి ప్రాణికి జీవించి ఉండటంలో ఒక ప్రయోజనం, లక్ష్యం ఉంటాయి. వాటికోసమే అవి జీవిస్తాయి. అందువల్ల ప్రకృతి పట్ల గౌరవం అంతిమ నైతిక వైఖరిగా మానవులలో వ్యక్తం కావాలి. దీనిని తెలుసుకున్నప్పుడు మాత్రమే, ప్రాణులన్నీ వాటి లక్ష్యసాధన కోసమే అవి జీవించి ఉన్నాయని, ప్రతి ప్రాణికీ ఉండే లక్ష్యం మరో ప్రాణికి ఉండే లక్ష్యానికి విరుద్ధంగా గానీ, భిన్నంగా కానీ ఉండవచ్చునని, వాటికవి మంచివేనని, విలువ వాటి అంతర్గత జీవితం కొరకు మాత్రమే ఉంటుందని అవగతమవుతుంది. ఇట్లా ప్రాణి కేంద్రక దృక్పథం ఇతర ప్రాణులతో మానవులకు ఉండాల్సిన సంబంధాలను, బాధ్యతలను గురించి వివరించ గలుగుతుంది.

దీనిలో నాలుగు ప్రధానమైన విశ్వాసాలు కనిపిస్తాయి.

ఒకటి. ఇతర అన్ని ప్రాణుల్లాగే భూమి పై ఒక సమూహంగా సమూహంలోని సభ్యులుగా చూడాలి.

రెండోది. అన్ని జాతులు మానవులతో సహా పరస్పరం ఆధారపడ్డ వ్యవస్థలో భాగం.

మూడవది. అన్ని ప్రాణులు వాటి వాటి పద్ధతుల్లో స్వీయమేలును పొందేందుకు జీవిస్తాయి.

నాలగవది. మానవులు ఇతర ప్రాణులకంటే అంతర్గతంగా అధికులు కారు.

వీటిని గుర్తించినప్పుడు మాత్రమే జీవి, ప్రాణం. జీవితం మొదలైన వాటి పట్ల పర్యావరణహితమైన జీవన దృక్పథాన్ని కలిగి వుండి, ఆచరణలో దీనిని పాటిస్తే పరిణత వ్యక్తులుగా, సమూహాలు, సమాజాలుగా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఈ అవగాహనను

అంతర్నిహిత ప్రకార్యాత్మక విలువలు విస్తృతిని పరిమితులను అర్థం చేసుకోవటం ద్వారా మాత్రమే మానవాళి పొందగలుగుతుంది. ప్రజావాగ్గేయ సాహిత్యంలో అనేక రకాల పశు పక్ష్యాదులు, జీవ, నిర్జీవాల ప్రస్తావన ఈ అంతర్నిహిత విలువను అంతశ్చేతనలో కలిగి ఉండటం ద్వారా వ్యక్తమైంది.

పర్యావరణ విమర్శ

పర్యావరణం ప్రధానాంశంగా సాహిత్య అధ్యయనం, విమర్శ, విశ్లేషణ సాగించే విధానాన్ని ఇకో క్రిటిసిజం పేరుతో వ్యవహరిస్తున్నారు. సాహిత్యం, భౌతిక పర్యావరణాల మధ్యగల సంబంధ అధ్యయనం ఈ విధానంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. అందుకే దీనిని ఇలా నిర్వచించటం జరుగుతున్నది. “Ecocriticism is the study of the relationship between literature and the Physical environment” దీనిని బట్టి తెలుగులో పర్యావరణ సాహిత్య విమర్శ లేదా హరిత సాహిత్య విమర్శ అని పేర్కొనవచ్చు. 1978లోనే డేవిడ్ మాజిల్ ఈ పదం వాడినట్లు తెలుస్తున్నది. ఇకో క్రిటిసిజం ఇటీవల కాలంలో ప్రాచుర్యం పొందినప్పటికీ ఈ పద్ధతిలో సాహిత్య అనుశీలన 1911 లోనే డల్లాస్ లాంప్‌షార్స్ పరిశీలన ప్రకారం, ప్రకృతి రచన, ఆటోమొబైల్ వ్యాపారం అనతి కాలంలోనే విస్తృతంగా పెంపొందిందని రాయటం గమనించ దగింది. దీనిని బట్టి చూస్తే పారిశ్రామిక నాగరికత పెరుగుతూ ఉన్న కొద్దీ ప్రకృతికి దూరం కావటం జరుగుతుంది. ప్రకృతితో మానవులకు ఏర్పడుతున్న ఎడబాటు వల్ల ప్రకృతిని గురించి ఆలోచన చేయటం మొదలవుతుంది. అయితే అమెరికన్ ప్రకృతి రచన ఆధునికా నంతర సిద్ధాంతంతో కలిసి గ్లోబలైజేషన్ పర్యావరణ సంక్షోభం మొదలైనవాటి కారణంగా రూపొందిన సాహిత్య విశ్లేషణకు ఇకో క్రిటిసిజం ఒక దారిని చూపింది. ఇది క్రమంగా విస్తృతమై భిన్నమైన అధ్యయనాలు జరిగాయి. ఇకోక్రిటిసిజం కేవలం వర్తమాన పర్యావరణ సంక్షోభాల ఫలితంగా ఉద్భవించిన సాహిత్య రచనలనే కాకుండా, అంతకు పూర్వరచనలను కూడా పర్యావరణ దృష్టి కోణంలో, అధ్యయనం విస్తరించారు. ఆంగ్ల సాహిత్య విశ్లేషణకు కొత్త పుంతలు తొక్కుతూ మార్గాలను సృష్టపరిచారు.

ఈ విమర్శ విధానం పర్యావరణం, సాహిత్యాల మధ్యగల సంబంధాలను బలంగా ముందుకు తెచ్చింది. ఉదాహరణకు ఫెమినిస్టు సాహిత్యవిమర్శ జండర్ దృక్పథం నుండి భాషా, సాహిత్యాలను అనుశీలన చేసినట్లుగా, మార్క్సిస్టు విమర్శ సాహిత్య అధ్యయన, విమర్శలకు ఆర్థిక ప్రాతిపదికగా వర్గాలను, ఉత్పత్తి విధానాలను సాధనాలుగా వాడినట్లు, పర్యావరణ విమర్శ విధానం, సాహిత్యం పర్యావరణ సంబంధాలను పరిశీలనకు స్వీకరిస్తుంది. ఒక్కమాటలో చెపితే దీనిని ధరిత్రికేంద్రక విమర్శగా భావించవచ్చు.

సాహిత్యం, పర్యావరణాల మధ్య సంబంధ అధ్యయనంతో పాటుగా ఈ పద్ధతిని మరికొంత విపులంగా నిర్వచించారు. దీని ప్రకారం ఇకోక్రిటిసిజం అంటే “The field of enquiry that analyzes and promotes works of art which raise moral questions about human interac tions with nature, while also motivating audiences to live within a limit that will be binding over generations”.

దీనిని బట్టి చూస్తే మానవులు ప్రకృతితో వ్యవహరించే విషయంగా నైతిక ప్రశ్నలను లేవనెత్తే రచనలను ప్రోత్సహిస్తూ విశ్లేషిస్తుంది. అదే విధంగా పరిమితులను పరిమితులకు లోబడి భవిష్యత్ తరాలకు కట్టుబడి జీవించే విధంగా ప్రేరణను కల్పిస్తుంది.

ఈ తరహా విమర్శ సాధించగలిగినదేమిటో ఈ విధంగా విశ్లేషకులు పేర్కొన్నారు. “Eco criticism aims to show how the work of writers concerned about the environment can play some part in solving real and pressing ecological cancerms” దీనిని పర్యావరణం పట్ల సానుకూలత గల రచయితల రచనలు ఏ విధంగా కొంతమేరకు వాస్తవమైన, పర్యావరణ పరంగా వత్తిడి పెట్టే సమస్యలను పరిష్కరించగలదో చూపుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ సంక్షోభాలు నిరంతరం వృద్ధి పొందుతున్న సందర్భంలో ఇక సంపూర్ణ అనుశాననంగా రూపొందుతూ ఉండాలని ఈ పద్ధతిని అనుసరిస్తున్న విమర్శకులు ఆకాంక్షించారు. విస్తృతి కారణంగా ఇకోక్రిటిసిజం ఏ ఒక్క నిర్వచనం పరిధికి లోబడదు. అందువల్లనే స్పష్టంగా నిర్వచించబడిన సిద్ధాంత బద్ధ ఆచరణ లేదనిపిస్తుంది. అయినప్పటికీ, సాహిత్యంలో, సాంస్కృతిక అధ్యయనాలలో ముఖ్యస్థానం పొంది. ఎనలేని గుర్తింపు, ప్రాముఖ్యాలను సంతరించుకుంది. ఈ తరహా విమర్శ పద్ధతి, ఇంటర్ డిసిప్లినరీ పద్ధతులు కూడా దోహదం చేశాయి.

ఉర్సులా కె. హైజ్ అనే అమెరికా పర్యావరణ విమర్శకురాలు దీనికొక ప్రమాణాన్ని పేర్కొంది. ఆమె ప్రకారం “Eco criticism analyzes the ways in which literature represents the human rela tions to nature at particular moments of history, what values are assigned to nature and why and how perceptions of the natural shape literary tropes and genres’’

ఇకోక్రిటిసిజంలో ప్రకృతిలో మానవులు ఎటువంటి సంబంధాలను కలిగి ఉన్నారనేది ప్రధానం. అయితే ఒకానొక ప్రత్యేక చరిత్ర గమనంలో మానవులు ప్రకృతికి ఎటువంటి విలువలను ఆపాదించారు. ఆ విలువలు ఎందుకు ఇవ్వబడినాయి. సాహిత్య ప్రక్రియలు, అలంకారాలు ఎటువంటి దృక్పథాలతో సహజంగా రూపుదిద్దుకుంటాయి లేదా తీర్చిదిద్దుతాయి అనేది కూడ పరిశీలన చేస్తుంది. 1980లలో అమెరికాలోని గ్రామీణ విశ్వవిద్యాలయాలకు

ప్రాకింది. 1990లలో బ్రిటన్‌లోకి ప్రవేశించింది ఇకోక్రిటిసిజం. ఇప్పటిదాకా ఇది ప్రధాన సాహిత్య విమర్శ సిద్ధాంతాలకు కొంత ఎడంగానే ఉంది. ఈ విమర్శ పర్యావరణం పట్ల ఒక స్పృహను కలిగించే లక్ష్యంతో మొదలైంది. మానవ చైతన్యంలోంచి ప్రకటిత మయ్యే ప్రకృతిపట్ల వైఖరులను ఇది చూపుతుంది. వ్యక్త వైఖరుల యొక్క వైఖరులను కూడా ఇది వ్యాఖ్యానిస్తుంది.

పర్యావరణ దృష్టి కోణాన్ని కలిగి ఉండి, సాహిత్య, సాంస్కృతిక, విశ్లేషణ ముఖ్యంగా ఉండే ఇకోక్రిటిసిజం సాహిత్య వాచకం ఏదైనా పర్యావరణ పరంగా సానుకూల, ప్రతికూల ప్రభావాలను కలిగిస్తున్నదా లేదా అనే అంశం ఆధారంగా మూల్యాంకనం చేస్తుంది.

అదేవిధంగా సాహిత్య వాచకంలో వ్యక్తమైన విశ్వాసాలు, భావజాలాలు ఎటువంటి పర్యావరణ విషయాలపై ప్రాసంగికతను కలిగి ఉన్నాయో నిర్ధారించి విలువ కడుతుంది.

20 శతాబ్ది ఉత్తరార్థంలోనూ, కొత్త శతాబ్ది ప్రారంభ సంవత్సరాల లోనూ సాహిత్య సిద్ధాంతాలు ప్రపంచంలో ఎన్నో కొత్త అధ్యయనాలకు పఠన పద్ధతులకు, పాత, కొత్త సాహిత్య రచనలకు సంబంధించి రూపొందాయి. అట్లాంటి వాటిలో ఇకోక్రిటిసిజం ఒకటి. అనేక పేర్లతో భిన్న దృక్పథాలతో వైవిధ్యాన్ని ప్రదర్శించింది. ఒక విశిష్ట సాహిత్య దృక్పథంగా నిలబడింది.

పర్యావరణ విమర్శ చేసే పనిని ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

1. పర్యావరణ విమర్శ సాగించే విమర్శకుడు కవి లేదా రచయిత ఉన్న పరిసరం లేదా స్థలం అతడి ప్రాపంచిక దృక్పథాన్ని ఏ విధంగా రూపుదిద్దిందో పరిశీలించాలి. ఏ పరిసరాల్లో పెరిగాడు, ఏయేచోట్ల ఆ రచయిత ప్రయాణించారు? ఏ స్థలం, ప్రాంతం నుండి రాశాడు అనేది కూడా పరిగణన చేయాలి.
2. సాహిత్యగేయం లేదా వాచకంలో ప్రకృతి/పర్యావరణ సంబంధాంశాలు ఉన్నట్లయితే ఆ సాహిత్యం ఇప్పటిదాకా ఎందుకు ఈ దృష్టికోణంలో గుర్తింపు పొందలేక పోయింది? ఆలోచించాలి.
3. సాహిత్యవాచకం ఏదైనా పఠితలకు ప్రకృతితో ఉన్న సంబంధం విషయంగా ఎటువంటి అంతర్దృష్టిని కలిగిస్తున్నది? ప్రకృతి పర్యావరణాల గురించి ఎట్లాంటి ప్రశ్నలను, సమస్యలను ఆ రచన ముందుకు తెచ్చింది చూడాలి.
4. మానవ చైతన్యం ప్రకృతి ప్రపంచం ఎటువంటి ప్రభావాన్ని కలిగించగలదనే విషయంగా సంప్రదాయ పఠన పద్ధతులు విస్మరించిన విషయాలు ఏమిటి? అని పరిశీలించాలి.
5. ప్రకృతి లేదా పర్యావరణ రచనగా పేర్కొనబడటానికి ఆవాచకం ఏ విధంగా అర్హమైంది? వివరించాలి.
6. పర్యావరణ పరిశోధనలు సాధించిన పురోగతి వల్ల సాహిత్య వాచకాన్ని కొత్తగా అన్వయించడానికి వీలున్నదా లేదా? వాచకం ప్రకృతి విషయంగా ఎటువంటి ప్రజా దృక్పథాలను ప్రదర్శించింది.
7. ప్రకృతి, పర్యావరణం పట్ల కవి, రచయిత దృక్పథం ఏమిటి? పాఠకులు ఎందుకు ఈ విషయం పట్ల అవగాహన చైతన్యాలను కలిగి ఉండాలని భావిస్తున్నాడు
8. సాహిత్య వాచకం ద్వారా ప్రకటితమైన విలువలు పర్యావరణ విజ్ఞానాన్ని కలిగిస్తున్నాయా?
9. ప్రకృతి, పర్యావరణం గురించి స్త్రీల కంటే పురుషులు భిన్నంగా రాస్తారా?
10. ప్రకృతితో మానవాళి గల సంబంధాన్ని అక్షరాస్యత లేదా చదువు వల్ల ఏ విధంగా ప్రభావితం చేస్తుంది.
11. పర్యావరణ సంక్షోభ సంబంధాంశాలు ఏ విధంగా ఎటువంటి ప్రభావాలతో సమకాలీన సాహిత్యం లోని, సంస్కృతులలో ప్రవేశిస్తున్నాయి.
12. సాహిత్య అధ్యయనాలలో పర్యావరణ శాస్త్రం ఏ విధంగా ఉపకరిస్తుంది? సాహిత్య విశ్లేషణకు శాస్త్రం చేయగల దోహద మేమిటి? ప్రకృతి చరిత్ర లేదా సైన్సు వాచకంతో కలిగి ఉండే పాత్ర ఎటువంటిదనే అంశాలను పర్యావరణ విమర్శ పట్టించుకుంటుంది.

పర్యావరణ సమస్యలు తరచూ పైకి స్పష్టంగా కనిపించవు. ఇవి తక్షణ సమస్యలుగా కనిపించవు. చాలా చిన్న సమస్యలుగా కనిపిస్తాయి. మౌలికంగా అనిశ్చిత స్వభావాన్ని కలిగి ఉంటాయి.

1990ల నాటికిగాని ఇకోక్రిటిసిజం గుర్తించదగిన ఉద్యమంగా రూపొందలేక పోయింది. అమెరికాలో అది త్వరితగతిన రూపుదిద్దుకుంది. సాహిత్యం పర్యావరణా లను అధ్యయనం చేయడానికి ASLE లాంటి సంఘాలు ఏర్పడ్డాయి. పారిశ్రామిక అభివృద్ధి తెచ్చిపెట్టిన విధ్వంసక రూపాలకు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తూ, పారిశ్రామికేతర స్థానిక సంస్కృతుల వైపు అవి దృష్టి సారించాయి. అదే విధంగా పారిశ్రామికేతర స్థానిక సంస్కృతులు సంఘటితం కావడం వల్ల కూడా విస్తృత పర్యావరణం ఉద్యమం రూపు దిద్దుకోవడానికి దారితీసింది.

ప్రజా వాగ్గేయ సాహిత్య విశ్లేషణను పర్యావరణ విమర్శ దృష్టికోణంతో చూడటం జరిగింది. తెలుగు సాహిత్యం మొత్తాన్ని పునర్విశ్లేషణ చేయడానికి పర్యావరణ విమర్శ పద్ధతి ఎంతో ఉపయుక్తమైంది. ఈ ప్రాజెక్టు అధ్యయన లక్ష్యాలలో పర్యావరణ విమర్శను రూపొందించటం కూడా ఒకటి కనుక ఈ విషయం గురించి ప్రస్తావించటం జరిగింది.

ఈ తాత్విక భావనల వెలుగులో ప్రజా వాగ్గేయ సాహిత్యంలోని తాత్వికతను తరువాత అధ్యాయంలో నిరూపించటం జరుగుతుంది.

–డా॥ ఆర్. సీతారామారావు, m : 9866563519
e : sitametaphor@gmail.com

తెలంగాణ చెరువు తీరు - అలుగు దుంకి పారు

దేశపతి శ్రీనివాస్ పదాల జోరు

తాత తండ్రుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న పాట.
మేనమామల సాలున్న పాట.
కన్నతల్లి ఒడిలో ఊయలూగిన పాట.
పోతన పద్యరత్నాలను పొదువుకున్న పాట.
దాశరథి ఉద్యమగీతాలతో రాగమెత్తిన పాట.
నాగేటిసాల్లల్ల మొలకలెత్తిన పాట.
ప్రజాకవుల పదాలకు ప్రాణంపోసిన పాట.
తెలంగాణ జనజీవితాన్ని కైగట్టిన పాట.
తెలంగాణ సాహిత్యవైభవాన్ని చాటిచెప్పిన పాట.
తెలంగాణ ఉద్యమరథ సారథి వెన్నంటి నడిసిన రణ గీతమీ పాట.
మాట - పాటల మంత్రమీ పాట.
కోట్లాది ప్రజల హృదయ తంత్రమీ పాట.
పోటెత్తిన జనప్రవాహాన్ని అలుగు ఊయలలూపిన పాట.
ఆత్మగల్ల పాట.
ఆత్మగౌరవ పతాకాన్ని ఎగరేసిన పాట.
అది దేశపతి శ్రీనివాస్ పాట.

పదాల అలుగుదుంకి ప్రవహించిన ప్రజాకవి గాయకుడు దేశపతి శ్రీనివాస్ గురించి నేటి మన 'అలుగెల్లిన పాట'లో...

మెదక్‌జిల్లా సిద్దిపేటకు చెందిన ప్రముఖ కవివండితుడు దేశపతి గోపాలకృష్ణ. వీళ్ళ పూర్వీకులది గజ్వేల్ సమీపంలోని మునిగడప అయినప్పటికి గోపాలకృష్ణ సిద్దిపేటలోనే స్థిరపడ్డడు. దేశపతి గోపాలకృష్ణ - బాలసరస్వతి దంపతులకు కలిగిన ఇద్దరు సంతానంలో బిడ్డ లలిత, కొడుకు శ్రీనివాస్. వీరిలో శ్రీనివాస్ 1970 జులై 1న జన్మించిండు. దేశపతి గోపాలకృష్ణ రాసిన 'మధుశ్రీ' ఖండకావ్యం ఎంతో ప్రసిద్ది చెందింది. తెలుగు, ఉర్దూ సాహిత్యంలో మంచి పట్టు సంపాదించిన తండ్రి ఒకవైపు, నిత్యం పాటలు, పద్యాలతో ఇంటిని సంగీతసాగరంలో ముంచే తల్లి ఒకవైపు ఉండడంతో శ్రీనివాస్‌కు చిన్నప్పటి నుంచే సంగీతం, సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగింది. శ్రీనివాస్ మేనమామలు, తాతలు అందరు మంచి సంస్కృతపండితులు. తల్లి బాలసరస్వతి పూజా సమయంలో "మందార మకరంద మాధుర్యములు దేలు" వంటి పోతన పద్యాలు, కీర్తనలు భక్తితో ఆలపించేది. 'గజేంద్రమోక్షం, రుక్మిణీపారాయణం' వంటివి లయబద్ధంగ చదివి వినిపిస్తుండేది. దీంతో శ్రీనివాస్‌కు చిన్నప్పుడే పద్యాలు పాడడం అలవాటైంది. పాఠశాల స్థాయిలో ఎన్నో బహుమతులు సాధించిండు.

తల్లి సాహిత్యాభిలాష శ్రీనివాస్ వ్యక్తిత్వంలోను, జీవితంలోను అంతులేని ప్రభావాన్ని చూపింది. ఒకసారి స్కూల్‌డే కార్యక్రమానికి అతిథిగా వచ్చిన కేసీఆర్, ఎక్కువ బహుమతులు పొందిన శ్రీనివాస్‌ను చూసి చిరునవ్వుతో ప్రశంసించిన ఆ మాటల స్ఫూర్తితో పాటు, ప్రసిద్ధ చిత్రకారుడు కాపు రాజయ్య బొమ్మల ప్రభావం శ్రీనివాస్ మీద ఎంతగానో ఉంటది. అదేవిధంగ వేముగంటి నరసింహాచార్యులు ఇంట్లో గల ప్రసిద్ధ కవుల ఫోటోలు, ఆయన పద్యాలు శ్రీనివాస్‌ని సాహిత్యం వైపుకు ప్రేరేపించినయి. ముఖ్యంగ ఇంటిముందున్న శ్రీరాముని గుడిలో నిత్యం జరిగే 'హరికథా గానాలు, భజనకీర్తనలు ఆయనను అమితంగా ఆకర్శించి, అనుకరించే టట్టు చేసినయ్. తాళానికి తగ్గట్టుగా పాడడం, అభినయించడం అలవాటైంది. ఏకపాత్రాభి నయాలు చేసి అందరిచేత శభాష్ అనిపించుకుంటడు.

దేశపతి శ్రీనివాస్ ప్రాథమిక విద్యాభ్యాసం మొదలు డిగ్రీ వరకు సిద్ధిపేట లోనే చదువుకుండు. డిగ్రీ చేసే సమయంలోనే ఆయనకు సాహిత్యంతో పాటు, సామాజిక దృష్టి ఏర్పడింది. 1988లో మంజీర రచయితల సంఘంలో సభ్యుడు కావడం వల్ల ప్రముఖ కవి నందిని సిధారెడ్డితో పాటు ఇతర కవులు, ఉద్యమకారులతో సాన్నిహిత్యం పెరిగింది. నాటక ప్రదర్శనలు, పద్యాలు, పాటలు పాడడంలోను శ్రీనివాస్ పేరు సిద్ధిపేటంత మార్మోగింది. 1991 ప్రాంతంలో సంగారెడ్డిలో నిర్వహించిన తెలంగాణ స్థాయి నాటకపోటీలలో పాల్గొని ఉత్తమ హాస్యనటుడి అవార్డును సాధించిండు. ఆ తర్వాత ప్రజాకవి అలిశెట్టి ప్రభాకర్ చనిపోయినపుడు సిద్ధిపేటలో 'గోగ్రహణం' నాటికను ప్రదర్శించి ఆ కుటుంబానికి ఐదువేల ఆర్థికసాయాన్ని అందజేసిండ్రు. అదే సమయంలో వెల్లువెత్తిన సారా వ్యతిరేక ఉద్యమానికి మద్దతు పలికిండు. కవిత్వం, పాటలు, నాటికలతో సామాజిక చైతన్యం కోసం ఉద్యమించిండు. ఇందులో భాగంగానే "గెలిచితీరాలి" అనే నాటికను సిధారెడ్డితో కలిసి రూపొందించి, అనేకచోట్ల ప్రదర్శించిండ్రు.

డిగ్రీ పూర్తి చేసిన దేశపతి శ్రీనివాస్ 'కాంప్రిహెన్సివ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్"లో భాషాపండిట్‌గా ట్రైనింగ్ చేసిండు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ తీసుకుండు. అనతికాలంలోనే

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. చిన్నకోడూరులో తెలుగు ఉపాధ్యాయుడిగా చేరిండు. మార్కుల కోసం కాకుండ మార్పుకోసం పాఠాలు బోధించిండు. పద్యాలు వినసొంపుగా పాడి పిల్లల్ని ఆకట్టుకుండు. అప్పటికప్పుడు ఆశువుగా పాటలు కైగట్టి తరగతిగదిలో కళాకారుడిగా హావభావ ప్రదర్శనలతో విద్యార్థులచేత పాడించిన పాట

"అందచందాలతో అలరారు పట్నము
సిద్దిపేట సుట్టుముట్టు పల్లెల్లోన
సిరులొలుకు సింగారము మా ఊరు
సిన్నకోడూరు గ్రామము
అందాల గోనెపల్లి ఘనమైన పోద్దాటి తాళ్ళతల్లి" అంటూ అన్ని గ్రామాలను, వ్యక్తుల విశిష్టతలను తనపాటలో చేర్చి పిల్లలకు నేర్పించడంతో వాళ్ళు ఆనందంగా పాడుకునేది. పాటలో ఊరు పేరును విన్న విద్యార్థులు చెప్పలేని ఆనందంతో పొంగిపోయేది. ఊరు గొప్పతనాన్ని పాడుకుంటూ మురిసిపోయేది. దేశపతి శ్రీనివాస్ 1991లో సునీతను వివాహం చేసుకుండు. దేశపతి శ్రీనివాస్ – సునీత దంపతులకు సాహితి అనే కూతురు, బాలార్క అనే కొడుకు ఉన్నారు. దేశపతి శ్రీనివాస్ 1992లో "రూపాయి పారుతున్న దేహం" కవిత ఆంధ్రప్రభ ఆదివారం సంచికలో ప్రచురించబడింది. భూమ్మీద డబ్బు మనుషులు తప్ప, మానవ విలువలు మంటగలిసిపోతున్నయనే కోణంలో వినూత్నంగ రాసిన ఈ కవిత ఎందరినో ఆలోచింప జేసింది. సాహితీ విమర్శకుల ప్రశంశలు పొందింది. ఇట్ల దేశపతి శ్రీనివాస్ రాసిన కవితలు ఆయా పత్రికల్లోను, ఇతర కవితా సంకలనాలలోను ప్రచురించ బడినవి. ఆ తర్వాత 1994లో దేశపతి శ్రీనివాస్ 'బంధీకాని కవిత'లో

"మా శిరస్సుల్ని తెగవేద్దామని కత్తినెత్తావు నువ్వు
మా చూపుల జీవనదులు తాకి
కత్తికి కూడ శిరస్సు మొలుస్తున్నది
బలిచక్రవర్తి తల భూమిని చీల్చుకొని పునరుద్భవిస్తున్నది
ఇనుప పాదం పాతాళానికి పూడుకుపోవటం స్పష్టంగా కనపడుతోందా" అంటూ జైళ్ళో ఖైదీలు నిరాహార దీక్షలకు మద్దతుగా తన ధిక్కారస్వరాన్ని వినిపిస్తడు. మంచి గుర్తింపు పొందిన ఈ కవిత దేశపతి శ్రీనివాస్‌ను కవిగా నిలబెట్టింది. ఇదే కవితను ఎన్. వేణుగోపాల్ ఆంగ్లంలోకి అనువదించిండు. మంజీర రచయితల్లో ఒకడైన దేశపతి శ్రీనివాస్ ఆలోచన విప్లవాత్మకమైంది. ఆయన పనిచేసే పాఠశాల విద్యార్థుల పేదరికాన్ని చూసి తల్లడిల్లిండు. తెలంగాణలో ఇన్ని కుటుంబాలు ఇంత దుర్భర పరిస్థితులలో బతకడానికి కారణం ఎవరనే ప్రశ్న తొలిచివేసింది. సమైక్యపాలకుల వివక్షపూరిత విధానమే దీనంతటికి కారణమని గ్రహిస్తడు. మంజీర రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించడం మొదలుపెడతడు. ఉపాధ్యాయ వృత్తి నుంచి తెలంగాణ ఉద్యమం వైపుకు అడుగులు వేసిండు. 1996 నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోకి పాటై ప్రవహించిండు. తనదైన శైలిలో పదాలల్లి సభలను రక్తి కట్టించిండు. ఈ క్రమంలో దాశరథి రాసిన "ఆ చల్లని సముద్ర గర్భం దాసిన బడబాణలమెంతో... అనే పాట దేశపతిని వెంటాడింది. ముఖ్యంగా పాట చివరి చరణం

"అన్నార్థులు అనాథలుండని ఆ నవయుగమదెంత దూరం
కరువంటూ కాటకమంటూ కనిపించని కాలాలెపుడో
పసిపాపల నిదురకనులలో ముసిరిన భవితవ్యం ఎంతో
గాయపడిన కవి గుండెలలో రాయబడని కావ్యాలెన్నో.." వంటి పదాలు దేశపతికి కంటిమీద కునుకులేకుండ చేసినయి. దాశరథి కలగన్న సమాజాన్ని కనీసం ఊహించ గలమా అనే ప్రశ్న పదేపదే వేధించింది. సాహిత్యసభలలో మాటల నడుమ ఈ పాటందుకొని సభను ఒక్కసారిగ అంతులేని ఉద్వేగానికి గురిచేస్తడు. తనకున్న వాక్పటిమతో గేయచాతుర్యంతో శ్రోతల గుండెల్ని గాయపరుస్తడు.

"మూగబోయిన కోటితమ్ముల గళాల పాట పలికించె కవితా జవమ్ము గూర్చి / నా కలానికి బలమిచ్చి నడుపునట్టి నా తెలంగాణ కోటి రతనాల వీణ" అన్న దాశరథి పదాలతో దేశపతి గళగర్జన చేస్తడు. దిక్కులు పిక్కటిల్లి సభాప్రాంగణాలు దద్దరిల్లేది. "కదనాన విప్లవ కాహళిని పూరించి / కమ్మ తెనుగున తేట కావ్యాలు రచియించే/ పాల్కురికి ఆనాడెరా తెలంగాణ ప్రగతి బాటలు దీర్చెరా" అంటూ తెలంగాణ సాహిత్య ఘనతను తొవ్విపోస్తడు. రావెళ్ళ పాటలోని పౌరుషానికి కొత్త మెరుపులద్దుతడు. సుద్దాల అశోకతేజ రాసిన "పరికరాలు పుట్టించిన తెలివి కష్టజీవిది / పనినొక సంస్కృతి జేసిన ఘనత కష్టజీవిది" అన్న పాటను అనేకసార్లు పాడి శ్రమ సంస్కృతిని గానం చేసిండు. అందెశ్రీ "తలమీద సుట్టబట్ట ఆ పైన పండ్లతట్ట" అనే పాట, గోరటి వెంకన్న "పల్లెకన్నీరు, మందెంట బోతండె యలమంద' వంటి పాటలు పాడి తెలంగాణ సమాజాన్ని మేల్కొలిపే ప్రయత్నం చేసిండు. ఇదే క్రమంలో తాను పాటలు రాసిండు. వచన కవిత్వంతోను చురకలు అంటించిండు. ప్రజాకవుల కవిత్వాన్ని, పాటలను ప్రచారంలోకి తెచ్చిండు. భాషకు, బతుక్కు ఉన్న సంబంధాన్ని కొత్తతరానికి అందించే అద్భుతమైన పాత్రను నిర్వర్తించిండు.

సభలు, సమావేశాలు, పాటలతో మార్మోగుతున్న తెలంగాణ ఉద్యమాన్ని చూసి వెన్నులో ఒణుకుపుట్టిన వలసపాలకులు ఉద్యమాన్ని అణిచివేసే కుట్రలు చేసింర్రు. హక్కులకోసం కొట్లాడేవాళ్ళను అంతం చేసింర్రు. ఈ క్రమంలోనే దేశపతి శ్రీనివాస్

"పాలమూరు మట్టిబిడ్డ పురుషోత్తము / పౌరహక్కుల పోరుకు

ప్రాణం పురుషోత్తము” అంటూ రాసిన పాట ఒక సంచలనాన్ని సృష్టించింది. పాట పల్లెపల్లెన ప్రతిధ్వనించింది. ఆజం అలీని స్మరిస్తూ “గూటిలోన కూసె ఓ గువ్వ పిట్ట / మా అన్న ఆజాము జాడ తెలిసిందా” అంటూ వేదనాభరితస్వరంతో పాడుతడు. బెల్లి లలితను చూసి తల్లడిల్లిన దేశపతి “కత్తిమీది నెత్తురు చుక్క / ముల్లు మీది వానచుక్క” అంటూ ధీర వనితల పౌరుషాన్ని గానం చేస్తడు. మొక్కవోని దీక్షతో ఒక్కో అడుగు ముందుకే పయనించిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాటలు ఒక దుమారం రేపినయి. తెలంగాణ ఆకాంక్షను బలోపేతం చేసినయి. గద్దర్, గూడ అంజయ్య, గోరటి వెంకన్న, అందెశ్రీ, నందిని సిధారెడ్డి వంటి కవులు తమ పాటలతో పోరాట విత్తనాలు వెదజల్లిండ్రు. అమరులను స్మరిస్తూ నందిని సిధారెడ్డి రాసిన ‘అమరులకు జోహార్’ పాట గాని, ‘నాగేటి సాళ్ళల్ల నా తెలంగాణ’ పాట గాని దేశపతి శ్రీనివాస్ గొంతులో ఝంఝా మారుతమై పల్లెపల్లెను చుట్టుకొచ్చింది. దీనికితోడు వరవర రావు, కే.శ్రీనివాస్, హరగోపాల్ వంటి వాళ్ళ ప్రసంగాలు వినడంతో పాటు వాళ్ళతో కలిసి నడిసే అవకాశం దొరికింది. దీంతో దేశపతి తన పదునెక్కిన మాటలతో వలసపాలకులను చీల్చి చెండాడిండు. వీరితో పాటు ప్రొఫెసర్ జయశంకర్ సార్, ప్రొఫెసర్ కోదండరాం, సిధారెడ్డిలతో కలిసి సుదూర తీరాలు కలిసి నడవడంతో దేశపతి వక్తగా మరింత రాటు దేలిండు. దేశపతి శ్రీనివాస్ కట్టలు తెగిన భావావేశంతో స్వయంగా ఎన్నో పాటలు రాసిండు. వట్టికోట ఆళ్వారు స్వామి మీద దేశపతి

“వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారు
పలుకుతోంది తెలంగాణ పిడికిలెత్తి జోహారు
కన్నతల్లి కడుపులోన కల ఏదో కన్నావు
ఉద్యమాల ఉగ్గుబువ్వ చిన్ననాడే తిన్నావు
బతుకుపోరులోన జనం వెతల హోరు విన్నావు” అంటూ

గానం చేస్తడు. తెలంగాణ ఉద్యమం దేశపతిని తనలోకి తనను తొంగి చూసుకునేటట్టు చేసింది. బువ్వ, గంజి, గట్క వంటి ఎన్నో పదాలను వాడుకలోకి తెచ్చిండ్రు. తెలంగాణ సోయిని కలిగించిండ్రు. ఈ దశలోనే కేసీఆర్ టి.ఆర్.ఎస్. పార్టీని స్థాపించడంతో ఉద్యమానికి వెయ్యి ఏనుగుల బలమొచ్చింది. ఆ తర్వాత ఏర్పడిన ‘తెలంగాణ రచయితల వేదిక’, ‘తెలంగాణ విద్యావంతుల వేదిక’ ఏర్పాటులోను దేశపతి శ్రీనివాస్ కీలకభూమికను పోషించిండు. తెలంగాణ అగ్రనాయకులు, ఉద్యమకారులందరితోను కలిసి పనిచేసిండు. నటుడిగా, కవిగా, గాయకుడిగా, ఉపన్యాసకుడిగా అనేక రూపాలలో తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిండు. హరికథాగానం చేసినట్టు తెలంగాణ గోస అందరికి అర్థమయ్యే పదాలతో ఉపన్యసిస్తడు. తన పాటలు ప్రసంగాలతో దేశపతి శ్రీనివాస్ క్రమంగా కేసీఆర్‌కు దగ్గరైండు. దేశపతి, కేసీఆర్‌తో చర్చిస్తూ రాసిన పాటలు అనేకం ఉన్నయి. ప్రజాకవుల పాటలను చాలావరకు కేసీఆర్ దగ్గరుండి సరిచూసుకుంటడు. ఈ క్రమంలోనే చాలా పాటల్లో అనేక మార్పులు చేర్పులు చేస్తరు. ఎక్కడ విషయం చెడకుండ చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగ చెప్పుకొస్తడు. కేసీఆర్‌తో కలిసి దేశపతి శ్రీనివాస్ చరణాలకు చరణాలు తిరిగి రాసిన పాటలు అనేకం ఉన్నాయి.

రసమయి బాలకిషన్ రూపొందించిన “పల్లెనీకు వంద నాలమ్మ” పాటల సీడిలో దేశపతి శ్రీనివాస్ కులవృత్తుల మీద

“వందనాలు వంద నాలు వందనాలమ్మ
పల్లెపూచిన తోట పూలకు వందనాలమ్మా” అంటూ రాసిన

పాట ఎంతో ప్రజాదరణ పొందింది. తెలంగాణ రాష్ట్రసాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని అసువులుబాస్తున్న అమరులను తల్చుకొని కన్నీటి పర్యంత మైతడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హృదయవిదారకంగ చనిపోయిన వేణు గోపాల్‌రెడ్డిని గురించి దేశపతి శ్రీనివాస్

“ఉస్మానియా గడ్డ మీద వేణుగోపాల్‌రెడ్డి / ఉడికిందా నీ నెత్తురు వేణుగోపాల్ రెడ్డి” అంటూ వీరులత్యాగాన్ని గానం చేస్తడు. ఈ పాటతో మొత్తం విద్యార్థి లోకాన్ని ఏకం చేస్తడు. ఆత్మహత్యలు పరిష్కారం కాదనే సందేశాన్నిస్తడు. అంతిమయాత్రలో అక్షరనివాళులు అర్పిస్తడు. అమరుల త్యాగాలను కీర్తిస్తడు. ఇట్ల ప్రతి సందర్భంలోను తెలంగాణ ప్రజల బాధలు, కన్నీళ్ళను అక్షరీకరించి అరుదైన పాటగా మలుస్తడు. ఉద్యమకవిగా, గాయకుడిగా అత్యంత ప్రజాదరణ పొందిన దేశపతి అంత ఈ మట్టి గొప్పతనమని అంటడు. తెలంగాణ అంటెనే ఒక సామూహిక గాన సంస్కృతి గల విశిష్టమైన ప్రాంతమని, అందుకే ఇక్కడ పాట ప్రవహిస్తుందని అంటడు. నిజానికి బలమైన జానపద ముద్ర కలిగిన ఇక్కడి ప్రతిమాటలోను పాటే ధ్వనిస్తది. ప్రతిమనిషికి పదాలతో సంలీనం చెందే తాదాత్మ్యక గుణం ఉంటది. విప్లవాల పురిటిగడ్డ పౌరుషాన్ని, వీరత్వాన్ని గానం చేస్తడు. ఈ నేల గొప్పతనాన్ని ఆవిష్కరించి, సమైక్యపాలకుల వివక్షపూరిత విధానాన్ని ఎండగడుతూ దేశపతి శ్రీనివాస్ గంటల తరబడి ప్రసంగిస్తడు. అప్పటి కప్పుడు ఆశువుగా పాడి, లక్షలాదిమందిని ఉర్రూత లూగించిన ఘనత దేశపతి శ్రీనివాస్‌ది. సుదీర్ఘ తెలంగాణ ఉద్యమంలో హింసకు తావు లేకుండ శాంతియుతమార్గంలో పయణించే నేర్పును కలిగించింది పాట. తాను స్వయంగా పాటలు

రాయడంతో పాటు ఇతర కవుల పాటలను అర్థవంతంగాను, సందర్భాను సారంగాను సంధిస్తడు.

ముల్కీఉద్యమం మొదలు తెలంగాణ సిద్ధాంతాన్ని భుజాని కెత్తుకొని అలుపులేకుండ తిరిగిన పోరాట బాటసారి ప్రొఫెసర్ జయశంకర్ సార్. ఒక్కమాటలో చెప్పాలంటే జయశంకర్ సార్ లేకపోతే తెలంగాణ ఉద్యమం లేదు. అంతగా పరితపించి, నిత్యం తెలంగాణను స్వప్నించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తల్చుకుంటూ దేశపతి శ్రీనివాస్

"తెలంగాణ చెరువు తీరు మన జయశంకరు సారు

అలుగు దుంకి పారు పదునైన మాట జోరు" రాసిన ఈ పాట జయశంకర్ సార్ ఆత్మను ఆవిష్కరించినట్టుంటది. స్వరాష్ట్ర సాధన కోసం జరుగుతున్న సమరమిదని, సమానత్వ విలువ కొరకు సాగుతున్న పయణమని, చెరవీడే సమయం చేరువలో ఉందనే ధీమాని వ్యక్తం చేస్తడు. అతిసాధారణ పదాలలో బరువైన భావాన్ని పలికిస్తడు.

కొంతకాలం మంజీర రచయితల సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన దేశపతి శ్రీనివాస్ 2014లో 'తెలంగాణ వికాస సమితి'ని ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టిండు. "కవిదృశ్యం" పేరిట కొందరి కవుల కవిత్వ పఠనాన్ని చిత్రీకరించి, రికార్డు చేసిండు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో తనదైన పాత్ర పోషించిండు. దేశపతి శ్రీనివాస్ ప్రస్తుతం ముఖ్యమంత్రి ఓ.ఎస్.డిగా పనిచేస్తున్నాడు. అనంతరం అమెరికాలో 'టాటా' వారి సభలకు హాజరై ప్రభుత్వ విధానాన్ని, సంక్షేమ పథకాల అమలుతీరును వివరించి తెలంగాణ రాష్ట్ర గొప్పతనాన్ని చాటిచెప్పుతడు.

దేశపతి శ్రీనివాస్ "తెలంగాణ సాహిత్య చరిత్ర"ను అనేక పాటల సమాహారంగ అల్లుకుపోతడు. "జయజయోస్తు తెలంగాణ" పేరుతో పుస్తకంగ ప్రచురించిండు. పద్దెనిమిది పాటలతో కూడిన ఈ కథాగేయాలను కళాకృష్ణ గొప్ప నృత్యరూపకంగ తయారు చేసిండు.

"అదిగదిగో అక్షర ఝుటార్ఝుటి దేశీయ పదగతుల దివ్య కవితార్భటి

పద్యమై గద్యమై విశ్వేషువేజ్యమై ఏలలై కోలలై పరమేశు లీలలై

ఎగిసింది ఎగిసింది కావ్యరసగంగ పాల్కురికి సోమన్న హృదయముప్పొంగ" అంటూ సొగసైన దేశీ కవిత్వాన్ని గురించి కోలాట పాటందుకుంటడు. జానుతెనుగు పద్యాల జాడ చూపిస్తడు. అక్షరాల విల్లంబులను సంధించిన ద్విపదను పాడి దిగంతాలను తట్టి లేపుతడు. పామర చరితకు మించి పావనమైనదేముందని అంటడు.

మహాకవుల పరంపరగా కొనసాగుతున్న సాహిత్యవనంలో విహరిస్తడు.

"తొలితెలుగు కవయిత్రి కుప్పాంబిక / ఆమె గోనబుద్ధారెడ్డి ప్రియపుత్రిక" అంటూ లయబద్ధంగ పాటందుకుంటడు.

"తెలంగాణను మేల్కొలిపిన తొలి వేకువ వికాసం / సాహితీ గగనాన స్వాభిమాన ప్రకాశం

సురవరం సురవరం ఆధునిక యుగస్వరం / సురవరం ప్రతాపరెడ్డి సారస్వత గిరిశిఖరం" అంటూ మరెవ్వరు సురవరం గురించి చెప్పినా ఒక అక్షరం తక్కువే అయితది. అంత బలమైన పదాలతో సురవరాన్ని బంధించిన దేశపతి నిజంగా సరస్వతీపుత్రుడే. మామూలు కవులకు సాధ్యం కాని భాషాపాండిత్యం దేశపతి సొంతం. "అన్యాయాన్నె దిరిస్తే నాగొడవకు ముక్తి ప్రాప్తి" అన్న కాళోజీ గురించి దేశపతి శ్రీనివాస్ తనదైన శైలిలో "అక్షరాలు పోటెత్తె ప్రజాహృదయ ఘోష / కాళోజీ కవిత పలికె కన్నీటి భాష" అంటూ కాళోజీలోని మానవీయకోణాన్ని పట్టుకుంటడు. ఆ మహాకవి కలగన్న సమాజం అవతరించాలని ఆకాంక్షిస్తడు. "మూగబోయిన కోటి తమ్ముల గళాల పాట పలికించే కవితా జవమ్మునన్" అన్న దాశరథిని గురించి "జ్యోతనివే దాశరథి కవితామృత వార్నిధి / బడుగుజీవి కళ్ళలోని బడబాగ్నుల ప్రతినిధి" అంటడు. బడుగు బలహీనుల పక్షం వహించిన దాశరథి కవితామృత ధారల్ని మనకు అందిస్తడు.

బండి యాదగిరి వేసిన బాట ఆగిపోదు సుద్దాల హనుమంతు పాట మూగబోదు" అంటూ శాసనం చేస్తడు. తెలుగు సినీ వినీలాకాశంలో ధృవతారగా నిలిసిన తెలంగాణ ముద్దుబిడ్డ డా. సి. నారాయణరెడ్డిని గురించి దేశపతి శ్రీనివాస్ అద్భుతంగ రాస్తడు. తెలుగుకు జ్ఞానపీఠాన్ని అందించిన మహాకవిని గురించి

"సినారె మన సినారె / వెండితెరను వెలిగించిన పల్లె మట్టిపాట

పగలే వెన్నెల కురిసిన పరిమళాల పూదోట" అంటూ మొత్తం సినారె సినీసాహిత్యాన్ని ఒక్కమాటలో చెప్పుతడు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగ దేశపతి శ్రీనివాస్ సాహోరే అంటూ రాసిన

"నేల పులకరించె ఆ నింగి పరవశించె సంబురాల తెలంగాణ సింగిడోలె మెరిసె

వానజల్లు కురిసె బీడుభూమి తడిసె పంటచేల గట్లమీద పాలపిట్టలెగిసే" అంటూ ముఖ్యమంత్రి కలువకుంట్ల చంద్రశేఖర్ రావు పాలనలో పరవశిస్తున్న తెలంగాణ పల్లెను కండ్లార చూసుకొని పొంగిపోతడు. పదాలపూలు బేర్చి బతుకమ్మ పండుగై, పాటల సింగిడై నడిసిపోతడు. మానవీయ సమాజం కోసం తన మాట పాటల యాత్ర నిరంతరం కొనసాగుతూనే ఉంటదని ప్రకటించిన దేశపతి శ్రీనివాస్‌కు పాటాభివందనాలు.

-అంబటి వేకువ,
m: 94927 55448
e: varji.ambati@gmail.com

భూతాపంపై ప్రజల్లో చైతన్యం పెంచాలి

దక్కన్ అకాడమీ (హిమాయత్‌నగర్) చంద్రం భవనంలో 'వాతావరణ మార్పులను అర్థం చేసుకోవడం–పారిస్ ఒప్పందం తదనంతర కార్యాచరణ' అంశంపై గత ఏడాది జరిగిన టీఆర్‌సీ టాక్ కార్యక్రమంలో ఆస్ట్రేలియాలోని గ్రిఫిత్స్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ తిమోతి మార్క్ క్యాడ్‌మ్యాన్ (కీ సెంటర్ ఫర్ ఎథిక్స్, లా, జస్టిస్ అండ్ గవర్నెన్స్ అండ్ లా), ఐఐసీటీ రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ కె. బాబురావు, చేతన సొసైటీ డైరెక్టర్ డాక్టర్ డి.నర్సింహారెడ్డి, తెలంగాణ రిసోర్స్ సెంటర్ (టిఆర్‌సి) చైర్మన్ యం.వేదకుమార్ ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు.

భూతాపం తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని వక్తలు అన్నారు.

భూతాపం తగ్గించేందుకు ఆయా దేశాలు తీసుకోవాల్సిన చర్యలపై అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పారిస్ సదస్సు పూర్వాపరాల గురించి డాక్టర్ తిమోతి వివరించారు. భూతాపం తగ్గించడానికి ఎవరెలాంటి చర్యలు తీసుకోవాలి, ఎంత మేరకు తగ్గించాలి అనే విషయమై చర్చలు జరిగాయని పేర్కొన్నారు. మొత్తం మీద 177 నిర్ణయాలు తీసుకున్నారని, 29 అంశాలు ఉన్నాయని అన్నారు. ఆ చర్యల పురోగతిని ఈ పాలనా వ్యవస్థ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉంటుందన్నారు. వీటి అమలు సరిగా జరగాలంటే ప్రజల భాగస్వామ్యం కావాలని, అవగాహన పెరగాలని సూచించారు. పలు దశలు, పలురూపాల్లో ప్రజలు పాల్గొనే విధంగా ప్రతీ దేశం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. భూతాపం తగ్గించుకోవాలంటే కార్బన్ ప్రింట్‌ను తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ తిమోతి అన్నారు. ఇప్పటి విధానాల ప్రకారం తగ్గించుకుంటూ పోయినా, కొన్నేళ్ళకు భూమిపై ఉష్ణోగ్రత 3.8 డిగ్రీలు పెరుగుతుందని, అలా కాకుండా ఉండాలంటే కార్బన్ ప్రింట్‌ను మరింతగా తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు గాను శిలాజ ఇంధనాలు గాకుండా ప్రత్యామ్నాయ, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని అధికం చేసుకోవాలని సూచించారు.

ఐఐసీటీ రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ ఇప్పటి పరిస్థితులను చూస్తుంటే, కరువులు, తుఫానులు, సముద్ర మట్టం పెరగడం, వరదలు లాంటి ప్రకృతి విపత్తుల నుంచి మనం ఏమీ నేర్చుకున్నట్లు లేదని వ్యాఖ్యానించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వాలు పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెట్రోలియం నిల్వలు తగ్గుతున్న సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్రోలియం యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.

చేతన సొసైటీ డైరెక్టర్ డాక్టర్ డి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ, ప్రపంచవాణిజ్య సంఘం ఆధ్వర్యంలో చేసుకున్న కొన్ని ఒప్పందాలు పర్యావరణ అనుకూల నిర్ణయాలు తీసుకోకుండా అడ్డంకులుగా మారుతున్నాయన్నారు. అంతర్జాతీయంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ధనిక దేశాల మీద సంధించిన ప్రశ్నలు అంతర్గతంగా మనదేశంలో కూడా సంపన్నవర్గాలకు వర్తిస్తాయన్నారు. అత్యధికంగా ఉన్న పేదలకు అందకుండా ప్రకృతి వనరుల యాజమాన్యం నిర్వహణ, వినియోగం కొద్దిమంది సంపన్నవర్గాల చేతుల్లో ఉండడం వల్ల అసమానతలు పెరిగి సంఘర్షణ పూర్వక వాతావరణం ఏర్పడుతోందన్నారు. ఆహారం, నీటి కొరతతో పర్యావరణ విధ్వంసం మొదలైందన్నారు. వివక్షాపూరిత వ్యవస్థ వల్లనే పర్యావరణ విధ్వంసం చోటు చేసుకుంటున్నదన్నారు. ఈ వ్యవస్థను మార్చినప్పుడే పర్యావరణం బాగుపడుతుందని, పేదరికం తగ్గుతుందని అన్నారు. మన దేశంలో ఉన్న సంప్రదాయ ఉత్పత్తి వనరులను కాపాడుకుంటే మనం ధనిక దేశాల టెక్నాలజీ కోసం అర్రులు చాచాల్సిన పని లేదన్నారు. చేనేత లాంటి పరిశ్రమలను ప్రోత్సహిస్తే పర్యావరణం, ఉపాధి, ఆర్థిక వ్యవస్థలు బాగుపడతాయన్నారు.

టిఆర్‌సి చైర్మన్ యం.వేదకుమార్ మాట్లాడుతూ సౌరశక్తి, వాయుశక్తి లాంటి ప్రత్యామ్నాయ, పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భూతాపంపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు సామాజిక సంస్థలు మరింతగా ముందుకు రావాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ తరహా కార్యక్రమాలు విజయవంతం కాగలవన్నారు.

– ఆదర్శ్, m : 94945 41302 ద

జలవనరుల సంరక్షణే ఇక కీలకం

ప్రపంచవ్యాప్తంగా 119 అభివృద్ధి చెందుతున్న దేశాల్లో తాగునీటి కొరత సమస్య తీవ్రంగా వుందని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధనలకు సంబంధించిన తాజా అధ్యయనం తెలియజేసింది. ప్రజలకు శుభ్రమైన తాగునీటిని అందించడంలో ఆయా దేశాలు అనేకానేక సమస్యల్ని ఎదుర్కొంటున్నాయి. ప్రకృతిసిద్ధమైన నదులు, చెరువులు, సరస్సులు కలుషితం కావడం వల్ల నానాటికీ పరిశుభ్రమైన నీళ్లు దొరికే అవకాశాలు తగ్గిపోతున్నాయి. నీటి సరఫరాకు సంబంధించిన విధానాల అమలులో జాప్యం వల్ల సమస్యల తీవ్రత పెరుగుతోంది.

అభివృద్ధి విధానాలకీ, తాగునీటి సరఫరాకీ నడుమ సమతుల్యం లేకపోవడం వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. నీటి వనరులు కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన ప్రభుత్వాలు ఈ దిశగా సమగ్ర చర్యలు తీసుకోకపోతే నీటి కొరత మరింత పెరిగే ప్రమాదముందని ఐక్యరాజ్యసమితి నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాగునీటి సమస్య మరింత తీవ్రం కాకముందే జాగ్రత్తలు తీసుకోవాలని వారు చెబుతున్నారు.

తొలుత చెరువులు, నదులు కలుషితం కాకుండా చూసు కోవాలి. ఇప్పటికే కలుషి తమై వుంటే వాటికి గల కారణాల్ని యోచించాలి. ఈ రకమైన ప్రదేశాల్లో నీటిశుద్ధి ప్లాంట్ల వల్ల ఏ మేరకు ప్రయోజనం ఉంటుందో అధ్యయనం చేయాలి. నీటిని శుద్ధి చేసుకుని వాడుకునేందుకు అనువుగా వుంటే వాటిని మరింత కలుషితం కాకుండా కాపాడుకునేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలి.

పారిశ్రామిక వ్యర్థాలు, రసాయనాలు నీటిలో కలపడం వల్ల ఏర్పడే కాలుష్యం మరో సమస్య. ఈ సమస్యలకు గల మూలాల్ని గుర్తించాలి. వీటికి ఏ రకమైన పరిష్కారం లభిస్తుందో చూడాలి. కొన్ని రకాల ద్రావకాల వల్ల భూగర్భజలాలు కూడా కలుషితమవుతాయి. తాగడానికి ఎంతమాత్రం ఉపకరించని స్థితి ఏర్పడుతుంది. బోర్లు వేస్తే నీళ్లు వస్తాయి. కానీ ఆ నీళ్లను తాగడానికి ఉపయోగించలేరు. కొన్నిసార్లు బట్టలు ఉతకడానికి గిన్నెలు కడగడానికి కూడా ఉపయోగించలేరు. కనుక ఈ రకమైన జలాలు దైనందిన జీవితా నికి ఎంతమాత్రం ఉపకరించవు. అందుకని వీటిని ఏరకంగానూ వాడుకోవడం కుదరదు.

కాలుష్య కారక పరిస్థితులున్నచోట్ల తరుచుగా నీటిని భూమి ఉపరితల జలాల్ని పరీక్షించాలి. ఉపరితల కాలుష్యానికి గల కారణాలు తెలుసుకోవాలి. మురికినీటి వల్ల ఏర్పడే కలుషితాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి యోచించాలి. మురికి నీరు తీవ్ర స్థాయిలో పొంగిపొర్లే పరిస్థితులు ఏర్పడిన పట్టణాల్లో , నగరాల్లో సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రకృతి సిద్ధమైన సరస్సులు, చెరువులు కాలుష్యం కారణంగా దెబ్బ తింటున్నాయి. చేపలు కూడా మనుగడ సాగించలేని రీతిన కాలుష్యం పెరగడం తీవ్రమైన సమస్య. చిలుకా సరస్సు, కొల్లేరు, పులికాట్ సరస్సు వంటివి కాలుష్యం కారణంగా దెబ్బ తింటున్నాయి. మనదేశంలో ఉన్న అనేక మంచినీటి సరస్సులను కాపాడుకోవాలంటే పర్యావరణంలో పరిస్థితుల్లో మంచి మార్పులు రావాలంటే ప్రభుత్వం చిత్త శుద్ధితో నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలి.

కొన్ని రాష్ట్రాల్లో చెరువుల సంఖ్య అధికం. పర్యావరణ కాలుష్యం వల్ల ఆయా చెరువుల్లోని నీళ్లు కలుషితమవుతున్నాయి. కొన్ని పట్టణాల, గ్రామాల తాగునీటి సమస్యని పరిష్కరించగలిగిన చెరువులు ఇవాళ కాలుష్యం బారినపడి కొట్టుమిట్టాడుతున్నాయి. అందువల్ల తీవ్రమైన తాగునీటి సమస్యతో అవస్థపడుతున్నాయి.

నీటి కాలుష్య నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోడానికి ముందుగా సమగ్రమైన అధ్యయనాలు జరగాలి. ఆయా రాష్ట్రాల్లో ఉన్న నదులు, సరస్సులు, చెరువులు పర్యావరణ కాలుష్యానికి ఏ మేరకు అతీతంగా ఉన్నాయో పరిశీలించాలి. సాగునీటికి, తాగు నీటికి ఎంతమేరకు ఉపయోగపడగలవో పరీక్షించాలి. నీటిశుద్ధి ప్లాంట్ల వల్ల ప్రయోజనం ఉంటుందో లేదో చూసుకోవాలి.

ప్రకృతి సిద్ధమైన నీటి వనరుల్ని కాలుష్యం కారణంగా కోల్పోవడం భారీనష్టం. ఈ నష్టాన్ని పూడ్చుకోవడం సాధ్యం కాదు. అందుకని జలవనరుల సంరక్షణలో కచ్చితమైన విధివిధానాలు పాటించాలి.

పర్యావరణ సమస్యల్లో తీవ్రమైందిగా నీటికాలుష్యాన్ని పరిగణించాలి. నేటి అవసరాన్ని, భవిష్యత్ తరాల అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాలి.

– కట్టా ప్రభాకర్
m : 8106721111
e: akumarkatta@gmail.com

వ్యక్తి, మానవ సమాజం... నడుమ కరోనా

2019 సంవత్సరం చివరి రోజు, డిసెంబర్ 31న మానవాళి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం అనుకుంటూ ఉండగా, 2020 లీపు సంవత్సర ఉదయం పట్టుకుని వచ్చిందొక అనూహ్య పరిణామం.మొత్తం మానవ జాతికి ఆరోగ్య అత్యవసర పరిస్థితి.

కంటికి కనబడదు. ఈగ, దోమ ఎత్తుకు రావు. పెంపుడు జంతువుల వలనో, దురలవాటో కారణం కాదు. ప్రకృతి వైపరీత్యం అంతకన్నా కాదాయె! నెలలు, వారాలు, రోజులు కాదు... గంటల్లో - పట్టణాలను, ఆ తరువాత మహా సముద్రాలను దాటి ఖండాలను, దేశాలను కబళించింది. అదే కోవిడ్-19 అనే ఒక కరోనా వైరస్.

కోవిడ్-19 అనే ఈ (RNA) ఆర్ఎన్ఏ వైరస్, పేద-ధనిక స్త్రీ - పురుష వయో భేదాలను వేటిని ఖాతరు చేయకుండా సార్వజనీనమైన వ్యాధిగా ప్రబలి పోయింది. చైనాలో వూహాన్ నగరం నుంచి వచ్చిన ఈ వ్యాధి అతి తక్కువ సమయంలో ప్రపంచ వ్యాధిగా మారింది.



ముందుగా మేల్కొన్న చైనా, ఇది గాలిలో తుంపరల ద్వారా (డ్రాప్ లైట్స్ వల్ల), మనిషి నుంచి మరొక మనిషికి, వ్యాప్తి చెందుతున్నట్టుగా పసిగట్టి, హుటాహుటిన నగరాలను వేరుపరచి, గాలిని శుభ్రపరచి, రహదారులను కడిగి, అప్పటికే వ్యాధి సోకిన వారిని దూరంగా పెట్టి, రాత్రింబవళ్ళు దానిపై యుద్ధం ప్రకటించింది.

అయితే, రోజులు గడుస్తూ ఉండగా ఆ వైరస్ బారిన పడి మరణించిన వారి సంఖ్య ప్రపంచంలో పెరుగుతూ వస్తోంది. మూడు నెలల్లో ఒక మిలియన్ కేసులు, అందులో 53 వేలకు పైగా మరణాలు సంభవించాయి. (ఈ వ్యాసం వ్రాసే సమయానికి).

తన జన్యువులో రూపాంతరం చెంది, ఈ కరోనా వైరస్ మనిషి పై తన ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ ఆటలో మొదటి రెండు నెలలు కరోనా వైరస్‌దే పూర్తి విజయం.

మార్చి 24 నుంచి మూడు వారాల పాటు పూర్తి స్థాయి లాక్ డౌన్‌ను, కొవిడ్-19 వైరస్ వ్యాధిని నియంత్రించడానికి ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారత ప్రభుత్వం తీసుకుని, తన తొలి స్పష్టమైన అడుగు వేసిందని చెప్పుకోవాలి.

కర్మాగారాలు, వాహనాలు, భవన నిర్మాణం, కళాశాలలు, కార్యాలయాలు, హోటళ్లు, వ్యాపార కేంద్రాలు ఒకటేమిటి సర్వంసహా అన్ని కార్యక్రమాలను రద్దు చేశారు.

మొట్టమొదటిసారిగా భారత దేశంలోని రైల్వే, విమాన సర్వీసులను నిలిపివేశారు. ప్రార్థన మందిరాలను మూసివేశారు. ఒక సమయంలో సెక్షన్ 144 విధించారేమో అనిపించేంతలా వీధులన్నీ నిర్మానుష్యం అయ్యాయి.

ఇది చాలా బలమైన, ముఖ్యమైన నిర్ణయం. కోవిడ్-19 వైరస్ స్వైర విహారానికి, ఎదురు నిలవడం అంటే "నివారణ ఒక్కటే మార్గమని", రోగ తత్వశాస్త్ర ఆచార్యులు, ఎపిడిమియాలజిస్టులు, వైద్యులు అందరూ చెప్పిన తరువాత ఈ కఠినమైన నిర్ణయం తీసుకోక తప్పలేదు.

1.3 మిలియన్ల ప్రజల సామూహిక ఆరోగ్యం దృష్ట్యా తీసుకున్న నిర్ణయం ఇది. ఈ నిర్ణయం తీసుకోక, నిర్లక్ష్యం చేసిన, ఇటలీ, ఫ్రాన్సు, ఇంగ్లాండు, అమెరికా వంటి దేశాలలో రెండు వారాల తరువాత పెరుగుతున్న మరణాల సంఖ్య ఈ విషయాన్ని మనకు గుర్తు చేస్తోంది.

లాక్ డౌన్ ప్రకటన తర్వాత భారత దేశ పౌరులు ప్రతిస్పందించిన తీరు కూడా అత్యంత ఆశ్చర్యాన్ని కలుగ జేస్తుంది.

వైద్యులు, నర్సింగ్ ఉద్యోగులు, పోలీసు వ్యవస్థ, పారిశుధ్య కార్మికులు, విద్యుత్తు బోర్డు ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది, మీడియా వారు, విపత్తు రక్షణ కమిటీలో ఉన్నవారు వీరందరూ ప్రతిస్పందించిన తీరైతేనేమి, పూర్తిస్థాయి క్రమశిక్షణతో, సేవా దృక్పథంతో, తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్న విధానం ఐతేనేమి చాలా విశిష్టమైనది.

లాక్‌డౌన్ ప్రకటించిన తరువాత కూడా అవిరామంగా విద్యుత్, మంచినీటి సరఫరా అవుతూనే ఉన్నాయి. టీవీ మరియు ఇంటర్నెట్ ప్రసారాలు యధావిధిగా కొనసాగుతున్నాయి. దీనివల్ల నవతరం యువకులు అందరూ తమ తమ ఉద్యోగాలను 'వర్క్ ఫ్రం హోమ్' పద్ధతిలో నిర్వహించుకుంటూ ఉన్నారు. పాఠశాలల యాజమాన్యం, చిన్నారులకు విద్యా బోధనను సరికొత్త మాధ్యమంలో తరగతి గదిలో కన్నా ఎక్కువ వ్యక్తిగత శ్రద్ధను చూపుతూ బోధన కొనసాగిస్తూ ఉన్నాయి. లాక్ డౌన్ ప్రకటించి నప్పటికీ, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పండ్లు, పాలు, అన్ని యధావిధిగా దొరికేటట్లుగా వ్యక్తిగత భౌతిక దూరం పాటించ డానికి, వృత్తాలను గీసి, ప్రజలకు అలవాటు చేయడం భారత దేశంలో వినూత్నమైన ప్రయత్నం అని ప్రపంచ దేశాలలో కొనియాడారు.

ఇవన్నీ ఇలా ఉండగా, రోజు కూలీ కార్మికులు, అసంఘటిత కార్మికులు, లెక్కపెట్ట లేనంత మంది చిరు వ్యాపారులు, చిరుద్యోగులు, ఆటోలు-క్యాబ్‌లు, అద్దె కార్లు, రిక్షాలు వంటి

వాహనాలు నడుపుకునే వాహనచోదకులు, నిర్మాణ రంగంలో ఉండే తాపీ పనివారు, వారితో పనిచేసే శ్రామికులు, పెయింటర్లు, ప్లంబర్లు, రోజు కూలీలు అందరూ ఎక్కడికక్కడ ఆగిపోవాల్సి వచ్చింది. మన ఇంటి ఎదురుగా పళ్ళు అమ్ముకునే ముసలమ్మ దగ్గరనుంచి, ఇడ్లీలు వేసి-పానీపూరి చేసే బండి వ్యక్తి వరకు, మన పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లే ఆటో డ్రైవర్ నుంచి ఇంటింటికీ తిరుగుతూ వస్తువులు-పుస్తకాలు-ఫ్యాన్సీ సామాను అమ్ముకునే వారి వరకు అందరి జీవితాలు ఉన్నట్టుండి ఖాళీ అయ్యాయి.

ఆదివారం వస్తే సండే బజారులో బట్టలు- పిన్నీసులు, పాత పుస్తకాల దగ్గర్నుంచి ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు ఎన్నో రకాల వస్తువులు అమ్ముకునే వ్యాపారులంతా ఏమైపోయారు?అని తలుచుకుంటే గుండె చెరువవుతుంది.

ఇక వలస కార్మికుల గురించి తలచుకుంటే, హృదయం ద్రవించక మానదు. కూటి కోసం, కూలి కోసం, పొట్ట చేత పట్టుకుని, పుట్టిన ఊరి నుంచి నగరాల వైపు వెళ్లిన అనేక మంది రోజు కూలీలు అక్కడ ఉద్యోగాలు తాత్కాలికంగా నిలిపి వేయడం వలన రెప్పపాటులో అనాధలై పోయారు. వీరితో పాటు పైచదువుల కోసం తమ ఊరి నుంచి పట్టణాలు, నగరాలకు వెళ్ళిన వేల మంది విద్యార్థులు హాస్టళ్లను ఖాళీ చేయించడంతో రోడ్డున పడ్డారు. వారంతా గుంపులు గుంపులుగా వేరే ప్రయాణ సాధనం లేక సొంత ఊరికి వందల కొలది మైళ్ళు నడిచి మరీ రావడాన్ని చూస్తే, తారుమారైన జీవన చిత్రం మనలను భయపెడుతుంది.

ఇంతే కాదు. చేతికి అంది వచ్చిన పంటను కోసుకోవడానికి వీలులేకుండా, మామిడి - అరటి - సపోటా వంటి పండ్ల తోటలకు నీరు పెట్టడం, పురుగుల మందు కొట్టడం వంటి పనులన్నీ స్తంభించిపోయాయి. కాయగూరల సాగు నిత్యకృత్యం. దానికి కావలసిన మనుషులు దొరకక, ఏం చేయాలో అర్థం కావడం లేదు. అటు రైతు ఆశ్చర్యంతో, అప్రతిభుడైపోయి, ఏదీ పాలుపోని పరిస్థితిలో ఉన్నాడు. మార్కెట్లో వస్తువుల వినిమయం తగ్గి, ఉద్యోగుల జీతభత్యాలు ఇవ్వవలసిన స్థితిలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు క్రుంగిపోయాయి. పర్యాటకులు లేక ఆ రంగం, సినీ పరిశ్రమ దిగ్బంధంలో చిక్కుకున్నాయి.

ఇవన్నీ దేశంలో, రాష్ట్రంలో, జిల్లాల మధ్య అంతర్గతంగా కళ్ళకు కనబడే సమాజం అనుభవిస్తున్న లోటుపాట్లు.

ఇక అంతర్జాతీయ సరిహద్దుల వద్ద చాలా దిగులు కలిగించే విషయం ఏమంటే ఇతర దేశాలకు వెళ్ళి, అక్కడ, ఉండలేక- తిరిగి రాలేక, భారతీయ సంతతికి చెందిన ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.

ఇంతటి విపత్కర పరిస్థితులలో కొన్ని మంచి సంఘటనలు కూడా కనబడుతున్నాయి.

దేశమంతా ఒకే తాటిపై నిలబడి నిత్యావసర వస్తువుల కోసం ఎగబడకుండా క్రమశిక్షణతో ఉండటం, పారిశుద్ధ్య కార్మికులకు-పోలీసులకు సహకరించడం చూస్తున్నాం. 1.3 మిలియన్ల జనాభా మొత్తం, ఆ దేశపు లా అండ్ ఆర్డర్ చట్టాన్ని గౌరవించడం అనేది ఆ దేశ సామూహిక క్రమశిక్షణను తెలియచేస్తోంది. ఇది భారత దేశానికి గల ప్రత్యేకించి ఉన్న, వేరెవ్వరూ దోచుకోలేని సంపద.

పర్యావరణ కాలుష్య విషయానికి వస్తే వాహనాలు, కర్మాగారాలు మూతబడిన తరువాత మార్చి నెల 20 నుంచి 27 వరకు జరిపిన పరిశోధనలో ఒక్క వారం లోనే వాతావరణ కాలుష్యం 76 శాతం తగ్గినట్టు ఆ శాఖ నిపుణులు తెలియ జేస్తున్నారు. ముఖ్యంగా సహజ వనరులైన పెట్రోలు- డీజిల్ - గ్యాస్ ఆధారంగా నడపబడే వాహనాలను వాడే భారతదేశంలో కార్బన్ ఉద్గారాలు బాగా తగ్గాయి. గాలిలో నైట్రోజన్ డై ఆక్సైడ్ కూడా తగ్గింది. పార్టికులేట్ మేటర్ PM అని చెప్పే వాయు కాలుష్యం పరిమితి (W.H.O.) డబ్ల్యూహెచ్వో 25 కన్నా ఎక్కువ ఉంటే హానికరం అని తెలియజేస్తుంది. ఇది ఢిల్లీలో 91 ఉండేది.

వారం రోజుల్లోనే 26కు తగ్గింది. ఇదే తరహా మార్పులను బ్రిటన్ - ఇటలీ- చైనాలలో గమనించారు. ఆకాశం మరింత నీలంగా మారింది. ఎక్కడెక్కడి పక్షుల కూతలు, ఉడుతల చప్పుళ్ళు వినబడుతూ ఉన్నాయి.

పెద్దపెద్ద విశ్వవిద్యాలయాల ప్రాంగణాలలో, జన సంచారం లేని కారణంగా చెట్ల నీడన కొంగలు, నెమళ్ళు, ఇతర జంతువులు సమూహాలుగా కనబడుతున్నాయట.

వెనిస్ నగరంలో ప్రవహించే కాలువల నీరు తేటపడి, కొంగలు, బాతులు, చేపలు ప్రశాంతంగా విహరిస్తున్నాయట! మన దేశంలో మధ్య ప్రదేశ్, ఒరిస్సా, కేరళ, కర్ణాటక,తమిళనాడు లాంటి రాష్ట్రాలలో అటవీ ప్రదేశాలకు సమీపంలో ఉండే రహదారుల పైన అనేక వన్యప్రాణులు సేద తీరుతున్నాయట!

అవునా? ఇది నిజమేనా?

ఊహించలేని వేగంతో సాగిపోతున్న ఆధునిక జీవితం, 21 శతాబ్దపు వ్యాపార ఆధారిత, కంప్యూటర్ యుగం ఒక్కసారిగా ఉరుకులు, పరుగులు ఆపి నిదానించినట్టయింది. కుటుంబం అంతా కలిసి గడిపే సమయం పెరిగింది. కుటుంబ సభ్యులకు అవగాహన పెరిగింది.

ఇరవై నాలుగు గంటలు పరుగు తీసినా- తీయకున్నా గడిచిపోతాయి. కానీ విశ్వమంతటా వాతావరణ కాలుష్యం తగ్గడం, ఒకరిపై ఒకరికి నమ్మకం పెరగడం చూస్తే, ఈ కరోనా వైరస్ విధించిన కర్ఫ్యూ 'శాపంలా కనబడే వరమే' అనుకోవచ్చు.

సూక్ష్మ జీవశాస్త్ర ప్రకారంగా, వైరస్ సోకిన మనుషులలో 10 శాతం మంది మరణించవచ్చు. వ్యాధిగ్రస్తుడు ఎదుట పడినప్పుడు అతడు 4-6 మందికి ఈ వ్యాధిని సంక్రమింప చేయవచ్చు. ఈ సమయం 14 రోజులు.

మన దేశపు లాక్‌డౌన్ సమయం 21 రోజులు.

ఒక పక్క వైరస్‌తో పోరాడే సిబ్బందికి వ్యక్తిగత భద్రత ఇచ్చే మాస్కులు - డ్రెస్సులు సరిపడేటన్ని దొరకటం లేదన్న నిజం ఉంది. ఏ కారణం చేతైనా వైరస్ వల్ల వచ్చే అనారోగ్యం తీవ్రమైతే వ్యాధిగ్రస్తునికి అందించవలసిన మందులు, శ్వాసను అందించవలసిన వెంటిలేటర్ సదుపాయాలు బాగా తక్కువగా ఉన్నాయన్న భయం వెంటాడుతూనే ఉంది.

అయినా, ప్రతి రోజు ఆశా వర్కర్లు, వాలంటీర్లు వ్యాధిగ్రస్తులను, విదేశాలకు వెళ్లి వచ్చిన వారిని, వారి కుటుంబ సభ్యులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైతే సాయం కోసం తరలించడం జరుగుతూనే ఉంది. డిజిటల్ మీడియా గత కొన్ని సంవత్సరాలుగా భారత దేశంలో బాగా ప్రాచుర్యం పొందిన కారణంగా నగదు లావాదేవీలు ఫోన్ ద్వారానే ఆన్లైన్‌లో జరగడం, జనసామాన్యానికి అందుబాటులో ఉండేలా కరోనా వైరస్ వ్యాధి గురించి సహాయం అందించే మొబైల్ యాప్‌లను తయారు చేయడం, వాటిని వినియోగంలోకి తీసుకురావడం, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా, కోవిడ్ వైరస్ కోసమై, వెబ్ సైట్‌ను తెరిచి నిజాయితీగా గణాంకాలను అందించడం వంటివి చూస్తుంటే మన దేశం కూడా ముందడుగు వేసిందన్న భరోసా కనబడుతోంది.

ఇంకా ఎంతో దూరం ఉంది, ఇంకా కరోనా వ్యాధి భారం ఉంది. దినకూలీలు, వలస కార్మికుల రోదనలు వినబడుతున్నాయి. పరిశోధనలు జరగాలి. కోవిడ్ వైరసు జన్యుక్రమం తెలుసుకోవాలి. ఈ వైరస్ కోసం మందులను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. చెదురుమదురు సంఘటనలలో చట్ట ఉల్లంఘనం, వైద్య సిబ్బందికి ఇబ్బంది కలిగించేలా రోగులు- వారి బంధువులు సహనాన్ని కోల్పోయి దాడికి దిగడం, సరిహద్దు ప్రాంతాలలో ప్రజలు చలి, చీకటికి-ఆకలి-దప్పికలకు రోదించడం... జరుగుతూనే ఉన్నప్పటికీ, ఈ సున్నితమైన అంశాలపై యంత్రాంగం ప్రతి స్పందించే ప్రయత్నం చేస్తోంది.

స్వచ్ఛంద సేవా సంస్థలు, గ్రామ స్థాయిలో సైతం దయార్ద్రహృదయులైన వారంతా అనాథలను, వృద్ధులను, రోజు కూలీలను ఆదుకుని ఉచితంగా ఆహారం, వస్తువులు ఇస్తూనే ఉన్నారు. టాటా గ్రూపు వంటి పెద్ద సంస్థలు, ప్రముఖులు ఎన్నో కోట్ల రూపాయల ఆర్థిక సహాయం ఇచ్చి తమ ఉదారత చాటుకుంటున్నారు.

కరోనా లాక్ డౌన్ మనకు నేర్పిన పాఠం ఏమిటంటే, జీవితం వ్యాధి-మరణం పక్క పక్కనే ఉండవచ్చని.

వారాంతాలలో పూర్తిగా కదలికలను ఆపితే మన పర్యావరణాన్ని మనం రక్షించుకోవచ్చునేమోనని.

మనుషులపై సహానుభూతి కలిగి ఉండాలని.

ప్రమాదం వస్తే ఒక్కరుగా కాక, సంఘటితంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యం అదనపు విలువగా ఇచ్చింది. మానవత్వం పెంచింది.

కుదేలైన పరిశ్రమల గురించి ఒక్క మాట చెప్పుకోవాలంటే ప్రతి దేశం విదేశీ ఉత్పత్తులను కాక తమ దేశంలో తయారు చేసిన వస్తువులను వినియోగించడం, బ్రాండ్ ఆధారిత ఆధునికతను కాక లోకల్ వ్యాపారులను ప్రోత్సహించడం, విదేశీ ఆహార వ్యాపార సంస్కృతి కన్నా సౌహార్ద్రపూరిత అంతఃకరణ గలిగిన సంఘమే శాశ్వతమైనది - అనే పాఠం సూచిస్తోంది.

త్వరగా కరోనా వైరస్ రాక మునుపు ఉన్న జీవితం వస్తే బాగుంటుంది, అందరూ ప్రాణ భయం లేని ఆరోగ్య జీవనం గడిపి లాక్ డౌన్ ఎత్తివేసి, ఇదివరకటి జనజీవన స్రవంతి మరల వచ్చేయాలని కోరుకుందాం.

కాని, ఆ కరోనా రాక పూర్వం ఉన్న ఏ లోటుపాట్లు, ఎలాంటి మానవ తప్పిదాలు ఉన్నాయో గ్రహించి వాటిని చక్కదిద్దుకోవాల్సి ఉంది. ప్రతి వ్యక్తీ, ప్రతి దేశం... మానవ సమాజం యావత్తూ.

-నాగసూరి వేణుగోపాల్

m : 919440732392

-కాళ్ళకూరి శైలజ

m : 9885401882

e : venunagasuri@gmail.com

కరోనాకి ఓ రిటర్న్ గిఫ్ట్!

ఏమైందిప్పుడు
క్షణాలు మాత్రమే కల్లోలితం
ఆత్మస్థైర్యాలు కాదు కదా
సమూహాలు మాత్రమే సంక్షోభితం
సాయం చేసే గుండెలు కాదు కదా !

ఎన్ని చూడలేదు మనం
కలరా వచ్చి ఎన్ని గ్రామాలు కలత చెందలేదు
కలలో కూడా కలరా కన్పిస్తుందా ఇప్పుడు
ప్లేగుని జయించిన దరహాసంతోనే కదా
చార్మినార్‌ని నిర్మించుకున్నాం !

గతమెప్పుడూ విజయాల్నే గుర్తు చేస్తుంది
వర్తమానమెప్పుడూ సవాళ్ళనే చూపిస్తుంది
భవిష్యత్తెప్పుడూ ఆశలనే ప్రోది చేస్తుంది
కుంగుబాటు తాత్కాలికమే
యుద్ధభూమిలోకి దిగాక
వెనక్కు తిరగటం, వెన్ను చూపటం మనకు తెలియదు

యుద్ధం ఏ రూపంలో వస్తేనేం
మిస్సైల్ అయినా - వైరస్ అయినా
పెద్ద తేడా ఏం వుంటుంది కనుక !

నీకు బాగా తెలుసు-
జీవనవాంఛాజనితం మన దేహం
ఎన్ని మార్లు యుద్ధ ప్రసవాలు చూడలేదు
ప్రతి ఆంక్షను మన కాంక్షగా మార్చుకోలేదు !
కరోనా పాజిటివ్ అయితే ఏంటట
పాజిటివ్ దృక్పథం మన మందనుకున్నాక
సామాజిక దూరం మన అస్త్రమయ్యాక
జనతా కర్ఫ్యూ మన కవచమయ్యాక
ఇప్పుడిక క్వారెంటైనే మన వాలెంటైన్ !

ఇక, కరోనా మాత్రం కరిగి కనుమరుగు కాదా ?
క్యా కరోనా అని దీనంగా అర్థించొద్దు
దొంగతనంగా ప్రవేశించిన కరోనాకి కరుణ తెలియదు
క్యా కరోగే అంటూ ఎదురు తిరిగి ప్రశ్నించు
లెక్కపెట్టాల్సింది పోయిన ప్రాణాల్ని కాదు
నిత్య రణస్థలిలో కరోనా ఎన్ని లక్షల చేతుల్లో
పరాజిత అయ్యిందో ఆ లెక్కలు చూద్దాం
మన కలాల్ని కరవాలాలుగా మార్చి కవి సిపాయిలుగా మారదాం
నిరస్త్రగా-క్షతగాత్రులుగా మిగలకుండా
రథ, గజ, తురగ పరివారాలతో పనిలేకుండా
ధైర్యం, సంకల్పం, జీవనేచ్ఛలే సైన్యంగా ప్రతియుద్ధం ప్రకటిద్దాం
దేహ దేశంలో జరిగే అంతర్యుద్ధం ఇది - ఆత్మస్థైర్యంతో ఎదిరిద్దాం
కవిత్వపు చికిత్సతో మానసిక సన్నద్ధతను అందిద్దాం
ఎన్నో యుద్ధాలను చూసాం - కానీ ఇది ఎంతో ప్రత్యేకం
గుంపుగా గుంపుతో గుమిగూడి చేసేది కాదు
విడివిడిగా ఒక్కొక్కరిగా సామూహిక పోరాటం చేయాలి
ఈ యుద్ధంలో ఒక్కొక్కరు ఒక్కో ఒంటరి సైనికుడు కదా
ఏకాకి మానవుడి చుట్టూ అక్షరాల రక్షణ వలయం అల్లుదాం రండి
కబళించాలని చూసే కరోనాని మట్టుబెట్టే చైతన్యాన్ని నింపుదాం
విమానాలలో దిగుమతవుతున్న మహమ్మారికి ఐసోలేషన్ వ్యూహంతో
నమస్తే మంత్రంతో రిటర్న్ గిఫ్ట్ ఇద్దాం రండి !

- అయినంపూడి శ్రీలక్ష్మి
m : 99899 28562
e: shreelaxmi.inampudi@gmail.com

పాఠకులు, రచయితలకు శుభవార్త

దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, వర్ధమాన రచయితలు, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింపజేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :
"చంద్రం" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

- ఎడిటర్

సత్ఫలితాలు ఇచ్చిన సీఎం కేసీఆర్ నిర్ణయాలు

కరోనా వైరస్ నియంత్రణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండి పకడ్బందీ చర్యలు తీసుకుంది. కరోనా కట్టడిలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రం మొత్తం మార్చి 16 నుండి పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలకు సెలవులు ప్రకటించి విద్యార్థులు బయటకు రాకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. తక్షణమే మార్చి 22 నుండి లాక్‌డౌన్ అమలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా ప్రయత్నించారు. రేషన్ కార్డ్ కలిగిన ఒక్కో కుటుంబానికి 1500 రూపాయలు, ఒక్కో వ్యక్తికి 12 కేజీల బియ్యం పంపిణీ చేసి పేదలు, బడుగు జీవులకు బాసటగా నిలిచారు. వైరస్‌పై యుద్ధం చేయాలంటే ప్రజలు సహకరించాలని నిత్యం విజ్ఞప్తి చేస్తూనే అవగాహన కల్పించారు. తెలంగాణ చుట్టూ ఉన్న ఇతర రాష్ట్రాల సరిహద్దులను మూసివేసి వైరస్ వ్యాప్తి చెందకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. వైరస్ ఆరంభంలో 10 వేల ఐసోలేషన్ బెడ్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం వాటి సంఖ్యను క్రమంగా 22 వేలకు పెంచింది. తాజాగా వాటి సంఖ్య లక్ష దాటించారు. ఇప్పుడు తెలంగాణలో లక్ష మందికి కరోనా వచ్చినా వైద్యం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండటం గర్వకారణమనే చెప్పాలి. కరోనాపై యుద్ధంలో డాక్టర్లు, పోలీసులు చేస్తున్న కృషి అమోఘమైంది. ఇదంతా కేసీఆర్ దృఢ సంకల్పంతో ముందుండి కృషి చేయడం వల్లే వ్యాధి అదుపులో ఉంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆదేశాలను పాటించడంలోనూ, చప్పట్లు కొట్టడం, దీపాలు వెలిగించడం వంటి కార్యక్రమాల్లో దేశంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది.

అటు కేంద్ర ప్రభుత్వం సైతం వైరస్ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాక్‌డౌన్ విషయంలో ప్రజల మేలుకోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇతర దేశాల విమానాలు ఇండియాలోకి రాకుండా అడ్డుకట్ట వేశారు. రైళ్లు, బస్సులు నడపొద్దని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం సైతం పేద ప్రజల కోసం 1.70 లక్షల కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించింది. జన్‌ధన్ ఖాతా కలిగిన ప్రతి ఒక్కరికి 500 జమ చేశారు. రేషన్ కార్డ్ కలిగిన ఒక్కో సభ్యునికి 5 కేజీల బియ్యం లేదా గోధుమలు ఇచ్చి ప్రజలను ఆదుకున్నారు. ఇంత పెద్ద దేశంలో వైరస్ చాలా వరకు కంట్రోల్లో ఉండడమంటే మాటలు కాదు. దేశం మొత్తాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడానికి డాక్టర్ల సేవలకు గుర్తుగా ప్రజలతో క్లాప్స్ కొట్టించడం, దీపాలు వెలిగించడం వంటి పలు ఉత్సాహవంతమైన టాస్క్‌లు చేయించి ఐక్యతను చాటి చెప్పారు.



– కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com

వందేళ్లకు ముందే క్వారంటైన్ ఆసుపత్రి

భౌతిక దూరం.. నిజాం కాలం నుంచే! | **ప్లేగు విస్తరించిన సమయంలో ప్రత్యేక చర్యలు**

నాటి క్వారంటైన్... నేటి ఫీవర్ ఆసుపత్రి

భౌతిక దూరం (సోషల్ డిస్టెన్స్) పాటించండి.. ఇళ్ల నుంచి బయటికి రాకండి అంటూ కొన్నాళ్లుగా ప్రభుత్వాలు ప్రతిరోజూ హెచ్చరిస్తూనే ఉన్నాయి. భౌతిక దూరం అనే ఈ పదం మాత్రం కరోనా వ్యాప్తి నేపథ్యంలోనే వచ్చింది కాదని.. నిజాం హయాంలోనే ఇది పుట్టిందని చరిత్రకారులు చెబుతున్నారు. హైదరాబాద్ రాజ్యంలో అంటువ్యాధులు ప్రబలిన సమయంలోనే భౌతిక దూరం పాటించడం మొదలైంది. ప్లేగు వ్యాధి నగరంలో విజృంభిస్తున్న తరుణంలో అప్పటి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రజలు సామాజిక దూరం పాటించేలా చాకచక్యంగా నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజల సాన్నిహిత్యం లేకుండా నగర రూపు రేఖల్ని మార్చే ప్రయత్నం చేశారు. తద్వారా ప్రజలు భౌతిక దూరం పాటించేలా చర్యలు తీసుకున్నారు. ఆ కాలంలో మురికి వాడలు, ఇళ్లు చాలా దగ్గరగా ఉండేవి. దీంతో వ్యాధి వ్యాప్తికి ఆస్కారం ఉందని తెలియడంతో హుటాహుటిన నగరానికి కొత్త రూపు ఇచ్చే మ్యాప్‌ను నిజాం సిద్ధం చేయించారు. కాలనీల విస్తరణ, ఇళ్ల మధ్య దూరం ఉండేలా నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులతో కలిసి కసరత్తు చేయించారు. మురికివాడలను తొలగించారు. జనసాంద్రత తగ్గేందుకు తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలను అప్పట్లో తీసుకున్నారు అని కాలిఫోర్నియాలో అర్బన్ మోర్ఫోలజీ ఇన్ హైదరాబాద్ అనే అంశంపై అధ్యయనం చేస్తున్న కెవిన్ హెనెస్ తెలిపారు. ఇదే విషయాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విశ్రాంత చరిత్ర అధ్యాపకులు ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ ధ్రువీకరించారు. ప్లేగు వ్యాధి ప్రబలిన సమయంలోనే వ్యక్తిగత శుభ్రత, భౌతికదూరం అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.

దేశంలో తొలి క్వారంటైన్ ఆసుపత్రి ఇక్కడే..

నగరంలోని వీధుల్ని శుభ్రపరిచే పారిశుద్ధ్య కార్మికుల కోసం నిజాం ప్రభువు ఖైరతాబాద్‌లో ప్రత్యేక కాలనీ నిర్మాణాన్ని చేపట్టారు. నగరాన్ని పునర్నిర్మించారు. ప్రస్తుతం సామాజిక కార్యకర్తలు చేస్తున్న పనుల్నే అప్పట్లో దక్కన్ హ్యూమానిటేరియన్ లీగ్ ద్వారా భాగ్యరెడ్డి వర్మ చేపట్టారు. ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవలతో పాటు చనిపోయిన వారి దగ్గరకు ఎవరూ రాకపోతే దహన సంస్కారాలు చేపట్టారు. క్వారంటైన్ అనే పదం కూడా ఆ కాలంలోనే ఎక్కువగా వినిపించేది. 1908లో మూసీ వరదలు వచ్చిన సమయంలో కాలుష్యం కారణంగా అనేక అంటురోగాలు ప్రబలాయి. కొత్త జ్వరాలు, గత్తర(కలరా) వ్యాపించి మరణాల సంఖ్యను రెట్టింపు చేశాయి. వీటి నివారణకు 1915లో నగరానికి దూరంగా ఉన్న ఈరన్న గుట్ట వద్ద ఒక చిన్నపాటి ఆసుపత్రిని నిర్మించారు. అంటువ్యాధులు ఒక రోగి నుంచి మరొకరికి సోకకుండా వారిని క్వారంటైన్‌లో ఉంచే పద్ధతిని ప్రారంభించారు. అప్పట్లో దీన్ని క్వారంటైన్ ఆసుపత్రి అని పిలిచేవారు. అలా దేశంలో మొదటి క్వారంటైన్ ఆసుపత్రి ఇక్కడే ప్రారంభమైంది. కాలక్రమేణా ఇది ప్రస్తుత కోరంటి ఆసుపత్రిగా ప్రఖ్యాతి పొందింది. 1923 తర్వాత ప్రస్తుతమున్న ప్రాంతానికి ఆసుపత్రిని మార్చారు. ఇదే నేటి ఫీవర్ హాస్పిటల్.

– శ్రీహరి, m : 9030 6262 88

ఉద్యమ స్ఫూర్తితో కరోనాపై యుద్ధం

- తెలంగాణనే తెచ్చుకున్నోళ్లం.. ప్రతి తెలంగాణ బిడ్డ జాతి ఐక్యత, పటుత్వం, జాతి పౌరుషం చూపే తరుణం ఇది. దేశానికి ఆదర్శంగా నిలిచే సమయమిదే. భవిష్యత్తులో ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా తెలంగాణ వాళ్లు ఎదుర్కొంటారని నిరూపించాలి. అరవై ఏండ్లు ఆలస్య మైనా కోల్పోయిన రాష్ట్రాన్ని పట్టుబట్టి తిరిగి తెచ్చుకొన్న గొప్ప జాతి మనది. మొండి పట్టుదల ఉన్నవాళ్లం. ఇప్పుడు అదే ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ చూపెట్టాలి. ఈ కరోనా.. దేశంలో ఎవరిని ఏంచేసినా.. ఈ తెలంగాణవాళ్లను మాత్రం ఏమీ చేయలేకపోయిందన్న పేరు తెచ్చుకోవాలి.
- జనతా కర్ఫ్యూను విజయవంతం చేయాలని కోరుతూ చప్పట్లు కొట్టాలంటే మోదీని తిడతారా? మొద్దులు ఎత్తుకోమనలేదు. బరువులు మోయమనలేదు కదా. రెండు చేతులతో నాలుగు నిమిషాలు చప్పట్లు కొడితే తప్పేంది. ఊరంతా చప్పట్లు మారుమోగుతయి. దీనికి కొంత మంది పనిలేకుండా వక్రబుద్ధితో ప్రధానిని కూడా అవహేళన చేసే విధంగా పోస్టులు పెడుతున్నారు. డీజీపీకి చెప్పుతున్నా. ఇటు వంటి వారిని అరెస్ట్ చేయాలి. కేసులు నమోదు చేయాలి. వాళ్లకు బుద్ధి వచ్చే విధంగా చేయాలె. సంఘీభావం తెలిపే పనిచేయా లంటే కూడా హేళన చేస్తే, పద్ధతి కాదు. ప్రధాని అంటే గౌరవించాలి. ప్రతిదాన్ని వ్యంగ్యంచేయడం మంచిది కాదు.
- మనం పిలిస్తేనే కరోనా వస్తది ఈ కరోనాపై ఒక జోక్ తిరుగుతున్నది. కరోనా స్వాభిమానం ఉన్న జబ్బు. అంటే అభిమానం ఉన్న జబ్బు. అది ఉన్న కాడ్నే ఉంటది. దాన్ని మనం ఆహ్వానిస్తే తప్పమన దగ్గరికి రాదు. మనం రమ్మంటే తప్ప రాదు. దాన్ని మనం ఆహ్వానించవద్దు. అలాంటి జబ్బును కొనుక్కోవద్దు. ప్రభుత్వం ఎంత చెప్పినా.. ప్రజల సహకారం ఎక్కువ అవసరం. ఇలాంటి ఆపత్కాలంలో ఎవరి నియంత్రణ వాళ్లు పాటించి, సంయమనం పాటిస్తే మంచిది.

– సీఎం కేసీఆర్

కరోనా కట్టడి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన జనతా కర్ఫ్యూను తెలంగాణలో 24 గంటలపాటు పాటించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వీయ నియంత్రణలో తెలంగాణ.. దేశానికి ఆదర్శంగా నిలువాలన్నారు. విదేశాల నుంచి తెలంగాణ వచ్చినవారి కారణంగానే కరోనా వ్యాప్తి చెందుతున్నందున విదేశాలనుంచి వచ్చినవారు అధికారులకు స్వచ్ఛందంగా సమాచారమివ్వాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసరసేవలు మినహా మిగిలిన సేవలన్నీ పూర్తిగా బంద్ అవుతాయని తెలిపారు. జనతా కర్ఫ్యూ నేపథ్యంలో.. రాష్ట్రంలో చేస్తున్న ఏర్పాట్లు, కరోనా నియంత్రణకు ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం మధ్యాహ్నం ప్రగతిభవన్లో మీడియాతో మాట్లాడారు. సీఎం పేర్కొన్న అంశాలు ఆయన మాటల్లోనే...

> **తన ప్రజలకు రాబోయే కష్టాలను దార్శనికతతో ముందుగాల కనిపెట్టి.. చిత్తశుద్ధితో కార్యాచరణ మొదలు పెట్టి.. వారిని కష్ట నష్టాల నుంచి కాపాడే నాయకుడే ప్రజల గుండెల్లో దేవుడై కొలువుంటడు.. ఇది చరిత్ర నిరూపించిన సత్యం. కరోనా కష్ట కాలంలో... సీఎం కెసిఆర్ ప్రజల హృదయాల్లో దయార్ద్ర హృదయుడుగా నిలిచిన చరిత్ర మల్లోపాలి పునరావృత మైంది. జై తెలంగాణ.. జయహో కెసిఆర్.**

తెలంగాణ సాధన స్ఫూర్తి మళ్లీ చాటుదాం

ప్రతి తెలంగాణ బిడ్డకు చేతులెత్తి దండం పెట్టి అభ్యర్థిస్తున్న. ప్రతి తెలంగాణ బిడ్డ ఆదివారం ఒక్కరోజు కర్ఫ్యూను తప్ప కుండా పాటించాలె. జాతి ఐక్యత, పటుత్వం, జాతి పౌరుషం చూపే తరుణం ఇది. దేశానికి ఆదర్శంగా నిలిచేలా భవిష్యత్‌లో ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా తెలంగాణ వాళ్లు ఎదుర్కొంటారని నిరూపించాలి. మన తెలంగాణ జాతి చాలా గొప్పజాతి. అరవై ఏండ్లు ఆలస్యమైనా కోల్పోయిన రాష్ట్రాన్ని పట్టుబట్టి తిరిగి తెచ్చుకొన్న గొప్పజాతి మనది. అంతటి ఘనమైన చరిత్ర మనకు ఉన్నది. మొండి పట్టుదల ఉన్నవాళ్లం.

ఇప్పుడు అదే ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ చూపెట్టాలి. ఈ కరోనా.. దేశంలో ఎవరిని ఏంచేసినా.. ఈ తెలంగాణ వాళ్లను మాత్రం ఏమీ చేయలేక పోయిందన్న పేరు తెచ్చుకోవాలి.

అత్యవసర సేవలు తప్ప అన్నీ బంద్

ఆర్టీసీ బస్సులు వందశాతం బంద్ పెడుతున్నం. ఒక్క ఆర్టీసీ బస్సు కూడా తిరుగదు. అత్యవసర సేవల కోసం ముందుజాగ్రత్త చర్యగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ప్రతి డిపోకు ఐదు బస్సుల చొప్పున సిబ్బందితో సహా సిద్ధంగా పెడుతున్నాం. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు మాత్రమే సిద్ధంగా ఉంచుతున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులను సరిహద్దుల్లోనే ఆపాలని సీఎస్‌కు, రవాణాశాఖ, పోలీస్ శాఖలకు చెప్పాం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలోకి రానివ్వబోమని ముందే చెప్తున్నాం. ఇది కఠిన సమయం. క్లిష్ట పరిస్థితి. సంకట సమయంలో కఠినంగా ఉండకతప్పదు. స్వీయ నియంత్రణ పాటించాలి. మేం పాటించం అని ఎవరైనా అంటే వాళ్లను రానివ్వం. మెట్రో రైళ్లు దేశవ్యాప్తంగా బంద్ చేస్తున్నరు. హైదరాబాద్‌లో పూర్తిగా బంద్ ఉంటయి. అత్యవసర పరిస్థితి కోసం ఐదు రైళ్లను అందుబాటులో ఉంచుతున్నం.

ఎవరికి వారు బంద్ చేసుకోవాలి

వ్యాపార వాణిజ్య సంఘాలు స్వయంనియంత్రణ పాటించాలి. ఎవరికి వారు బంద్ చేసుకోవాలి. మేం జబర్దస్త్ గా ఎవరినీ బంద్ చేయించడంలేదు. విజ్ఞప్తి చేస్తున్నాం. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ బంద్‌లు పాటించాం. ఒక్కరోజుతో మునిగి పోయేదేమీలేదు. నిత్యావసర సరుకుల కొరత రాకుండా చర్యలు తీసు కొంటున్నాం చిన్నచిన్న వ్యాపారస్థులు దెబ్బ తినొద్దని, పాలు, మాంసం, చేపలు, కూర గాయలు విక్రయించే దుకాణాలను నిషేధించడం లేదు. పాలు, చిన్నారులకు సంబం ధించిన ఇతర దుకాణాలు, వైద్యసేవలు, అంబులెన్సు, ఎలక్ట్రిసిటీ, అగ్నిమాపక సిబ్బంది, తాగునీటి వ్యవస్థకు సంబంధించిన సిబ్బంది, సివరేజ్ సిబ్బంది సహా ఎమర్జెన్సీ సర్వీసుల సిబ్బంది తప్ప మిగతా అందరూ 24 గంటలపాటు ఎవరికి వారు బంద్ పాటించాలి. మీడియా మిత్రులు కూడా తిరగవచ్చు. మీడియాను ఎవరూ నిరోధించరు. అత్యవసరంగా భావించి వీటిని మినహాయిస్తున్నాం. మీడియా నియంత్రణ పాటించాలి. మీటరు దూరంలో ఉండి మాట్లాడుకునే ప్రయత్నం చేయాలి. సెల్ఫ్ ప్రొటెక్షన్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. బయటకు వెళ్లకుంటేనే ఉత్తమం. వెళ్తే మాత్రం మీటరు దూరంలో ఉండి మాట్లాడాలి. ప్రగతిభవన్లో ఎన్నో విలేకరుల సమావేశాలు నిర్వహించుకున్నాం. కానీ ఈ రోజు (శనివారం) విలేకరులను కూడా మూడు మూడు ఫీట్ల దూరంలో కూర్చోవాలని చెప్పినం. కారణం ఏందంటే.. మన చేతుల్లో ఉన్నంత వరకు జాగ్రత్తలు పాటిద్దాం... ఆ తర్వాత భగవంతుడి దయ. చేయగల్గింది. చేయవల్సింది... తప్పక చేయాలి. దయచేసి మీరు స్వీయ నియంత్రణ పాటించాలి.

పనిమనుషుల కోసం చూడొద్దు

ఆదివారం పనిమనిషులు రావాలే.. మాకు సేవకులు రావాలే అని చూడవద్దు. ఈ ఒక్క రోజు ధనవంతులు , కల్గినవాళ్లు పనివాళ్లను పిలవకండి. మీ పనులు మీరు చేసుకోండి.. ఇవన్నీ పాటిస్తే కరోనా ప్రభావం మనకు రాదు. ప్రతి ఒక్కరు సహకరించాలి.

వృద్ధులు బయటికి రావొద్దు

60 ఏండ్లకు పైబడినవారు, పదేండ్లలోపు పిల్లలు రెండు, మూడు వారాలు బయటకు రావద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. ఇప్పటివరకు గమనిస్తే 60 ఏండ్లవారు ఎక్కువగా చనిపోతు న్నారు. శుక్రవారం ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్‌లో కోరాం. మన దగ్గర సీసీఎంబీ ఉన్నదని సూచించాం. దురదృష్టం కొద్దీ మన దగ్గర కూడా పరిస్థితి తీవ్రమైతే రోజుకు వెయ్యి మందిని పరీక్షించే సామర్థ్యం ఉన్నది. దాన్ని కూడా వాడుకొనేందుకు అవకాశం ఇవ్వాలని అడిగాం. ప్రధాని కూడా ఆదేశాలిచ్చారు. అవసరమైతే మనం దాన్ని కూడా వాడుకుంటాం. మన దగ్గర ఉన్న వసతులు, వనరులను ఎలా వాడుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే ప్రయత్నం చేస్తుంది. అందరం కలిస్తే తప్పక కరోనాను నివారించవచ్చు.

స్వాభిమానం ఉన్న కరోనా!

ఈ కరోనాపై ఒక జోక్ తిరుగుతున్నది. కరోనా స్వాభిమానం ఉన్న జబ్బు. అంటే అభిమానం ఉన్న జబ్బు. అది ఉన్న కాడ్నే ఉంటది. దాన్ని మనం ఆహ్వానిస్తే తప్ప మన దగ్గరకి రాదు. మనం రమ్మంటే తప్ప రాదు. దాన్ని మనం ఆహ్వానించవద్దు. అలాంటి జబ్బును కొనుక్కో వద్దు. ప్రభుత్వం ఎంత చెప్పినా.. ప్రజల సహ కారం ఎక్కువ అవసరం. ఇలాంటి ఆపత్కాలంలో ఎవరి నియంత్రణ వాళ్లు పాటించి, సంయమనం పాటిస్తే మంచిది.

– నమస్తే తెలంగాణ
తెలుగు దినపత్రిక సౌజన్యంతో

చేతులెత్తి దండంపెట్టి విజ్ఞప్తి చేస్తున్నా, విదేశాల నుంచి వచ్చిన వాళ్లంతా మా బిడ్డలే.. కానీ, మీరు అనవసరంగా బయట తిరిగి మీ కుటుంబాన్ని, సమాజాన్ని చెడగొట్టవద్దు. అది సమాజానికి మంచిదికాదు. విదేశాల నుంచి వచ్చినవాళ్లకు నేను మళ్లీ దండంపెట్టి... నమస్కరించి చెప్తున్నా.. మీరు సమాజహితం కోరి ప్రభుత్వం చెప్పినట్టు వినాలి.. మీకు మీరే స్వచ్ఛందంగా సమాచారం ఇవ్వండి. అంతేకానీ మీరు పారిపోతుంటే పట్టుకురావడం సరికాదు. **– సీఎం కేసీఆర్**

1897 చట్ట ప్రకారం లాక్ డౌన్

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధిం చేందుకు ఈ నెల 31దాకా రాష్ట్రంలో లాక్ డౌన్ పాటిస్తున్నట్టు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. తెలంగాణకు విదేశాల నుంచి వచ్చేవారి రాక ఆదివారంతో నిలిచిపోయిందని... ఇక వైరస్ వ్యాప్తిని నిరోధించినట్టయితే కరోనాపై విజయాన్ని సాధించినట్టేనని అన్నారు. ఆదివారం జనతా కర్ఫ్యూను తెలంగాణ సమాజం కనీవినీ ఎరుగని రీతిలో చారిత్రాత్మకంగా విజ యవంతం చేసిందంటూ.. ఇందుకు ప్రతి ఒక్కరికీ ధన్య వాదాలు తెలియజేశారు. కరో నాపై పోరా డుతున్న వైద్యసిబ్బంది, ఇతర సిబ్బందికి... చప్పట్లతో సంఘీభావ సంకేతాన్ని అద్భు తంగా ప్రదర్శించారని కొనియాడారు. ఆది వారం సాయంత్రం ప్రగతిభవన్లో ముఖ్య మంత్రి కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ ఆదివారం నాటి స్ఫూర్తిని ఈ నెల 31దాకా ప్రదర్శించాలని రాష్ట్ర ప్రజలను కోరారు.

> **ఎవరో వచ్చి సాయం చేసే సమయం కాదిది. మన కోసం మనం.. జనం కోసం జనం.. అందరి కోసం అందరం.. పరితపించి పట్టుదలతో పని చేసుకోవాల్సిన పరిస్థితి ఇది. ఆదివారం చూపిన క్రమశిక్షణ ఈ నెల 31 దాకా చూపించాలి.**
>
> **– ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు**

అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు

'ప్రపంచాన్ని భయకంపితంచేస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి సంబంధించి ప్రధాని మోదీతో పాటు నేనుకూడా ఒక (జనతా కర్ఫ్యూ) పిలుపునిచ్చాం. కనీవినీ ఎరుగనిరీతిలో, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలు ఇండ్లకే పరిమితమై అద్భుతాన్ని ఆవిష్కరించారు. నేను ఏదైతే కోరానో దాన్ని గౌరవించి రెండు పనులుచేశారు. ఒకటి.. వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ఇండ్లకే పరిమితమై ప్రపంచంలోని మానవాళికి తెలంగాణ మంచి కంట్రిబ్యూషన్ ఇచ్చింది. రెండోది.. సంఘీభావ సంకేతం. కొందరికి పిచ్చిపిచ్చి ఆలోచన ఉండొచ్చు గానీ.. ఇది మంచిదని నేను ముందుగానే విజ్ఞప్తి చేశా. సాయంత్రం ఐదు గంటలకు చప్పట్లు చరిచి సంఘీభావ సంకేతం ప్రదర్శించాలని కోరాను. తెలంగాణ సమాజం అద్భుతంగా ఆ సంకేతాన్ని ప్రకటించింది. 'మేమంతా ఒకటి.. దేన్నైనా ఎదుర్కో గలం' అనే ఒక సంఘీభావ సంకేత ప్రదర్శన అద్భుతంగా జరిగింది. ఇంతమంచి ప్రదర్శన, ఐక్యత, విజ్ఞతను చాటిచెప్పిన ప్రతి తెలంగాణ బిడ్డకు పేరు పేరునా నా తరపున, ప్రభుత్వం తరపున శిరస్సు వంచి నమస్కరిస్తున్నా, ధన్య వాదాలు తెలుపున్నా.

1897 చట్టం ప్రకారం లాక్ డౌన్

వ్యాధులు ప్రబలినప్పుడు అత్యవసర సమయాల్లో అమలుచేసే 1897 ఎపిడ మిక్స్ డిసీజ్ యాక్ట్ (అంటువ్యాధుల నియంత్రణ చట్టం) కింద ఈ లాక్‌డౌన్‌ను నోటిఫై చేసినం. ఈ చట్టానికి విశేషాధి కారాలు ఉంటయి. దాని కిందనే ఉత్తర్వులు జారీచేసినం. ఆ ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ మొత్తం మార్చి 31 వరకు లాక్ డౌన్లో ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో ఇండ్లుదాటి బయటకు రావొద్దు. ఐదుగురికి మించి ఎట్టి పరిస్తితుల్లో బయట కూడవద్దు. బయటికొచ్చినా కూడా ఇద్దరి మధ్య మూడుఫీట్ల దూరం ఉండాలి. ఇంటి అవసరాల కోసం కావాల్సిన మందులు, పాలు, కూరగాయలు, నిత్యావసరాల వంటి అత్యవసర వస్తువుల సేకరణ కోసం కుటుంబానికి ఒక్క వ్యక్తిని మాత్రమే అనుమతిస్తరు. అది కచ్చితంగా తూ.చ. తప్పకుండా పాటించాలి. వీలైనంతవరకు బయటకు వెళ్లినపుడు 2-3 రోజులకు, సరిపడా వస్తువులు, సరుకులు తెచ్చుకోవాలి. మనల్ని

మనం కాపాడుకోవాలనే సోయి! ఉండాలే తప్ప ఇంకెవరో చెప్తరు, ఇదో బలవంతం అని అనుకోవద్దు. ఏ వ్యక్తికి ఆ వ్యక్తి... ఏ కుటుంబానికి ఆ కుటుంబం. ఆదివారం చూపించిన స్ఫూర్తిని ప్రదర్శించాలి. పౌరులందరికీ పదే పదే విజ్ఞప్తి చేస్తున్నాం. మీరు ఇండ్లకే పరిమితమవ్వాలి. లేని ఇబ్బందులు కొనితెచ్చుకోకండి. సమాజానికి ఇబ్బందులు తీసుకురాకండి. ఎమర్జెన్సీ సర్వీసులకు మినహాయింపు ఉంటుంది. వాటర్, విద్యుత్ సరఫరా, ఫైర్ సర్వీస్, గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులు వంటి సర్వీసులు పనిచేస్తాయి.

12 కిలోల బియ్యం... రూ.1500

రాష్ట్రంలో రెక్కాడితే డొక్కాడని నిరుపేదలు చాలా మంది ఉన్నారు. 31వ తేదీదాక లాక్‌డౌన్‌లో వాళ్లు ఉపాధి కోల్పోయే అవకాశం ఉన్నది. వాళ్లందరికీ నెల రోజులకు సరిపడే రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తాం.. ఇతర సరుకుల కోసం ఒక్కో తెల్ల రేషన్‌కార్డుదారులకు రూ.1500 నగదు అందిస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు తెలిపారు. తెలంగాణ సంక్షేమంలో నంబర్‌వన్‌గా ఉన్నదని, రూ.40 వేల కోట్లతో సంక్షేమాన్ని అమలుచేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. 'నిరుపేదలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆకలికి గురికాకూడదని ఆలోచిస్తున్నం. వారం రోజుల లాక్‌డౌన్ అయినా.. దానిప్రభావం పది రోజులపాటు ఉంటుంది. అందుకే ఒక్క వారానికి సరిపడ సరుకులు అని కాకుండా నెల రోజులకు సరిపడే రేషన్ బియ్యం పంపిణీ చేస్తం. మన రాష్ట్రంలో బియ్యం నిల్వలు మరే రాష్ట్రంలో లేనివిధంగా ఉన్నాయి. 1.08 కోట్ల కుటుంబాలు ఉండగా.. అందులో 87.59 లక్షల మందికి తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. వాళ్లందరికీ ఉచితంగా 12 కిలోల బియ్యం ఇస్తాం' అని సీఎం పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నిబంధనల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇప్పుడున్న డీలర్ల వ్యవస్థ ద్వారానే అందిస్తామని తెలిపారు. సాధారణంగా తెల్లరేషన్ కార్డుదారులందరికీ ప్రతినెలా 1.50 లక్షల టన్నులు ఇస్తున్నాం. . ఇప్పుడు డబుల్ ఇస్తున్నందున 3.86 లక్షలటన్నుల పైచిలుకు బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తాం.. దాని విలువ దాదాపు రూ.1103 కోట్లు అని చెప్పారు. 'పేదలకు నెలదాకా సరిపడే బియ్యం పంపిణీతో పాటు పప్పు, ఉప్పులాంటి సరుకులు కూడా కొనుకోవాల్సి ఉంటుంది. అందుకే వాటికోసం బియ్యంతో పాటు ప్రతి రేషన్ కార్డుదారుడికి రూ.1500 నగదు కూడా ఇస్తాం. దీనితో ఎవరు ఏదికావాలి అంటే అది కొనుక్కుంటరు. ఇందుకోసం రూ.1,314 కోట్లు ఖర్చవుతుంది. అంటే బియ్యం, నగదుకు కలిపి మొత్తం రూ. 2,417 కోట్లు ఖర్చవుతున్నందున వెంటనే ప్రభుత్వం విడుదల చేస్తుంది' అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. 'వాస్తవానికి కొందరు అధికారులు, నాయకులు రూ.1000 ఇవ్వమన్నారు. నేను దానిని రూ.500 పెంచి రూ.1500 ఇవ్వాలని చెప్పిన. ఔటాఫ్ బడ్జెట్ నుంచి ఇస్తున్నాం. ప్రతిరాష్ట్రంతో, కేంద్రంతో సమన్వయంతో – పనిచేస్తున్నాం. సంకుచితంగా ఆలోచించే సమయం కాదిది. రాజకీయాలు, చిల్లర ఆలోచనలు చేయరు' అని పేర్కొన్నారు. కూరగాయలు, పాలు, కిరాణ షాపులు తెరిచి ఉంచాయని, వాటు ఇంటికి ఒక్క వ్యక్తి మాత్రమేపోయి వాటిని కొనుక్కోవచ్చని సీఎం సూచించారు. ఇది కర్ఫ్యూ లాంటిది కాదుకానీ.. ఒక్కదగ్గర ఐదుగురి కంటే ఎక్కువ మందిని అనుమతించబోమని తెలిపారు. వాళ్లు కూడా మూడు ఫీట్ల దూరం పాటించాలని చెప్పారు.

ఎవరో వచ్చి సాయం చేసే సమయం కాదిది. మన కోసం మనం.. జనం కోసం జనం.. అందరి కోసం అందరం.. పరితపించి పట్టుదలతో పని చేసుకోవాల్సిన పరిస్థితి ఇది. ఆదివారం చూపిన క్రమశిక్షణ ఈ నెల 31 దాకా చూపించాలి.

– ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు

ఇబ్బందులేకుండా ధాన్యం కొనుగోళ్లు

యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. ఐకేపీ సెంటర్లు, పీఏసీఎస్‌లు, మార్కెట్ కమిటీల ద్వారా గ్రామస్థాయిలోనే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు సూచించారు. సోమవారం అత్యవసర సమీక్ష నిర్వహించి ధాన్యం కొనుగోళ్ల కోసం విధి విధానాలు రూపొందించాలని పేర్కొన్నారు. లక్ష టన్నుల వరకు ధాన్యం కొనుగోలుకు ఎఫెసీఐ సిద్ధంగా ఉన్నదని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రధానమైన విషయాన్ని ప్రజలకు మనవి చేస్తున్న. ఈ జబ్బు పెద్ద మహమ్మారి. యావత్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్నది. ఒక ఊరికో, పల్లెకో, వ్యక్తికో పరిమితం కాలేదు. పరిమిత సమస్య కాదు. ఇది ప్రత్యేక సందర్భం. ప్రత్యేక పరిస్థితి. కాబట్టి అందరం అప్రమత్తంగా ఉండాలి. కరోనాపై కొందరు కవులు మంచి కవిత్వాలు రాశారు. ఐనం పూడి శ్రీలక్ష్మి అనే కవయిత్రి అద్భుతమైన కవిత రాశారు. ఇప్పుడు క్వారంటైనే మన వాలంటైన్ అన్నారు. గొప్ప భావం ఇది. రాష్ట్రంలో ఉన్న కవులందరినీ కోరుతున్న. మంచి కవితలు రాయాలి. టీవీవాళ్లను కోరుతున్న.. కరోనా మీద ప్రజలను చైతన్యపర్చే విధంగా కవి సమ్మేళనాలు నిర్వహించాలి.

– నమస్తే తెలంగాణ
తెలుగు దినపత్రిక సౌజన్యంతో

రాబోయే సంఘటనలకు సన్నద్ధం

ప్రకృతి విపత్తుల అధ్యయనవేత్త మైఖేల్ బెర్క్ ప్రత్యేక ఇంటర్వ్యూ

మైఖేల్ బెర్క్ ప్రకృతి విపత్తుల అధ్యయనవేత్త. అలాంటి విపత్తులను నగరాలు ఎలా ఎదుర్కొంటాయనే అంశంలో బోధకుడు. 100 రెసిలియెంట్ సిటీస్ అనే లాభాపేక్షరహిత కన్సల్టెన్సీకి మాజీ డైరెక్టర్. ప్రస్తుతం ఆయన రెసిలియెంట్ సిటీస్ కేటలిస్ట్ వ్యవస్థాపక ప్రిన్సిపల్‌గా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన పదుల సంఖ్యలో స్థానిక సంస్థలతో కలిసి పని చేశారు. హరికేన్స్, తుపాన్లు, కరువు, భూకంపాలు, ఉగ్రవాదుల దాడులు, మాస్ కాల్పులు, వ్యాధుల వ్యాప్తి, సామాజిక దిగ్భ్రాంతికర సంఘటనలు తదితరాలపై తగు సూచనలు, సలహాలు అందించారు. ఆయన ప్రస్తుతం న్యూయార్క్ నగరంలో నివసిస్తున్నారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొన్న తరువాత వివిధ సమూహాలు తమ జీవితాలను ఎలా కొనసాగించనున్నాయి అనే అంశంపై ఆయన అధ్యయనం చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక కల్లోలం నేపథ్యంలో వేగంగా కోలుకోవడాన్ని ఎలా పటిష్ఠం చేయాలనే అంశాన్ని పరిశీలిస్తు న్నారు.

సెప్టెంబర్ 11 ఉగ్రదాడుల అనంతరం న్యూయార్క్ నగరం ఆఫీస్ ఆఫ్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్‌లో ఆయన డిప్యూటీ కమిషనర్‌గా సేవలందించారు. ప్రఖ్యాత బ్యాంక్‌లో గ్లోబల్ రిస్క్ మేనేజ్‌మెంట్ చేపట్టారు. సిటీ ల్యాబ్‌కు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూ లోని కొన్ని ముఖ్యాంశాలు:

× × ×

ఒక నగరాన్ని వివిధ రంగాలలో పటిష్టం చేసేందుకు అవసరమైన కీలక అంశాలేమిటి?

లక్ష్యాల అనుసంధానమే కీలకం. వివిధ రంగాల్లో ఒక నగరాన్ని పటిష్ఠం చేసేందుకు ఒక నిర్దిష్ట ఇంటర్వెన్షన్ విజయం సాధిస్తుంది. వివిధ లక్ష్యాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేయడం గురించి ఆలోచించడమే ముఖ్యం.

రెసిలియెన్స్ ఇన్ సిటీస్ భావన గురించి కాస్త వివరిస్తారా?



ఒక విపత్తు సమయంలో కోలుకునేందుకు, పురోగమించేందుకు ఒక నగరానికి గల శక్తిసామర్థ్యాలే అర్బన్ రెసిలియెన్స్. చలనశీలతను ప్రమోట్ చేసే, సుస్థిరదాయక రవాణాకు వీలు కల్పించే చక్కటి మౌలిక వసతులు కూడా అందులో భాగమే. నగరంలో ఒకదానిపై ఒకటి ఆధారపడే సమూహాలన్నీ ఇందులో భాగమే. పటిష్ఠమైన మధ్య తరగతి ఉద్యోగాల పునాదితో కూడిన వైవిధ్యభరిత ఆర్థిక వ్యవస్థ. నిర్ణయాలు తీసుకునే చోట వివిధ రంగాల వారికి ప్రాతి నిధ్యం ఉండే ఒక చక్కటి పాలన. తదుపరి సంక్షోభం ఏదైనప్పటికీ దాన్ని అధిగమించడంలో ఈ అంశాలన్నీ కూడా తోడ్పడుతాయి.

రెసిలియెన్స్.. అంటే ఓ నగరంలో వేగంగా కోలుకునేందుకు, పురోగమించేందుకు దానికి గల శక్తిసామర్థ్యాలను నిర్మించడంలో కీలకం వివిధ ఆశయాలను ఒక్కచోటుకి తీసుకురావడమే. ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నప్పుడు, వరదల నుంచి మెరుగైన రక్షణ ఎలా కల్పించగలమో కూడా ఆలోచించాలి. రవాణా గురించి మాట్లాడు కుంటున్నప్పుడు జీవవైవిధ్యం అధికం చేయడం గురించి లేదా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలను తగ్గించడం గురించి కూడా ఆలోచించాలి. సుపరిపాలన, స్థానికులకు ప్రమేయం కల్పించడం గురించి ఆలోచిస్తున్నప్పుడు సంక్షోభ సమయాల్లో ప్రజలు నాయకుల మాటవిని వారి సలహాలు,

సూచనలను పాటించేలా చేసేందుకు గాను ఎన్నికైన ప్రజా ప్రతినిధులలో విశ్వాసాన్ని పెంపొందించడం ఎలానో కూడా చర్చించాలి.

కరోనా వైరస్ స్పందనలో మీరు ఇప్పటి వరకూ చూసిన సుపరిపాలన అంశాలకు ఉదాహరణలు?

ఇలాంటి వివత్కర సమయాల్లో మేయర్ల కంటే కూడా గవర్నర్లు మరింతగా ప్రభావం కనబరచగలుగుతారు. వివిధ పాలనా పర మైన హద్దులకు సంబంధించి వారు మరింత అధికారాలను కలిగి ఉంటారు. న్యూయార్క్ రాష్ట్రం విషయానికి వస్తే, మొదటగా కేసులు నమోదైంది న్యూ రాచెల్ నగరం ఉత్తరభాగంలోని వెస్ట్‌చెస్టర్ కౌంటీలో. ఇప్పుడు న్యూయార్క్ సిటీలో అత్యధిక కేసులు నమోదయ్యాయి. గవర్నర్ మరిన్ని అధి కారాలు కలిగిఉన్నప్పటికీ, మేయర్ ముఖ్యమైన అధికార ప్రతినిధిగా ఉంటారు. టెస్టింగ్‌తో పాటుగా నగరంతో సహా డ్రైవ్-త్రూ టెస్టింగ్ సైట్స్‌ను ఏర్పాటు చేయడంలో వేగంగా స్పందించింది. ప్రభుత్వ యంత్రాంగం ఈ స్థాయిలో స్పందించడాన్ని నేనింతకు ముందెన్నడూ చూడలేదు. ఇదో చక్కటి ఉదాహరణ.

ఓల్డ్ ఈస్ట్ కోస్ట్ నగరాలు గతంలో మశూచి, క్షయ, కలరా, ప్లేగు వంటి మహమ్మారిలను చూశాయి. కాబట్టి ఈ దఫా మేయర్లు వివిధ కార్యక్రమాలు చేపట్టడంలో డ్రైవర్ సీటులో ఉంటారను కున్నాను. అయితే ఆయా కార్యక్రమాలకు గవర్నర్లు సారథ్యం వహించారు.

అమెరికా ఇప్పటి వరకూ ప్రదర్శించిన రెసిలియెన్స్‌కు మీరు ఇచ్చే రేటింగ్?

ఇలాంటి మహమ్మారులు ఎంతగా యాంటీ అర్బన్ (పట్టణ వ్యతిరేక) స్వభావంతో ఉంటాయో న్యూయార్క్ టైమ్స్‌లో మైఖేల్ కిమ్మెల్‌మాన్ చక్కగా వివరించారు. జనసాంద్రత, అనుసంధానత అనేవి మనం అత్యంతగా ప్రాధాన్యం ఇచ్చే పట్టణ విలువలు. ఇలాంటి మహమ్మారులు వ్యాపించినప్పుడు మనం అతి తక్కువగా కోరుకోవాల్సింది కూడా వాటినే. మనకు అవసరమైన అంశాలు నిర్దిష్టంగా కొన్ని ఉన్నాయి. ప్రజారోగ్య వ్యవస్థ మనుగడ సాగించడం, టెస్టింగ్ సామర్థ్యం. వాక్సిన్లు లేదా యాంటీ – వైరల్ చికిత్సలు... అవి ఏవైనా సరే వినూత్నంగా ఉండాలి, అలాంటి థెరపీలను అధికంగా చేసుకోగలగాలి. అలాంటి శక్తిసామర్థ్యాలు కావాలి. వెంటిలేటర్లు, మాస్క్‌లు లేదా మరిన్ని బెడ్స్... అవేవైనా సరే... ఆసుపత్రుల సామర్థ్యాలు అధికం కావాలి. రక్షణాత్మక చర్యలపై ఇచ్చే సూచనలను పాటించడంలో ప్రజల శక్తిసామర్థ్యాలు అధికం కావాలి. ఏదో విధంగా రాబోయే నెలల్లో మనం ఈ వైరస్ వ్యాప్తిని అడ్డుకో గలుగుతాం. ఆ తరువాత మనం మన రోజువారీ వ్యవహారాలను చూసుకోవాల్సి ఉంటుంది. కరోనా మహమ్మారి కారణంగా మన వ్యాపారాలు లాంటివి బాగా దెబ్బతిని ఉంటాయి లేదా మూతపడి ఉంటాయి. పట్టణ పేదలు, దిగువ తరగతి వారు ఎన్నో బాధలకు గురై ఉంటారు. పూర్తిస్థాయి ఉపాధి లేని మధ్యతరగతి వారెంతో మంది మళ్లీ పనుల కోసం వెతుక్కుంటూ ఉంటారు. ఇన్నాళ్ల పాటు ఒంటరిగా గడిపిన వారంతా తిరిగి తమ సమూహాలను కలుసుకునే ప్రయత్నాలు చేస్తుంటారు. ఇవన్నీ కూడా మన సమాజంపై ఒత్తిళ్లను గణనీయంగా పెంచేవే. “ఈ మహమ్మారి కారణంగా మనం సరికొత్త మౌలిక వసతులను పొందనున్నాం. గత తరం కంటే మెరుగ్గా వాటిని మనం రూ పొందించుకోవాల్సి ఉంటుంది”. మరో మహమ్మారి మనపై విరుచుకుపడేనాటికి మనం ఈ అర్బన్ రెసెలియెన్స్ ప్రయోజనాలను చూసే దశలో ఉంటాం. పటిష్ఠమైన ఇరుగుపొరుగు వ్యవస్థలు, వైవిధ్యభరిత ఆర్థిక వ్యవస్థలు, సుపరి పాలన ఉంటాయి. ఈ విధమైన పరిస్థితుల నుంచి సత్వరమే కోలుకునేందుకు ఆ తరహా వ్యవస్థలు దోహదం చేస్తాయి. అలాంటి పటిష్ఠ కమ్యూనిటీలను నిర్మించు కోగలగాలని మనం కోరుకుందాం.

ఇప్పటికింకా మనం ఆరంభం లోనే ఉన్నాం. ఓ వారం పాటు ఇంట్లోనే ఉండడం అనేది ఎప్పటికీ ఇంట్లోనే ఉండిపోవడంగా అనిపి స్తోంది. ఇప్పటి వరకు మనం అనుభ వించింది ఎంతో కొంచెమే. అనుభ వించాల్సింది మరింకెంతో ఉంది. ఏయే కమ్యూనిటీలు ఎంతగా కోలుకునే శక్తిని, పురోగ మించే శక్తిని కలిగి ఉన్నాయో రానున్న నెలల్లో బయటపడనుంది.

రెండో దశకు సంబంధించి వివిధ కమ్యూనిటీలు ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

ఇప్పుడే దాని గురించి మనం మాట్లాడు కోలేం. చట్టసభలు

సమావేశమై ప్రజలకు, సంస్థలకు, వ్యాపార సంస్థలకు ఏవైనా సహాయాలు ప్రకటిస్తుంటే, అప్పుడు మనం మనకు గల రెసిలియెన్స్ నిర్మాణ అవకాశాల గురించి చర్చించగలుగుతాం.

ఎలాంటి అవకాశాలు ఉంటాయని మీరు భావిస్తున్నారు?

అమెరికాలో బహుశా ఉపాధి ఉద్దీపనలు ఉండవచ్చు. మనం నిర్మించబోయే కొత్త మౌలిక వసతులతో ఆ ఉపాధి అవకాశాలు లభించవచ్చు. మరింత రెసిలియెంట్ మౌలిక వసతులను నిర్మించుకునేందుకు నమ్మశక్యం కాని అవకాశాన్ని ఇది మనకు అందిస్తోంది. ఈ మౌలిక వసతులు రాబోయే కొన్ని తరాలకు ఉపయోగపడతాయి. ఇదే సందర్భంలో మనం శీతోష్ణస్థితి మార్పుల గురించి కూడా మాట్లాడుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడొచ్చిన మహమ్మారి కారణంగా మనం ఒక సరికొత్త తరపు మౌలిక వసతులను పొందబోతున్నాం. వాటిని మనం గత తరం కంటే మెరుగైన రీతిలో నిర్మించుకోవాల్సి ఉంటుంది. అంటే ఆర్థిక కేంద్రాలతో కమ్యూనిటీలు విడదీయలేని హైవేలు లాంటివి.

మనం కొత్త లక్ష్యాలను కూడా నిర్దేశించుకోవాల్సి ఉంటుంది. ఆర్థికాభివృద్ధి, ప్రజారోగ్యం, జీవవైవిధ్యం, వరదల నియంత్రణ లాంటి వాటన్నింటి గురించి ఏక సమయంలో ఆలోచించేందుకు అవసరమైన ఉపకరణాలు మనవద్ద ఉన్నాయి. మాన్‌హట్టన్‌లో బిగ్ యు తరహాలో సముద్ర మట్టాల నుంచి నగరాలను కాపాడుకునేందుకు పెద్ద పెద్ద స్వాత్‌లను నిర్మించుకోవడం లాంటి ప్రాజెక్టులను చేపట్టవచ్చు. అంతేగాకుండా ఆర్థికాభివృద్ధికి, కమ్యూనిటీ సంస్థలకు ప్రాధాన్యం ఇచ్చేలా వివిధ సహాయ ప్యాకేజీలను ప్రభుత్వం, ఇతరులు ప్రకటించే అవకాశం ఉంది. సరైన మార్గదర్శకాలతో మనం ఆ పెట్టుబడులు బహుళ ప్రయోజనాలు కలిగేలా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఓ ఉదాహరణ చూద్దాం. హరికేన్ కత్రినా తరువాత న్యూ ఓర్లీయెన్స్ అటు శీతోష్ణస్థితి ప్రభావానికి, ఇటు పెట్రోకెమికల్ పరిశ్రమ ప్రభావానికి బాగా గురైనట్లుగా కనిపించింది. గత ఐదేళ్లుగా నగరం నీటి నిర్వహణ రంగాన్ని ఇంక్యుబేట్ చేసేందుకు ప్రయత్నించింది. ఆ తరువాత డచ్ తరహాలో, కీలక పోటీ సామర్థ్యాలతో ఎగుమతి చేసేందుకు ప్రయత్నించింది. అందుకే బహుళ లక్ష్యాలను సాధించేలా ఆర్థిక వ్యవస్థలను నగరాలు ఎలా వైవిధ్యభరితం చేస్తాయన్నది కూడా ఎంతో ముఖ్యమైన అంశం. అది రవాణా కావచ్చు లేదంటే ప్రజారోగ్యం కావచ్చు. ఇక చివరిగా ఒక ఆలోచన – ఈ విషయంలో నేను పెద్దగా అధ్యయనం చేయలేదు గానీ, ఎయిర్‌లైన్ పరిశ్రమకు బెయిలవుట్ ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మంచిదే, అయితే అందులో కొంత మొత్తం హైస్పీడ్ రైల్‌కు కేటాయిస్తే ఎలా ఉంటుంది? నిర్దేశించుకున్న సమయం కంటే ముందుగానే కార్బన్ తటస్థతను సాధించేందుకు విమానయాన సంస్థలు ఈ బెయిలవుట్‌ను వినియోగించుకునేలా చేస్తే ఎలా ఉంటుంది? శీతోష్ణస్థితి మార్పులు లాంటి సంక్షోభంలో అవే కీలపాత్ర వహిస్తున్నాయి. ఆలోచన మంచిదే. మరి చట్ట సభలు ఈ మాటలు వింటాయా?

ఈ విధమైన భారీస్థాయి మార్పులు మౌలిక వసతులు, ఆర్థిక వ్యవస్థల పునరుజ్జీవన శక్తిసామర్థ్యాలను మెరుగు పరుస్తాయి. మరి వ్యక్తులు, ఇరుగు పొరుగు మాటేంటి? సామూహికంగా మనం కోలుకోవడంలో అవి చేయగలిగేదేంటి?

చిన్నస్థాయిలో కార్యాచరణ అయినా గొప్ప మార్పును తీసుకొచ్చేదిగా ఉంటుంది. సాధ్యమైనంత చేసేందుకు ఇతరులకు అది మార్గదర్శకంగా ఉంటుంది. మనం గనుక దీర్ఘకాలిక ఆర్థికమాంద్యంలో ఉంటే దాని ప్రభావం మొదటగా అట్టడుగు తరగతులపై ఎన్నో విధాలుగా పడుతుంది. ఎక్కడి వాళ్లు అక్కడే లేదా సామాజిక దూరం ఆంక్షలను గనుక ఎత్తివేస్తే ప్రజల రాకపోకలు భారీగా పెరుగుతాయి. మన వీధులు మళ్లీ కళకళలాడుతాయి.

ఒక ఉదాహరణ చూద్దాం. చిన్న చిన్న ప్రాంతాలను పునరుత్తేజితం చేయడం స్థానికుల్లో ఏవిధంగా మార్పు తీసుకువస్తుందో చూద్దాం. రెండేళ్ల క్రితం జేఏఎంఏ ఓ అధ్యయనం నిర్వహించింది. ఖాళీ స్థలాలు ఉన్న చోట తక్కువ మొత్తంతోనే వాటిని శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఇది జరిగిన తరువాత, అప్పటి వరకూ తాము డిప్రెషన్‌లో ఉన్నామని చెప్పిన వారి సంఖ్య లో 41.5 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. మానసిక ఆరోగ్యం సరిగా లేదని చెప్పినవారి సంఖ్యలో 62.8 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. ఇది నిజంగా అద్భుతం. మనం తీసుకునే చిన్న చిన్న చర్యలే ఎంతో పెద్దగా పని చేస్తాయి. ప్రజలు తీసుకునే ఇలాంటి చర్యలను అభినందించాలి.

వ్యక్తులు సహాయపడగల కొన్ని ఇతర మార్గాలేంటి?

స్థానిక కార్యకలాపాలకు అండగా నిలవడంలో చేసేది ఎంతో ఉందని నేను భావిస్తాను. ఇప్పుడు అమెజాన్ నిజంగా ఎంతో బాగా పని చేస్తోంది. దాని గురించి చెడుగా మాట్లాడేందుకేమీ లేదు. ఇక మనం ఆలోచించాల్సింది స్థానిక చిన్న, మధ్యతరహా సంస్థల గురించి. అవి బాగా దెబ్బ తిననున్నాయి. వారికి సహాయం చేసేందుకు కొన్ని వినూత్న విధానాలు ఉన్నాయి.

100 రెసిలియెంట్ సిటీస్‌లో మాకొక ఆసక్తిదాయక భాగస్వామి ఉన్నారు. పేరు కొలు. అది ఒక క్రిప్టోకరెన్సీ. వివిధ రకాల ప్రవర్తనలకు గాను వివిధ మార్గాల్లో రివార్డులు అందించేందుకు ఒక మార్గంగా మీరు ఒక స్థానిక వర్చువల్ కరెన్సీని ఏర్పాటు చేసేందుకు అది మీకు వీలు కల్పిస్తుంది. పౌర కార్యకలాపాల్లో లేదా స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రజలు క్రెడిట్స్ పొందేందుకు, ఆ తరువాత వారు ఆ క్రెడిట్స్‌ను స్థానిక సంస్థల ద్వారా వెచ్చించేందుకు అది వీలు కల్పిస్తుంది. ఇది టెల్ అవీవ్‌లో వినియోగించబడింది. దెబ్బ తిన్న ఆర్థిక వ్యవస్థల గురించి మనం మాట్లాడుకుంటున్న సందర్భంలో ప్రజల భాగస్వామ్యం లాంటి వాటిని ప్రారంభించేందుకు ఇదో ఆసక్తిదాయక మార్గం. నిజంగా ఇదెంతో ముఖ్యమని నేను భావిస్తున్నాను.

భవిష్యత్తులో మనం ఎన్నో సమస్యలు ఎదుర్కోనున్నాం అనేది మాత్రం నిజం. అయితే ప్రస్తుత పరిస్థితి ఎన్నాళ్లు ఉంటుందనే విషయంలో కూడా అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించుకోవడం కష్టంగా ఉంది. మానవులు, సామాజికం, భావోద్వేగం, ఆర్థిక వ్యయాలు – ఈ నష్టాలను భర్తీ చేసుకోవడం ఎంతో కష్టం. అనిశ్చితితో పోరాటం చేస్తున్న మాకు, విపత్తులను ఎదుర్కోవడంలో ఎంతో అనుభవం ఉన్న వ్యక్తిగా మీరు ఇచ్చే సలహా ఏమిటి?

ఇలాంటి ప్రజారోగ్య సంక్షోభాన్ని నేను గతంలో ఎన్నడూ చూడలేదు. అయినా కూడా నేను కొన్ని విషయాలు మాత్రం చెప్పగలను. మొదటిది, ఇలాంటి కష్టాన్ని కలసి కట్టుగా ఎదుర్కొన్న వారిలో ఒక అద్భుత అనుబంధం ఏర్పడుతుంది. ఈ విధమైన విపత్తులో, ఆ తరువాత గుడ్‌విల్, కమ్యూనిటీ స్ఫూర్తి ఎంతగానో పెరుగుతాయని సోషియాలజిస్ట్ ఎన్‌రికో క్వారెంటెల్లి గుర్తించారు. ప్రజలు ఇప్పుడు ఒకరికొకరు సహాయ పడుతున్నారు. నిజంగా ఇదెంతో ముఖ్యమైంది.

మరోసారి నేను కూడా అదే విషయాన్ని చెబుతున్నాను. మనల్ని, మన కమ్యూనిటీలను, మన ఆర్థిక వ్యవస్థలను పరివర్తింపజేసుకునేందుకు ఒక అద్భుత అవకాశాన్ని పొందబోతున్నాం. విషాదం, బాధాకరమైన అంశం ఏమిటంటే, అలా చేసేందుకు మనం చాలా తక్కువ స్థాయిలో సన్నద్ధమై ఉన్నాం.

నేను చూసిన ఎన్నో విపత్తుల్లో వ్యూహాత్మకంగా ఆలోచించడం అనేది మాత్రం కనిపించడం లేదు. ఒక హరికేన్ లేదంటే భూకంపం వచ్చిన తరువాత పునర్నిర్మాణం ఎలా అన్న విషయంలో సమగ్రంగా ఆలోచించేందుకు ఒక నిజమైన అవకాశం లభిస్తుంది. మనం మాత్రం గతంలో అవి ఎలా ఉన్నాయో అలా నిర్మించుకునేందుకే మొదటి ప్రాధాన్యం ఇస్తాం తప్పితే మెరుగు పర్చుకోవడాన్ని మాత్రం పట్టించుకోం. మానవ స్వభావమే అంత.

పోర్టారికోలో మారియా హరికేన్ వచ్చిన తరువాత లేదా క్రైస్ట్ చర్చ్‌లో భారీ భూకంపం వచ్చిన తరువాత, న్యూ ఓర్లియెన్స్‌లో కత్రినా తరువాత – ఈ అన్ని సందర్భాల్లో కూడా వ్యూహాత్మకంగా ఆలోచించలేకపోయారు.

పరిస్థితులను మెరుగుపర్చేందుకు మనం ఏదైనా వ్యూహాత్మక యోచన ఉందా?

అదే ఇప్పుడు మన నాయకులకు 1 ట్రిలియన్ డాలర్ ప్రశ్న. దీన్ని కాస్తంత తగ్గుస్థాయి నుంచి ఆలోచిద్దాం. ఈ విధమైన మార్పుల కోసం తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను ప్రజలు ఎంతవరకు బాధ్యులుగా చేస్తారు?

మరీ ముఖ్యంగా తాజా సంక్షోభం విషయానికి వస్తే, వ్యక్తి నుంచి వ్యక్తికి వైరస్ వ్యాపిస్తోంది. మీ పొరుగు ప్రాంతాలు మీకు మిమ్మల్ని అనారోగ్యానికి గురిచేసేవిగా ఉండవచ్చు. ఇలాంటి సమయాల్లో వెనుకడుగు వేయడం తప్ప మరో మార్గం లేదు. ఇంట్లోనే ఉండడమంత సురక్షితం మరొకటి ఉండదు. పటిష్ఠమైన పౌర నెట్ వర్క్‌లు కలిగిన నగరాలు ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి వేగంగా కోలుకుంటాయి, వేగంగా పురోగమిస్తాయి. మీరు ఉండే ప్రాంతం గురించి, అక్కడి ప్రజల గురించి మీకు ఎంత ఎక్కువ అవగాహన ఉంటే అంత త్వరగా మరియు పటిష్ఠంగా మీరు కోలుకొని పురోగమించగలుగుతారు.

మనం గనుక ఒకరితో ఒకరం కలిసి పని చేస్తుంటే రాబోయే సంఘటనలకు మనం మరింతగా సన్నద్ధం కావచ్చు. ఒక సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలుచుకునేందుకు మనం తీసుకోబోయే ప్రతి చర్య కూడా ఎంతగానో తోడ్పడుతుంది. రాబోయే ముప్పులను ఎదుర్కొనేందుకు మనం సన్నద్ధమవుతున్నంత మాత్రాన తదుపరి సంక్షోభాలు రావని కాదు. కరోనా సంక్షోభం ఇంకా ముగిసిపోలేదు.... జూన్‌లో హరికేన్ సీజన్ ప్రారంభం కానుంది!

(సిటీల్యాబ్ సౌజన్యంతో)

రేపటి కోసం ..

ఎంత తేడా..
ఎంతలో ఎంతతేడా..
నింగిలో చుక్కల్లా మెరిసిన నిన్నటికీ
మొగ్గతొడుగుతున్న ఆశల చిదిమేసే నేటికీ
ఎంత తేడా..

నిన్న ఉన్నట్లు నేడు లేదు
నేటిలాగా రేపు ఉంటుందో లేదో తెలియదు
అసలు రేపనేది మిగులుతుందో లేదో..

ఇటుక ఇటుక పేర్చుకుంటూ
కట్టుకున్న ఆశల గూళ్లను
చెల్లాచెదురు చేసేసి
చిమ్మ చీకట్లలోకి విసిరేస్తుందో..
విశ్వమంతా చుట్ట చుట్టేస్తున్న
కనిపించని శత్రువు చుట్టు ముట్టి
ఏకంగా ఎగరేసుకుపోతుందో..
ఏమో.. ఎవరికి తెలుసు?!

x x x

ఎందుకోయీ.. ఆ దిగులు
ఏలనోయీ .. ఆ బెంబేలు
ఆపవోయీ ఆ దైన్యపుచూపులు
నీళ్లుతోడేసిన చెరువులో చేపలా

ఏమిటీ చిందులు ..
నీ దగ్గరే ఉన్నాయిగా
యుద్ధంలో ఆయుధాలు

సామాజిక బాధ్యత మనకుంటే
చేయీ చేయీ కలపకుంటే
సరదా సరదా ప్రయాణాలు మానుకుంటే
విందులు వినోదాలు కాదనుకుంటే
సానిటైజర్ మన చెంతనుంటే
మనను మనం కాపాడుకోవాలనే సోయి ఉంటే
గుండె నిబ్బరం ఆయుధంగా చేసుకుంటే
దేహాన్ని ఫ్యాక్టరీలుగా మార్చుకుంటూ
సప్తసముద్రాలు దాటొచ్చిన కరోనానే కాదు,
దాని తాతలు కూడా పరారవ్వాల్సిందేగా..

చైనా.. నేర్పిన పాఠంతో
ఇటలీ ఇచ్చిన గుణపాఠంతో
దేశమంటే మనుషులే కాదు
దేశమంటే బాధ్యతని మసలుకుంటూ
ఎవరి ఊరిలో వారే
ఎవరి ఇంట్లో వారేనని
రక్షణరేఖలు గీసుకొని
స్వీయ క్వారంటైన్‌తో దడి కట్టేస్తే
సెల్ఫ్ ఐసోలేషన్‌తో దడ పుట్టిస్తే
కల్లోల వైరస్ కాల గర్భంలో కలిసిపోదూ..!

లేదంటే..
చిన్న నిర్లక్ష్యం పెద్దవిపత్తుకు కారణమవుతుంది
కోరలు చాచిన కరోనా కసిదీరా కాటేస్తుంది
అవగాహనతో మెలిగితే
చిరు జాగ్రత్త పెను ముప్పును తప్పిస్తుంది
పుడమిపై రేపటిని పచ్చగా నిలుపుతుంది

మేలుకొని ఇంట్లో నీ వాళ్లతో ఉంటావో
ఒంటరై ఫొటోకి దండ వేయించుకుంటావో
ఉగాదులే చేసుకుంటావో
సమాధే కట్టించుకుంటావో..
ఆలోచించి అడుగువెయ్యి

రేపన్నది మిగుల్చుకోవాలనే అభిలాషతో..
జీవితంలో వెన్నెల్లు పూయాలనే ఆకాంక్షతో
నీ కోసం తల్లడిల్లే నేను

-వి. శాంతి ప్రబోధ



గో కరోనా

నిశ్చల జీవితానికి
ఇరువైపుల క్షతగాత్రులు
కదలని కాలానికి
రెండువైపుల క్షతగాత్రులే

కాలం ఇప్పుడు
లాక్‌డౌన్‌లో ఇరుక్కు పోయింది
క్షతగాత్రులు రోదిస్తున్నారు
జీవితమంటే ఇదేనా
జీవితమంటే ఇంతేనా!!
మరణానికి కోసెడు దూరం
పరుగెడతామని
శ్లాసల్లో చిక్కుకు పోతున్నారు
యుద్ధమంటే ఇదేనా
వాక్యం మీద వాక్యం
వాస్తవం మీద వాస్తవం
పక్కింటి టీవీలోంచి యాంకరీకులు
అరుపులు పెడబొబ్బలు

జీవితమంటే ఇదేనా
జీవితమంటే ఇంతేనా
ఇది ఎవరి భూమి
ఇది ఎవరి ఆకాశం
ఇది ఎవరి నీరు
ఇది ఎవరి నిప్పు
ఇది ఎవరి వాయువు

అంతా సంశయమే
తనువంతా భయభ్రాంతమే

చీకట్లో తలలూపుతున్న
రెండు కొబ్బరిచెట్లు
గాలికి కదిలి వస్తున్నవి
ఎవరివో మాటలు
మనిషిలోపలి సూక్ష్మజీవుల కదలికలు
ఉభయ సంజల నడుమ
మారిపోతున్న గణాంకాలు
పారిపోలేని నిస్సహాయ మానవులు
ఎవరి ఇళ్లల్లో వాళ్లు
శ్రీరామ రక్షలు వల్లేవేస్తున్నారు
తమ ఇష్ట దైవాలకు మొక్కుకుంటున్నారు
ముడుపులూ కట్టుకుంటున్నారు
తినబోయే బలుసాకును
కలలుగా కంటున్నారు
అపార్టుమెంటుల్లో
పొడుగుడ్డల్లా వేలాడుతున్నారు
పిల్లలు గో కరోనా గో కరోనా అంటూ
పాల పాటలు పాడుకుంటున్నారు
అల్లకల్లోలంగా.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphore@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

'మేడ్ ఇన్ ఇండియా' హస్తకళానైపుణ్యం

ప్రభుత్వసాయం కోసం ఎదురుచూపు

దేశంలో సుమారు 5 కోట్లమంది హస్తకళాకారులు, నిపుణులైన వృత్తి పనివాళ్లు ఉన్నారు. సరైన గుర్తింపు, సాయం లేనిదే వాళ్లు ఇప్పుడు జీవనం గడపలేకపోతున్నారు. ఎంతోమంది ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు. వారసత్వ కళలు అంతరించి పోనున్నాయి.

భారతదేశంలోని అన్ని విభాగాల హస్తకళాకారులు విస్మరణకు గురయ్యారు. వారంతా తమను తాము కాపాడు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపున జీఎస్టీ తాకిడి. వారంతా కూడా పేదరికాన్ని, ఆదాయపరంగా అనిశ్చితిని ఎదుర్కొంటున్న వారే. అయినా కూడా.... "హస్తకళాకారులు, వృత్తిపనివాళ్లు, చేనేత కార్మికులు, ఇంట్లో నుంచే పని చేసే నైపుణ్య స్వయం ఉపాధి" వారి గురించి ప్రభుత్వం భారీ ఆర్థిక ప్యాకేజీలో ఒక్క మాట కూడా ప్రస్తావించక పోవడం విషాదం. వారు ప్రస్తుతం ఎవరి దృష్టికీ రావడం లేదు. ఎవరికీ కనబడకుండా, నిశ్శబ్దంగా ఉన్నారు. కానీ వారు నిజానికి వలస కూలీల కన్నా, ఇతర అణగారిన వర్గాల కన్నా తక్కువేమీ కాదు. ఒక ప్రముఖ వెబ్ సైట్‌లో వచ్చిన ఒక సానుభూతి వ్యాసం తమ కథలు వినిపించిన వారికి నేరుగా కొన్ని విరాళాలు అందేలా చేసింది. కొందరికి ఎన్జీవోలు సాయం చేశాయి. అయితే ఈ కళాకారుల తక్షణ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక భవిష్యత్తు కోసం భారీ స్థాయి ప్రణాళికలు అవసరం.

దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకారుల కుటుంబాల విభిన్న పరిస్థితులను పరిశీలించేందుకు వివిధ వర్గాలను క్రమం తప్పకుండా కలుసుకోవాల్సి ఉంటుంది. చేనేత వర్గాలు, మహిళా ఉత్పత్తి సంఘాలు, వివిధ రకాల హస్తకళాకారులు, కుమ్మరులు, బుట్టలు అల్లే వాళ్లు, తివాచీలు నేసే వాళ్లు, సంప్రదాయక కళాకారులు ఈ వర్గాల్లో ఉంటారు. మరీ ముఖ్యంగా ఇప్పటికే ఆర్థికంగా బలహీనంగా ఉండే కళాకారులు.

మేము గమనించిన కొన్ని అంశాలు:

1. లాక్ డౌన్ ప్రారంభం నాటికి కొందరు 15 రోజులకు సరిపడా మాత్రమే ముడిసరుకులను కలిగి ఉన్నారు.
2. బల్క్ ఆర్డర్లు రద్దయిపోయాయి.
3. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే కొందరు సరిపడా ఆహారనిల్వలు కలిగిఉన్నారు. పట్టణాల్లో ఉన్నవారు నెలవారీ సరుకులను మాత్రమే కొంటారు. వారికి ఇప్పుడు ఆదాయం లేదు. ఉత్పత్తి చేసేందుకు వర్కర్లు లేరు.
4. పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారని, కఠినంగా వ్యవహరిస్తున్నారని, ప్రతీ చోటా ఉంటున్నారని ప్రతీఒక్కరూ చెబుతున్నారు.

5. కళల్లో, వృత్తిపనుల్లో పని చేసే రోజువారీ కార్మికులకు లేదా జాబ్ వర్క్ పని వారికి తగిన సరఫరాలు ఉండడం లేదు.
6. జూన్ లేదా జులై నాటికి వారు ముడిపదార్థాలను పొంద గలుగుతారు. మార్కెటింగ్ సీజన్‌కు తగినంతగా ఉత్పత్తి చేయగలుగుతారు.
7. మార్కెట్లు ఇప్పటికే మాంద్యంతో ఉన్నందున భారీగా విక్రయాలు ఉండకపోవచ్చు.
8. చేనేత కార్మికులకు ఇంట్లో మగ్గాలు ఉన్నాయి. కానీ నేసేందుకు యార్న్ లేదు. పేద చేనేత కార్మికులు ఎంతో మంది వారి కింద పని చేస్తుంటారు. వారికి తక్షణం చెల్లింపులు చేయాల్సి ఉంది. ఇది తీవ్రసమస్యగా మారింది.
9. ఇ-కామర్స్‌తో ప్రస్తుతం పెద్దగా సాయం లభించడం లేదు. డెలివరీలు ప్రారంభమైనా కూడా పెద్దగా ఆశపడలేం. ఎందు కంటే లాక్ డౌన్ కాలంలో ముడిసరఫరాలు నిలిచిపోయాయి, సామూహికంగా చేయాల్సిన పనులు ఆగిపోయాయి.

వృత్తిపనివాళ్లు ఇప్పుడు వడ్డీ రహిత రుణాలు కోరు కుంటున్నారు. ఒక్కో కుటుంబానికి నెలకు రూ.5,000 నుంచి రూ.10,000 దాకా కనీసం రెండు నెలల పాటు ఇవ్వాలి. బడ్జెట్ కేటాయింపులు లేనందున నేరుగా ప్రభుత్వమే ఈ మొత్తాలను అందించాలి.

వారసత్వ కళలతో కూడిన కళాకారులు, వృత్తిపనివారు మార్కెట్‌కు అవసరం. కశ్మీర్‌లో మాదిరిగా హస్తకళాకారులు ఎక్కువగా పర్యాటకంపై ఆధారపడ్డారు. డిమాండ్‌ను అధికం చేసేందుకు వారికి ఒక సమ్మిళిత ప్రణాళిక అవసరం. తద్వారా వారు రాబోయే పండుగ సీజన్ వైపు ఆశగా చూడవచ్చు. కార్పొరేట్ రంగం ఆగస్టు నాటికి తమ క్లయింట్లకు ఇచ్చే బహుమతుల ఆర్డర్లకు సంబంధించి ఈ హస్తకళాకారులకు అడ్వాన్సులు ఇవ్వాలి. తేలికపాటి నిబంధనలతో బ్యాంకులు సత్వరమే రుణాలు ఇవ్వాలి. దాంతో వారు లాక్ డౌన్ అనంతరం అవకాశం లభించగానే, ముడిపదార్థాలు కొనుగోలు చేయగలుగుతారు.

టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ తక్షణం దేశంలోని వివిధ ప్రాంతాల నిర్దిష్ట అవసరాలను గమనించాలి. నూలు వడికే వాళ్లకు, నేత కార్మికులకు కేవీఐసీ లాంటి సంస్థలు ఏం చేస్తున్నాయో తెలియదు.

ప్రస్తుత ఇన్‌ఫెక్షన్లు దసరా నాటికి తగ్గితే అది చెడుపై మంచి సాధించిన విజయమే అవుతుంది. భారతదేశవ్యాప్తంగా కుమ్మరులకు మట్టిని అందించవచ్చు. ఈ ఏడాదికి పేడతో సైతం ప్రమిదలు చేసుకోవచ్చు. దిగుమతి చేసుకున్న దీపాల స్థానంలో వీటిని వాడుకోవచ్చు. ఇళ్లలో, ప్రార్థనా స్థలాల్లో, దుకాణాలు, కార్యాలయాల్లో లక్షలాది అగరుబత్తీలను వెలిగిస్తుంటారు. నేడు సుమారుగా రూ.400 కోట్ల విలువైన వెదురు ముక్కలను చైనా, వియత్నాంల నుంచి ఐటీసీ, సైకిల్ బ్రాండ్, పతంజలి లాంటివి దిగుమతి చేసుకుంటున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో వెదురు సమృద్ధిగా లభిస్తుంది. అక్కడి వారికి కావాల్సింది తాగే స్ట్రాలు మొదలుకొని పాత్రలు, కట్టింగ్ బోర్డ్స్, ఫ్లోర్ బోర్డ్స్, ఫర్నీచర్ దాకా బల్క్ ప్రొడక్షన్‌కు తగిన సాంకేతికతలు. ప్రధానమంత్రి పేర్కొన్నట్లుగా చేనేత కార్మికులు అందించే మల్టీపర్పస్ హ్యాండ్ లూమ్ గంచా (దస్తీలు, టవల్స్ లాంటివి)ను మాస్కులుగా ఉపయోగించుకోవచ్చు.

ఆర్గానిక్ విధానాలతో ఉత్తేజితం చేయబడిన గ్రామీణ పరిశ్రమలు కార్బన్ ఫుట్ ప్రింట్‌ను తగ్గిస్తాయి. వలసలను నిరోధిస్తాయి. సుస్థిరదాయక జీవనోపాధులతో సుమారు 5 కోట్ల మంది నైపుణ్య వృత్తిపనివారికి గుర్తింపు, అండ అందించకుంటే వారసత్వ కళలు మాయమైపోయే అవకాశం ఉంది. నైపుణ్యాలు అంతరించిపోయే ప్రమాదం ఉంది. వారు తయారు చేసేవన్నీ మేడ్ ఇన్ ఇండియా. మేక్ ఇన్ ఇండియా కూడా. ప్రభుత్వ సాయం వారికి మెరుగైన దీర్ఘకాలిక భవితను అందిస్తుంది.

- జయా జైట్లీ

కరోనాపై అవగాహన కల్పిస్తున్న అవనిరావు

కరోనా మహమ్మారి సమాజంలోని ప్రతి వ్యక్తిని, వ్యక్తి జీవితంలోని ప్రతి అంశాన్ని కుదిపేసింది. ఓ పక్క వైరస్ కోరల్లో చిక్కుతామన్న భయంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని, మరో పక్క లాక్డౌన్ కారణంగా పని దొరకక పస్తులుంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ఈ క్లిష్టమైన పరిస్థితులు కళాకారుల హృదయాలను మరింత కలిచి వేస్తున్నాయి. వారు కళను చూసే దృష్టిని మారుస్తున్నాయి. సామాజిక సమస్యలు, మహిళా సాధికారత వంటి అంశాలను ఆధారంగా పలు చిత్రాలు గీసి ప్రముఖ కళాకారిణిగా పేరుపొందిన అవనిరావు గంద్ర చిత్రాలలో ప్రస్తుతం కరోనా రక్కసే ముఖ్యమైన అంశం.

ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకొని ప్రాణాంతక వైరస్ సృష్టిస్తున్న పలు సమస్యల నేపథ్యంలో అవనిరావు ఏప్రిల్ 12, 2020 నుండి మే 12, 2020 వరకు ప్రతి రోజూ రోజుకో అద్భుతమైన చిత్రం చొప్పున 30 చిత్రాలను గీస్తున్నారు. వాటిని వెబ్సైట్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ పేజీలలోని ఐకాన్ ఆర్ట్ గ్యాలరీలో లైట్ ఎట్ ద ఎండ్ ఆఫ్ టన్నెల్ – కోవిడ్ 19 అనే పేరుతో ప్రదర్శనకు పెడుతున్నారు. ప్రతి ఒక్కరికీ చిత్రంలోని భావం తేలికగా అర్థం అయ్యేందుకు ఆయా చిత్రాలకు ఓ కొటేషన్ను కూడా జత చేస్తున్నారు.

అవనిరావు విభిన్న కోణాలలో రకరకాల రంగులతో వివిధ రంగుల మిశ్రమాలతో చిత్రాలను తీర్చిదిద్దుతున్నారు. ఒక్కో మిశ్రమాన్ని ఒక్కో భావానికి ఉపయోగిస్తున్నారు. ఆమె చిత్రాలలో ఉపయోగించే నలుపు, తెలుపు రంగులు చీకటిని పారద్రోలి భవిష్యత్తులో వెలుగురేఖలు ప్రసరిస్తాయని, మంచి కాలం ముందుందనే సత్యాన్ని తెలిపే చిత్రాలు. ఆమె వేస్తున్న ప్రతి చిత్రానికీ ఏదో ఒక కోణంలో వైరస్ తో సంబంధం ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అవి ప్రజలకు పలు భావాలను వ్యక్తం చేస్తున్నాయి. వ్యక్తి పరిశుభ్రత, మాస్కులు, లాక్డౌన్ ఇలా కరోనతో ముడిపడి ఉన్న ప్రతి అంశాన్ని తన చిత్రాలలో చిత్రించి ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారు.

కరోనా సోకకుండా మనం మాస్కులు వేసుకోవడం ఇప్పుడు కనిపిస్తున్నప్పటికీ మన హృదయాలకు ఎప్పుడో మాస్కులు వేసుకున్నామని అవి మనకు ప్రకృతి రమణీయతను కనపడకుండా చేస్తున్నాయని ఆమె అంటున్నారు.

భూమి మీద ప్రకృతి వనరులు వేగంగా తరిగి పోతున్నాయని, వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని, వీటి కారణంగా ఇంతకు మునుపే భయాందోళనలో చిక్కుకున్నామని అంటున్నారు. లాక్డౌన్ ప్రారంభమైన దగ్గర నుంచి తన ఇంటి తోటలోకి వివిధ రకాల పక్షులు వచ్చి గాలిని శుభ్రం చేసి వాతావరణాన్ని ఆహ్లాదం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు,వైద్యులు, వైద్యసిబ్బంది, పోలీసులు మరింత అంకితభావంతో పని చేసేలా చేస్తున్నాయని ఆమె అభిప్రాయపడుతున్నారు.

అవనిరావు గీసిన చిత్రాలలో ఒకటి నల్లని సూర్యుడు దాని కింద ఒక అందమైన తామర పువ్వు. నల్లని సూర్యుడు కరుణ ఎరుగని కరోనా వైరస్కు, అందమైన కమలం ఏమాత్రం స్వార్థంలేని ప్రకృతికి సంకేతాలు. నల్లని సూర్యుడు తన విషంతో ప్రపంచాన్ని

the pioneer
Hyderabad

THROUGH THE LOOKING GLASS

Artist Avani Rao Gandra is making art every day to explain the changes that took place in people's lives due to the lockdown, reports V SATEESH REDDY

ALONG WITH HER PAINTING, AVANI ALSO ADDS A POEM ABOUT HER WORK TO UNDERSTAND ABSTRACT EXPRESSIONISM

— AVANI

Caring for ... of those

As various sections of the society suffers due to the lockdown to curb spread of COVID-19, a software engineer from Hyderabad is taking care of the nutritious needs of the families of daily-wage labourers whose sole breadwinners have migrated abroad and can't reach out, reports Rachel Dammala

...xpressway

It also shows how the priorities have shifted. I am an abstract expressionist. The strokes, the marks, the colours I have been using pour down emotional intensity. I can say there's a shift in the world

Avani Rao Gandra
University of Cardiff

THE SECRETS OF SOLITUDE

Artist Avani Rao Gandra expresses lockdown through her digital art exhibition

AS the lockdown continues, artists take to online platforms to express their creativity and present their artworks. Hyderabad artist Avani Rao Gandra through her collection of online exhibition titled 'Light at the End of the Tunnel' expresses the elements the solitude during the lockdown is unfolding within her. She's been using digital media and mixed media for creating her artworks. Avani presents one artwork each day along with one corresponding quote.

Here's what she has to say: "Covid-19 has brought to the table what we have been avoiding. The sense of 'I am supreme' got busted. So many philosophers have said that we are one and it took a tiny virus to convey the same. The intensity of the emotion is asking you to see different angles of people. But the kind of humanitarian spirit we are seeing tells you that humanity is still there. How in the villages and rural areas man-yo-man sharing has been so important."

Covid-19 has brought to the table what we have been avoiding. The sense of 'I am supreme' got busted

Her previous work was more on beauty and joy. She says that the kind of intensity she feels is phenomenal. "There's humbleness as this pandemic has brought you down to your knees." Life comes first and to be alive is the biggest blessing we can ever have, she feels. "It also shows how the priorities have shifted. I am an abstract expressionist. The strokes, the marks, the colours I have been using pour down emotional intensity. I can say there's a shift in the work. These are historical times. We are lucky to be privileged. People all across the world are anxious. Look at the poor as they have always faced the challenge. I have a bit of philosophy and spirituality to see things as they are meant to be."

Nature is healing itself through these times. Avani realises that it's a continuous story. The elements are same. A bird and a boat can mean the same thing. "Everyday I am painting. I have to finish 30 or 40 unfinished works. No art is ever finished. There's a hidden poetic sensibility. For every painting I am writing a small quote. Everybody is going through the same feeling. I want my work to speak in a hundred ways at least carrying the complete sensibilities. The clouds, birds and skies are metaphorical."

Avani gets emotional and adds, "This is one world seeing darkness but we always wait for the light – the light at the end of the tunnel. I am planning to blow them up to large scale paintings which earthy feel. Everyday I am posting the paintings. I don't want to stop the flow. We all are connected to one another."

— Saima Afreen
saima@newindianexpress.com
@Sfrwn

INDIAN Tue, 14 April 2020



నాశనం చేస్తుంటే తామరపువ్వు తన స్వచ్ఛమైన సువాసనతో గాలిని పరిశుభ్రం చేస్తున్నట్లు వర్ణిస్తుంది చిత్రం.

ప్రకృతి మృదు మధురమైన సంగీతాన్ని సృష్టించి వాతావరణాన్ని ఆహ్లాదపరిచినట్టే కరోనా సృష్టిస్తున్న అత్యంత క్లిష్టమైన సమస్యలను కూడా రూపుమాపి మానవాళికి వెలుగు రేఖలను ప్రసరింప చేయడమే ఆమె చిత్రాల సారాంశం.

– అనిల్,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

వాస్తవ దృశ్యాల్ని తెల్పిన డా॥ కసప నరేందర్ పుస్తకాలు

శోధన, తెలంగాణ ఉద్యమ-పాట, కొత్తపల్లి జయశంకర్, గూడ అంజయ్య పుస్తకాల ఆవిష్కరణసభలో నందిని సిధారెడ్డి

నిజాం కాలేజీలో ఫిబ్రవరి 24న డా. కసప నరేందర్ రాసిన నాలుగు పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. పుస్తక ఆవిష్కరణ సభను నిజాం కళాశాల తెలుగు శాఖ మరియు తెలుగు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వారు నిర్వహించారు.

పుస్తక ఆవిష్కరణ సభలో తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. సీహెచ్. గోపాల్‌రెడ్డి, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్, ఓయూ తెలుగుశాఖ అధ్యక్షులు ప్రొ.సూర్యధనుంజయ్, తెలుగు అకాడమీ సంచాలకులు ఎ.సత్యనారాయణ రెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్, కమిషన్ సభ్యులు డా.విద్యాసాగర్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డా.అంపశయ్య నవీన్, కాళోజీ పురస్కార గ్రహీత డా.అమ్మంగి వేణుగోపాల్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్, దక్కన్‌లాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్ పాల్గొన్నారు.

డా. నరేందర్ రాసిన శోధన, తెలంగాణ ఉద్యమ-పాట, కొత్తపల్లి జయశంకర్, గూడ అంజయ్య అనే నాలుగు పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది.

విశిష్ట అతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం గ్రహీత డా. అంపశయ్య నవీన్ మాట్లాడుతూ నరేందర్ తన నవలలపై చేసిన పరిశోధనలను గుర్తు చేసుకున్నారు. నరేందర్‌లో మంచి పరిశీలన దృష్టి ఉందని, మంచి సాహిత్య పరిశోధకుడు అని కొనియాడారు. ఒక్క పుస్తకం రాయడం కష్టమని, అలాంటిది నాలుగు పుస్తకాలు రాయడం మరింత కష్టమన్నారు.

గౌరవ అతిథులు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ నరేందర్ శోధనను, పాటను మరియు రెండు మోనోగ్రాఫ్‌లను ఒకే వేదికపై ఆవిష్కరించడం చాలా గొప్ప విషయం అన్నారు. నరేందర్‌లో కవి, పరిశోధకుడేకాదు మంచి విమర్శకుడు ఉన్నట్లు తెలిపారు. నరేందర్ రాసిన శోధన గ్రంథంలో నరసింహారెడ్డి రాసిన ముందుమాట గురించి చదివి వినిపించారు.

ఓయూ తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సూర్యధనుంజయ్ మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతరం పరిశోధకులు అని కొనియాడారు. డా.నరేందర్ అధ్యాపకుడిగా ఉంటూనే నిత్య అన్వేషి, నిత్య పరిశోధకుడు అని ప్రశంసించారు. ఆయనలో ఏదో ఒకటి సాధించాలనే తపన ఉందన్నారు. ఆయన రాసిన పుస్తకాల వెనుక ఎంతో కృషి దాగి ఉందన్నారు.

కాళోజీ పురస్కార గ్రహీత డా.అమ్మంగి వేణుగోపాల్ మాట్లాడుతూ తాను 1963-64లో నిజాం కళాశాలలో డిగ్రీ చదువుకున్నట్లు తెలిపారు. తనకు నిజాం కళాశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పుస్తకంలోని పాటలు, మన సంస్కృతి, సంప్రదాయాలను వివరించారు. తెలంగాణ ఉద్యమం-పాటలో పాటలను వివిధ విభాగాలు చేశారు. పాట పోషించిన తీరును

పాట ఉద్యమానికి ఏ విధంగా దోహదపడిందో విశ్లేషించారు.

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ చరిత్ర చాలా ముఖ్యమైందని, ఆ చరిత్రను గద్యరూపంలో రాయడం చాలా కష్టమైందన్నారు. అదే చరిత్ర కవికి పాట రూపంలో చెప్పడం చాలా సులభం అన్నారు. తెలంగాణ ఉద్యమం గురించి పాటలో చెప్పడం తెలంగాణకు ఉన్న గొప్ప నేపథ్యం అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర పాటల వల్ల ఎక్కువగా నేర్చుకున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ అంటే ఒక చరిత్ర. తెలంగాణ అంటే ఒక పాట అన్నారు. తెలంగాణ పాటలో బాధ ఉంటుందని, దుఃఖం ఉంటుందని, చైతన్యం ఉంటుందన్నారు. తెలంగాణ ఉద్యమం - పాట పుస్తకం గర్వకారణం అన్నారు.

ప్రముఖ రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి మాట్లాడుతూ నవల పేరు ఇంటి పేరుగా ఉ ండటం చాలా గర్వకారణమని, ఆ క్రెడిట్ అంపశయ్య నవీన్‌కు దక్కుతుందన్నారు. ఒక్క పుస్తకం రాయడం కష్టమవుతున్న తరుణంలో నరేందర్ పుస్తకాలు రాయడం అభినందనీయం అన్నారు. తనకు తెలిసినంత వరకు జయశంకర్ కొత్తపల్లి జీవితచరిత్రపై పుస్తక రూపంలో రాయడం ఇదే మొదటిసారి అన్నారు. శోధనలో వాస్తవ దృశ్యాల్ని చెప్పడం గర్వకారణం అన్నారు.

రచయిత డా.కసప నరేందర్ మాట్లాడుతూ నాలుగు పుస్తకాలు రాయాలని రాసినవి కాదన్నారు. మూడు పుస్తకాలకు తెలుగు అకాడమీ అవకాశం ఇచ్చిందన్నారు. శోధన వ్యాస సంపుటిలో కవులకు సంబంధించిన వివిధ అంశాలను తీసుకొని రాసినవన్నారు. ఇవి విద్యార్థులకు, సాహిత్యకారులకు ఉపయోగపడతాయన్నారు.

- సృజన్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

విద్యార్థుల సృజన అభినందనీయం

నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కథారచనలో రాణించడం ఎంతో అభినందనీయమని జిల్లా అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్ అన్నారు. చిల్డ్రన్స్ అకాడమీ, బాల చెలిమి సంయుక్త ఆధ్వర్యంలో మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడిన "నల్లగొండ జిల్లా బడి పిల్లల కథలు" పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పుస్తకంలో బాల రచయితలు పెద్ద పెద్ద కథలు రాశారని, ప్రతి కథలో నైతిక విలువలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి కథలు విద్యార్థులు సన్మార్గంలో పయనించేలా ఉపయోగపడగలవని తెలిపారు. ఈ కథల సంకలనంలో జిల్లా పరిషత్ హైస్కూల్ చందూర్, వట్టిమర్తి హైస్కూల్, మిర్యాలగూడ బాలికల ఉన్నత పాఠశాల, వల్లాల తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్, నేతా పురం హైస్కూల్ మొదలగు పాఠశాలల పిల్లల కథలు ఇందులో చోటు చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా కథా సంకలనం కన్వీనర్ కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి తోపాటు ప్రముఖ కథా రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి, పెరుమాళ్ళ ఆనంద్, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రచయితలకు:

- కథ, వ్యాసం రెండు రెండున్నర (ఎ4 సైజ్) పేజీలకు మించరాదు.
- కవిత 20-22 లైన్లు మించకూడదు.
- పుస్తక సమీక్షలు, విశ్లేషణలు రెండు పేజీలకు మించరాదు.
- రెండు కాపీలు విధిగా పంపాలి.
- ప్రతి రచయితా తమ రచనతో పాటు, ఫోన్ నెంబర్, ఇ-మెయిల్, పోస్టల్ అడ్రస్ తప్పనిసరిగా ఇవ్వాలి.
- మ్యాటర్ టైప్ (డిటిపి) చేసి ఉంటే ఓపెన్ & పీడీఎఫ్ ఫైల్ పంపాలి.

పాఠకులకు:

సామాజిక అంశాలు, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యావరణం, పర్యాటకం లాంటి అంశాలతో పాటు కథ, కవితలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, విశ్లేషణతో 'దక్కన్ ల్యాండ్' మీ చేతుల్లో ఉంది. ఇందులో ప్రచురితమైన రచనల పట్ల మీ అభిప్రాయాలను లేఖల రూపంలో తెలియ జేయగలరు.

చిరునామా :

TRC TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND : "CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
Fax: 040-27635644 Mobile: 9030626288
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయాలి

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్

- **పాఠశాలలకు రీడింగ్ క్లబ్స్ ఎంతో అవసరం : చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి చైర్మన్ మణికొండ వేదకుమార్**
- **ఉమ్మడి మెదక్‌లో ఘనంగా బాలచెలిమి 24వ ముచ్చట్లు కార్యక్రమం**

బాల సాహిత్యమే బంగారు భవితకు బాటలు వేస్తుంది. బాలల్లో దాగియున్న సృజనాత్మకతను వెలికితీసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి సాహిత్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. బాలల్లో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి, బాలచెలిమి పిల్లల వికాస పత్రిక విశేషమైన కృషి చేస్తోంది. పిల్లలకు వైవిధ్యమైన విజ్ఞానాన్ని అందించేందుకు కవులు, రచయితలు, ఉపాధ్యాయులతో ప్రతి నెల రెండవ శనివారం 'బాలచెలిమి ముచ్చట్లు' నిర్విరామంగా నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు 23 బాలచెలిమి ముచ్చట్లు కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణలోని 31 జిల్లాల్లో ముచ్చట్లు నిర్వహిస్తున్నారు. బాల చెలిమి పిల్లల వికాస పత్రిక, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి సంయుక్తాధ్వర్యంలో బాలచెలిమి ముచ్చట్లు - 24 కార్యక్రమం ఫిబ్రవరి 18న మెదక్‌లోని న్యూ హైస్కూలులో జరిగింది. 'బాలచెలిమి' మెదక్ జిల్లా బడి పిల్లల కథలు - బాల కథకుల ఆలోచనలు, ఆవిష్కరణలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఉమ్మడి మెదక్ జిల్లా బాల సాహితీవేత్తలు, కవులు రచయితలు, సాహిత్య సంస్థల నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్, విశిష్ట అతిథిగా చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్, నోడల్ అధికారి మధుమోహన్, పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత నశించిపోకుండా చూడాలి : జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్

నేటి విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మకత నశించి పోతుందని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ తరం పిల్లలు క్వశ్చన్‌కు ఆన్సర్ మాత్రమే చదువుతున్నారని, కానీ ఆ ఆన్సర్ ఎందుకు చదువుతున్నారో మర్చిపోయినట్లు తెలిపారు. ఒకప్పటి విద్యార్థులు పాఠశాలలో క్లాసులు విని ఇంటికొచ్చి బాగా ఆడుకునే వారన్నారు. అప్పట్లో టెక్ట్స్‌బుక్స్ చదవాల్సిన పని ఉండేదికాదని, గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదువుకొని జ్ఞానం పెంచుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు నాణ్యమైన కథలు రాసి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, చిన్నతనం నుండే విద్యార్థులు మంచి లక్ష్యం ఏర్పాటు చేసుకొని విజయం

సాధించాలన్నారు.

మూడు దశాబ్దాలుగా రీడింగ్ క్లబ్స్ కోసం కృషి చేస్తున్నాం : చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి ఛైర్మన్ మణికొండ వేదకుమార్

పిల్లల పట్ల తపన ఉండి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు సంకల్పించడం గర్వకారణం అని చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి ఛైర్మన్ మణికొండ వేదకుమార్ అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పేరు మీదనే బడి పిల్లల కథలు పుస్తకాలు తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. 33 జిల్లాల్లో బాలసాహితీవేత్తలందరినీ ఆహ్వానించడంతో దాదాపు నాలుగైదు వందల కథలు తమ వద్దకు వచ్చినట్లు తెలిపారు. వీటిని పది సంకలనాలుగా నెల రోజుల్లో తీసుకురాబోతున్నట్లు తెలిపారు. పిల్లలకు అదనంగా చదివే పఠనం పట్ల ఆసక్తి కలిగించడానికి రీడింగ్ క్లబ్స్ అనేవి పాఠశాలల్లో ఉండాలనేది తమ అభిమతమని, గత మూడు దశాబ్దాల నుండి చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో దీనిపై ఒక నిర్ణయానికి వచ్చి బాలసాహిత్యానికి రెండు సెషన్లు కేటాయించినట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల బాలసాహితీవేత్తలు వేదికమీద పాలుపంచుకొని, బాలసాహిత్యం ఎలా ఉండాలి, ఇతర దేశాల్లో బాలసాహిత్యంపై తీసుకుంటున్న మార్పులు మొదలైన వాటిపై చర్చించినట్లు తెలిపారు. మన రాష్ట్రంలో ఎటువంటి బాలసాహిత్యం వస్తుంది, ఎటువంటి ప్రచురణలు రావాలి, పిల్లల్లో ఆసక్తి ఎలా కల్పించాలి, ఎలాంటి పబ్లిషర్స్ ఉండాలి, ఎటువంటి బొమ్మలు గీయాలి మొదలైన వాటిపై చర్చ జరిగినట్లు తెలిపారు. ఇరు రాష్ట్రాల నుండి చక్కని బాలసాహిత్యం రావడానికి అవకాశం ఉందని, దాన్ని ఒక మూవ్‌మెంట్‌లాగా కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

బాలల్లో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా 1990–91లో పిల్లల మాసపత్రిక 'బాలచెలిమి'ని తీసుకొచ్చినట్లు తెలిపారు. బాలచెలిమి ముచ్చట్లు పేరుతో ఇరు రాష్ట్రాల్లో ఉన్న రెండువందల మంది రచయితలతో ఇప్పటి వరకు 23 బాలచెలిమి ముచ్చట్లు కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ ముచ్చట్లను ఎక్కువగా హైదరాబాద్‌లో నిర్వహించామని, మిగతా అన్ని జిల్లాల్లో కూడా బాలచెలిమి ముచ్చట్లు కార్యక్రమాలు నిర్వహించేలా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అందరి ఆలోచనలను పంచుకొని ఎటువంటి రచనలు ఉండాలని ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. పుస్తకాలు తెచ్చేముందు కథలను ఎంపిక చేయడానికి మొదటిసారిగా 10 జిల్లాల ఎక్స్‌పర్ట్స్‌తో ఒక కార్యశాలను నిర్వహించి, 882 కథల నుండి బెస్ట్ అనుకున్న కథలనే ఎంపిక చేసి సంకలనం రూపంలో తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ జిల్లాల నుండే ఆర్టిస్టులను ఆహ్వానించి వారితో కార్యశాల నిర్వహించి పుస్తకాలకు అందమైన బొమ్మలు గీయించినట్లు తెలిపారు. 2020 డిసెంబర్‌లోగా తెలంగాణలోని 33 జిల్లాల్లో బాలచెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నామని, ఇప్పటికే మూడు జిల్లాల్లో గ్రంథాలయాలను ప్రారంభించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు లేదా శాఖ గ్రంథాలయాల్లో బాలచెలిమి గ్రంథాలయం అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏ పుస్తకాలైతే పిల్లలకు ఉపయోగం ఉంటుందో అలాంటి పుస్తకాలను మాత్రమే ఉంచుతామన్నారు. రెండు నెలల క్రితం భూదాన్ పోచంపల్లి, ఖమ్మం జిల్లాలోని జల్లిపల్లి ప్రభుత్వ పాఠశాల, నిజామాబాద్ జిల్లాలోని తడపాకలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగో గ్రంథాలయాన్ని పెద్దపల్లి జిల్లాలోని నందిమేడారంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేవరకొండలో కూడా మరో గ్రంథాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. 33 జిలాల ప్రభుత్వ గ్రంథాలయాల్లో బాలచెలిమి గ్రంథాలయాలను పెట్టుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయాచితం శ్రీధర్ గతంలోనే చెప్పారని వేదకుమార్ వివరించారు. గ్రంథాలయాల నిర్వహణ అంటే పుస్తకాలు అలమారలో పెట్టి, చదివించి ఆసక్తి కల్పించడమే కాదని, అవి ఒక వికాస సెంటర్లుగా వృద్ధి చెందాలన్నారు. కథలపట్ల ఆసక్తి కల్పించడానికి ఒరియంటేషన్, ఎక్స్‌పర్ట్‌లతో కథలు చెప్పించడం జరుగుతుందన్నారు. లైబ్రరీ కేంద్రంగా కథలమీద అవగాహన మరియు పేయింటింగ్, సింగింగ్ మొదలైన టాలెంట్‌ను గుర్తించి వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. పిల్లలు సైతం తమ ప్రతిభను నిరూపించుకోవడానికి మంచి అవకాశం ఉందన్నారు. హిందీ, మలయాళం, బెంగాలీ, మరాఠీ, గుజరాత్ రాష్ట్రాల్లో చాలా చక్కని బాలసాహిత్యం వస్తుందన్నారు. మంచి బాలసాహిత్యాన్ని సమాజానికి అందించడమే తమ ధ్యేయం అన్నారు. గ్రామం నుంచి వచ్చిన పిల్లలకే ఎక్కువ శక్తి సామర్థ్యాలు ఉంటాయని, అందులో పట్టణం పిల్లలు కొంచెం వెనుకబడి ఉంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను తాను ఎక్కువగా గౌరవిస్తానన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం.. వీళ్లందరూ కుగ్రామాల నుండి వచ్చినవారేనన్నారు. గ్రామాల్లో చదువుకున్న పిల్లలు ఏ విషయంలోనూ తీసిపోరన్నారు. రాష్ట్రంలో అత్యంత ఎక్కువగా అర్హులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నట్లు తెలిపారు. మన పాఠశాలలను ఇంకా బలోపేతం చేసుకుంటే విద్యా వ్యవస్థ బలపడుతుందన్నారు. ఇతర చదువులతోటి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. గ్రామాల్లో ఉన్నాం.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నాం.. అని ఏ ఒక్క విద్యార్థి అనుకోవద్దని, ప్రభుత్వ విద్యా వ్యవస్థ చాలా గొప్పదన్నారు. దేశంలో ఉన్నతస్థాయిలో నిలిచినవారందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారేనని గుర్తు చేశారు.

ప్రతి కథ ఆత్మవిశ్వాసం ఇస్తుంది : నోడల్ అధికారి మధు మోహన్

మెదక్ జిల్లా ఏర్పడిన తర్వాత మంచి కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణం అని, టీమ్‌వర్క్‌తో ముందుకువెళ్తే విజయం సాధిస్తారని నోడల్ అధికారి మధుమోహన్ పేర్కొన్నారు. ప్రతి కథలో నీతి అనేది ఉంటుందని, ఆ కథ నుండి ఆత్మవిశ్వాసం

పెంపొందించు కోవచ్చన్నారు. రేడియోలో గతంలో కథలు వచ్చేవని, అవి చాలా బ్రహ్మాండంగా ఉండేవన్నారు. టెక్నాలజీ పెరిగిన నేపథ్యంలో అలాంటి కథలకు స్థానం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విద్యార్థులచేత కథలు చదివించాలని 2009లో సీసీ విధానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విద్యార్థి కథ చదివి, ఆ కథలోని సారాంశాన్ని అర్థం చేసుకొని, కథలోని భావం రాయమంటే పిల్లలు రాస్తున్నారన్నారు.

మంచి కథలు చదివి గొప్ప స్థాయిలో నిలవాలి : ఉపాధ్యాయులు; రాజేంద్ర

అప్పట్లో కథలు విన్నవాళ్లు మంచి అలవాట్లను అలవర్చుకొని జీవితంలో గొప్ప స్థాయిలో నిలిచారని ఉపాధ్యాయులు రాజేంద్ర పేర్కొన్నారు. కథలు, సాహిత్యం పట్టించుకోనివాళ్లు దురలవాట్లకు అలవాటుపడి చాలా ఇబ్బందులు పడినట్లు తెలిపారు. నేడు కూడా కథలు వినడానికి చాలా మంది విద్యార్థులు సిద్ధంగా లేరని, వాళ్లు కథలు వినేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు.

ర్యాంకులు, మార్కులే జీవితం కాదు :
బాలసాహితీవేత్త, రిటైర్డు ఉపాధ్యాయులు శర్మ

విద్యార్థి జీవితంలో ర్యాంకులు, మార్కులు మాత్రమే సరిపోవని, అవే ప్రధానం కాదని బాలసాహితీవేత్త, రిటైర్డు ఉపాధ్యాయులు శర్మ పేర్కొన్నారు. జీవితంలో విద్యార్థులు నిలబడటానికి అనేక నైపుణ్యాలు అవసరం అని, ముఖ్యంగా ఈ జనరేషన్ పిల్లలు చాలా దురదృష్ట వంతులని, వాళ్లకు కథలు చెప్పేవాళ్లే లేరన్నారు. జీవితంలో వచ్చిన సమస్యలను గ్రామాల్లో నివసించేవాళ్లే సమర్థంగా ఎదుర్కొని పరిష్కరిం చుకుంటారన్నారు. అలాంటి కథలవైపు పిల్లలను తీసుకెళ్లేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. కథల్లో వారి సమస్యలు, వారు పరిష్కరించుకునే విధానం ఇవన్నీ ఉంటాయన్నారు.

అన్ని జిల్లాలు తనవే అని భావించడం గర్వకారణం :
తెరసం అధ్యక్షురాలు కవిత

పుస్తక పఠనం అంటే తనకు చిన్నతనం నుండి ఎంతో ఆసక్తి ఉందని, అందుకే తాను కవితలు, కథలు రాసినట్లు తెరసం అధ్యక్షురాలు కవిత తెలిపారు. సమాజంలో నిజాయితీగా బతకాలన్నా, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నా పుస్తకంలోని కథలు చదవాలన్నారు. అందుకు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. పుస్తకం అనేది తరాలకు నిలిచిపోయే ఆస్తి అని, అన్ని జిల్లాలు తనవే అని భావించి వేదకుమార్ పది జిల్లాల కథల పుస్తకాలు తీసుకురావడం చాలా గర్వకారణం అన్నారు.

ఈ కార్యక్రమంలో బాలచెలిమి రాష్ట్ర కన్వీనర్ అశోక్, ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ రాజేశం, సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజద్ అలీ, కార్యక్రమ నిర్వాహకులు అంజాగౌడ్, రవి, సత్యనారాయణ రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

– జుగాష్‌విలి
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

ఆమెకో అక్షరం

ఆమెకోసం
నాలుగు వాక్యాల్ని
భుజంమీదేసుని బయల్దేరాను

గుండెపువ్వును పిండి
పరిమళమంతా
వెంటేసుకుని తిరుగుతున్నాను

ఆమె కనపడితే చెప్పండి
ఆమెకో అక్షరాన్నప్పగించి
ప్రపంచయాత్రకు బయల్దేరాలి

నేనే నేలను దున్ని
పండించిన అక్షరమిది
నేనే పువ్వునై పూసి
సమకూర్చుకున్న రంగు ఇది
నేనే స్వయంగా
ఆమె పాదాలదగ్గర పెట్టాలి

ఆమెనెవరూ సరిగా చూడలేదు
ఆమెనెవరూ సరిగా చదవలేదు
ఆమె ఒంటరిగా ఎదురుచూస్తోంది

సమస్త జీవకోటి తరపున
నా హృదయం మీద
ఆమెకో క్షమాపణాక్షరం రాసాను
దాన్నామెకందించి
ఒక కన్నీటిబొట్టై రాలిపోవాలి!

– సాంబమూర్తి లండ
m : 9642732008
e : sambhamurthylanda@gmail.com





జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్-త్రైమాసిక

TRC
Journal of Telangana Studies

TELANGANA RESOURCE CENTRE

తెలంగాణ రిసోర్స్ సెంటర్ (TRC) ఆధ్వర్యంలో 'టీఆర్‌సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్' త్రైమాసిక జర్నల్ (జూలై-అక్టోబర్ రెండవ సంచిక) వెలువడింది. దీనికి ఓయూ మాజీ ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ ఎడిటర్‌గా, తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ మణికొండ వేదకుమార్ పబ్లిషర్‌గా ఉన్నారు. ఈ జర్నల్ ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ప్రచురితమవుతుంది. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై ప్రముఖంగా వచ్చిన వ్యాసాలను ఈ జర్నల్‌లో ప్రచురిస్తారు. టీఆర్‌సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్ (TRC Journal of Telangana Studies)లో వివిధ రాష్ట్రాల నుండి ఎమినెంట్ స్కాలర్స్ రాసిన పరిశోధన పత్రాలను ప్రచురిస్తారు. మేధావులైన ఎడిటోరియల్ బోర్డు పర్యవేక్షణలో ఈ త్రైమాసిక జర్నల్ అక్షర రూపంగా వెలువడుతుంది. తెలంగాణ రాష్ట్ర చరిత్ర, ఆర్కియాలజీ, ఆర్ట్స్ అండ్ లిటరేచర్, హెరిటేజ్ మొదలైన సామాజిక అంశాలపై విస్తృతంగా, పరిశోధనాత్మకంగా వ్యాసాలను క్రోడీకరించి వాటిని ప్రపంచంలోని పలు యూనివర్సిటీలకు అందించేందుకు కృతనిశ్చయంతో ఉంది.

Books for reviews may be sent to the postal address:
"BHOOPATHI SADAN" 3-6-716, Street :12, Himayathnagar,
Hyderabad-500029, Telangana.
Mob: +91 8686 66 4949 email: trcjts@gmail.com

Subscription:

- Individual (India) : Rs. 250/issue;
- Institution (India) : Rs. 400/issue;
- Foreign Individual : US$ 65/issue;
- Foreign Institution : US$ 70/issue;

- Annual Subscription Rs. 800/-
- Annual Subscription Rs. 1,500/-
- Annual Subscription US$ 260
- Annual Subscription US$ 280

ACCOUNT DETAILS:
A/C Name :
Telangana Resource Centre
Bank Name :
Telangana Grameena Bank
A/c. No. : 79009067970
IFSC No. : SBIN0RRDCGB;
Branch Code : 229

దేశంలో విలువైన విద్యా విధానం రావాలి

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్

క్లాస్‌రూమ్‌కే విద్య పరిమితం కాకూడదు..

దేశాభివృద్ధికి నాణ్యమైన విద్య ఎంతో అవసరమని, మంచి విద్యా విధానంతోనే సమాజంలో గుణాత్మకమైన మార్పు వస్తుందని చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్, బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ పేర్కొన్నారు. బాలచెలిమి పిల్లల వికాస పత్రిక ఆధ్వర్యంలో బాలచెలిమి ప్రచురించిన హైదరాబాద్ బడి పిల్లల కథలు ఆవిష్కరణ సభ సీతాఫల్‌మండిలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో జరిగింది. సీహెచ్.మల్లేశం అధ్యక్షత వహించిన ఈ సభలో ముఖ్య అతిథిగా చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్, విశిష్ట అతిథిగా ఎన్‌బీటీ చైర్మన్ పత్తిపాక మోహన్, శ్యామల్‌రాజ్, కేంద్ర బాలసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ పాల్గొన్నారు.

క్లాస్‌రూమ్‌కే విద్య పరిమితం కావద్దు:

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్

క్లాస్‌రూమ్‌కే విద్య పరిమితం కాకూడదని మణికొండ వేదకుమార్ పేర్కొన్నారు. పరీక్ష విధానంలో ప్రశ్నలకు జవాబులు రాయడం, మార్కులు తెచ్చు కోవడం తర్వాత ఎంసెట్‌కు వెళ్లడమే ఎక్కువగా జరుగుతుందన్నారు. అందరూ ఇంజినీరింగ్, డాక్టర్లే అయితే చదువు ఎవరు చెప్పాలన్నారు. ఎంసెట్‌లకే పరిమితమైన విద్యా విధానం నుండి మనం బయట పడాల్సిన అవసరం ఉందన్నారు. తమ చిన్నతనంలో లైబ్రరీకి వెళ్లి చదువుకున్నామని, ఆ కాలంలో పాఠశాల నుండి ఇంటికి రాగానే ఆటలు బాగా ఆడుకున్నట్లు తెలిపారు. ఇతర పిల్లలతో మాట్లాడుకునే పద్ధతి క్రమంగా తగ్గిపోయిందన్నారు. పిల్లలను మిషన్‌లుగా తయారు చేసి సమాజానికి పంపిస్తే వాళ్లు సమాజంలో ఎలా జీవిస్తారన్నారు. చిన్నప్పటి నుండే సమాజంతో కలిసి జీవించడం అనేది చాలా ముఖ్యం అన్నారు. పోటీ ప్రపంచంలో పిల్లలను ఆడిపించే సమయం కూడా తల్లిదండ్రులకు లేదన్నారు.

ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తాను 15 దేశాలు తిరిగానని, ఆయా దేశాల్లో ఎన్నో అద్భుతమైన పుస్తకాలను ప్రభుత్వమే ప్రచురించి అందజేసినట్లు తెలిపారు. అన్ని రకాల పిల్లల పుస్తకాలతో చిల్డ్రన్స్ బుక్ ఫెయిర్ నిర్వహించేలా ప్రయత్నాలు చేద్దామన్నారు. పిల్లలకు ఆటలు ఆడుకునే అలవాటు ఉన్నట్లయితే పుస్తకాలు చదివే అలవాటు కూడా ఉంటుందన్నారు. కజకిస్తాన్‌లో ఎలాంటి మనుషులు ఉంటారు, అమెరికాలో ఎలాంటి పద్ధతులు ఉంటాయి అనేది పుస్తకం చదివి తెలుసుకోవచ్చన్నారు. చక్కని పుస్తకాలు చదవడం ద్వారా ప్రపంచంలోని చాలా విషయాలు తెలుసుకోచవ్చన్నారు. పుస్తకం కుగ్రామానికి వెళ్లవలసిన అవసరం ఉందన్నారు. పఠనంపై భారతదేశం దృష్టి సారించి చక్కని పుస్తకాలను పిల్లలకు అందించాలన్నారు. ఇతర పుస్తకాలు చదవకుండా పాఠ్యాంశాల మీదనే ఆధారపడ్డ పిల్లలు భవిష్యత్‌లో ఏవైనా ఇబ్బందులు వస్తే తట్టుకోలేని పరిస్థితి వస్తుందన్నారు. అలాంటి వాళ్లు ఎప్పుడు ఇతరుల మీద ఆధారపడే ఉంటారన్నారు. ఇతర విషయాలన్నీ అధ్యయనం చేసినవాళ్లకు మంచి క్రియేటివ్ టాలెంట్ వస్తుందని, వాళ్లు ఎలాంటి ఒత్తిడిని అయినా తట్టుకొని విజయం సాధిస్తారన్నారు. బాల్యంలో పిల్లాడి హృదయాన్ని అర్థం చేసుకొని రచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అటువంటి రచనలకు ప్రజాదరణ ఉంటుందని, అలాంటి పుస్తకాలతో పిల్లలు స్నేహ హస్తాన్ని అందిస్తారని చెప్పారు. చక్కని లైబ్రరీలు నిర్వహించే ఏర్పాటు చేద్దామని, మంచి పుస్తకాలు అందించే బాధ్యతను తీసుకోనున్నట్లు తెలిపారు. ఎప్పుడైతే పిల్లలు పాఠ్యాంశాలతో పాటు

ఇతర పుస్తకాలు చదువుతారో అప్పుడే అన్ని రంగాల్లో ఆల్‌రౌండర్‌గా ఉంటారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించిన వ్యక్తి మైక్రోస్టాఫ్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్లారని, అదే క్లాస్‌లో 60 శాతం మార్కులతో పాస్ అయిన విద్యార్థి కూడా అదే ఇంటర్వ్యూకి వచ్చినట్లు తెలిపారు. మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఇద్దరు ఒకేచోట జాయిన్ అయినట్లు తెలిపారు. అక్కడ సెలక్షన్‌లో భాగంగా ఇంటర్నేషనల్ బిగ్ టాస్క్‌లో 60 మార్కులు వచ్చిన వాడిని టీమ్ లీడర్‌గా చేస్తే గోల్డ్‌మెడల్‌గా ఎంపికైన వారిని టీమ్‌లో సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. టాపర్‌కు పరీక్షలు రాయడం, మార్కులు తెచ్చుకొనే జ్ఞానం ఉంది కానీ టీమ్‌ను నడిపే జ్ఞానం అతనికి లేద న్నారు. తోటి మిత్రులతో కలిసి పనిచేసే జ్ఞానం అతనికి రాలేదన్నారు. అన్ని విషయాల్లో పాలుపంచుకుంటూ ఉండే విద్యార్థులే అగ్రభాగాన నిలుస్తారని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల పిల్లలు చాలా అదృష్టవంతులని, అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. నిజ జీవితాన్ని చూసేది ప్రభుత్వ పాఠశాల పిల్లలే అని, ఎలాంటి కష్టమొచ్చినా తట్టుకునే శక్తి ఒక్క ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకే ఉంటుందన్నారు. ప్రైవేటు పాఠశాలలో కంటే గొప్ప ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నట్లు తెలిపారు. కథలు ఎలాంటివి ఉండాలనే దానిపై కార్యశాల నిర్వహించి మంచి కథలను ఎంపిక చేశామని, చిన్న చిన్న లోపాలుంటే తప్పకుండా సవరించుకుంటామన్నారు. ఎన్నుకున్న కథలనే పుస్తకంలో అచ్చువేసినట్లు తెలిపారు. బడి పిల్లల కథల పుస్తకానికి ఆయా జిల్లాల ఆర్టిస్టులే బొమ్మలు గీశారని తెలిపారు. కథలకు తగ్గట్టు బొమ్మలు గీయడం అభినందనీయం అన్నారు.

పిల్లలకు నచ్చిన పుస్తకాలు చదవాలి : ఎన్‌బీటీ చైర్మన్ పత్తిపాక మోహన్

పిల్లలు అల్లరి చేయకుంటే అర్థంలేదని, నేటి పిల్లలకంటే చిన్నతనంలో తామే ఎక్కువగా అల్లరి చేసినట్లు ఎన్‌బీటీ చైర్మన్ పత్తిపాక మోహన్ పేర్కొన్నారు. ఇప్పటి పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి రాగానే టీవీలు చూడటం, సెల్‌ఫోన్లలో ఆడుకుంటున్నట్లు తెలిపారు. కానీ తమ జనరేషన్‌లో ఇంటికి వెళ్లగానే ఎన్నో ఆటలు ఆడుకున్నట్లు తెలిపారు. తాము ఎంత పేద వాళ్లమైనా చక్కని పుస్తకాలు ఇంట్లో ఉండేవని, వాటిని ఖాళీ సమయంలో చదువుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు నలభై నిమిషాల క్లాస్ విని పరీక్ష రాస్తే వందకు వంద మార్కులు తెచ్చుకుంటున్నారని, పిల్లలే రచయితలై రచనలు చేస్తే ఇంకెన్ని మార్కులు సాధిస్తారోనన్నారు. పిల్లలకు నచ్చిన పుస్తకాలు చదవాలన్నారు. తమ పాఠశాల టెక్స్ట్‌బుక్స్‌తోపాటు ఇతర సాహిత్య పుస్తకాలను చదివి జ్ఞానం పెంచుకోవాలన్నారు. హైదరాబాద్ కథలనగానే తనకు రెండు కథలు గుర్తుకు వస్తాయన్నారు. టి.రాము, ఓపెన్ చదువు..ఇవి చాలా సాధారణ అంశాలతో పిల్లలు రాసిన కథలన్నారు. ఇవి అమలైతే జ్ఞాన తెలంగాణ, జ్ఞాన భారతదేశంవైపు అడుగులు వేస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 200 మంది పిల్లల పుస్తకాలు అచ్చువేసుకుంటే, ఒక్క తెలంగాణ నుంచి 10 పుస్తకాలను అచ్చువేసిన ఏకైక సంస్థ బాలచెలిమి సంస్థ అని కొనియాడారు. ఇంతటితో ఈ పుస్తకాల కథ అయిపోలేదని, వీటిని ఇతర భాషల్లోకి కూడా అనువదించనున్నట్లు తెలిపారు. పిల్లలు రాసిన కథలు రేపటి రోజున స్కూల్ పాఠ్యాంశాల్లో వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు.

నిజాయితీతో కథలు రాయాలి :
కేంద్ర బాలసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ

హేతుదృక్పథంతో నిజాయితీతో కథలు రాయాలని, అప్పుడే పిల్లలకు గొప్ప తెలివితేటలు లభిస్తాయని కేంద్ర బాలసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ పేర్కొన్నారు. తాము చాలా పాఠశాలలకు వెళ్లామని, చాలా మంది పిల్లలు కథలు రాయడానికి ముందుకు రావడం చాలా సంతోషదాయకం అన్నారు. జీవితంలో కనిపించే ప్రతి వస్తువు మనకు సబ్జెక్టు అన్నారు. పిల్లలకు పలు కథలు చెప్పి వారిని ఇన్‌స్పైర్ చేశారు.

సాహిత్యానికి ఎంతో మంది ప్రభావితులు అవుతారు : గిరిజ

సాహిత్యానికి ఎంతో మంది ప్రభావితులు అవుతారని గిరిజ పేర్కొన్నారు. ఈ సాహిత్య సభలో రచయితలు రావడం, తాను కూడా పాల్గొనడం చాలా గర్వంగా ఉందన్నారు. ఏజీ ఆఫీసులో పనిచేసి రిటైర్డు అయిన పీఎస్.లక్ష్మీగారు భారతదేశంలోని యాత్ర స్థావరాలతో పుస్తకం రాసి ఎంతో ప్రాచుర్యం పొందినట్లు తెలిపారు. అమ్మమ్మ చెప్పిన పుస్తకం చాలా పాపులర్ అయిందని, అమ్మమ్మ లేని లోటును ఆ పుస్తకం తీర్చిందన్నారు.

కథలతోపాటు టెక్స్ట్‌బుక్స్ చదవాలి : శ్యాములు రాజ్

మంచి కథల్లో ఎంతో జ్ఞానం ఉందని, ప్రతి ఒక్క విద్యార్థి సాహిత్యపరమైన పుస్తకాలు చదవాలని శ్యాములు రాజ్ పేర్కొన్నారు. పాఠశాల టెక్ట్స్‌బుక్స్‌తోపాటు మంచి కథల పుస్తకాలను చదవాలన్నారు. చాలా మందికి కథలు చదవడం అలవాటు ఉంటుందని, సాహిత్య పుస్తకాల్లో ఎంతో జ్ఞాన సంపద దాగి ఉంటుందన్నారు.

లక్ష్యం ఎంచుకుంటే వదలొద్దు : సీహెచ్.మల్లేశం

సభకు అధ్యక్షత వహించిన సీహెచ్.మల్లేశం మాట్లాడుతూ లక్ష్యం ఎంచుకుంటే దాన్ని వదిలిపెట్టే ప్రసక్తే ఉండకూడదని అన్నారు. గోల్‌ను సాధించేవరకు విశ్రమించకుండా కృషి చేయాలన్నారు. స్వచ్ఛ హైదరాబాద్, స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ భారతదేశాన్ని తయారు చేసుకోవాలంటే పిల్లలు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. లక్ష్యాన్ని చేరాలంటే మన మార్గాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కఠినమైన నిర్ణయాలతోనే విజయం సాధిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ హెడ్మాస్టర్ కృష్ణమూర్తి, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు నర్సింహారెడ్డి, లక్ష్మీ, భాస్కర్, రామకృష్ణ, రమేష్, జయంతి పాల్గొన్నారు.

– రామకృష్ణ కాంపాటి,
m : 9866168863
e: ramakrishna.praja@gmail.com

మానవీయ విలువల ఇతివృత్త కథా సంపుటి

వెంట వచ్చునది ఏది?

"శరీరం నిండా గుచ్చుకున్న ముళ్లు రాలిపోతున్నాయి. తగలబడుతున్న మనశ్శరీరాలు తడిదేరుతున్నాయి. దశాబ్దాలుగా ఘనీభవించిన అభిప్రాయాలు కరిగి, కమనీయ పుష్పాలుగా వికసిస్తున్నాయి."

- పశ్చాత్తాపానికి లోనయిన ఓ తండ్రి హృదయ స్పందన

"ఒక్కోరాత్రి గడిచేకొద్దీ ఆందోళనలు అధికమై మెదడులో అగ్నిపర్వతాలు బద్దలవుతాయి. పిచ్చిపిచ్చి ఆలోచనలేవో చితి మంటల్లా ఎగసిపడుతూంటాయి. నిద్రపట్టదు. ఈ పరిస్థితుల్లో రాత్రి పడుకోబోయే ముందు తలతీసి డీప్‌ఫ్రీజర్‌లో పెట్టటం అలవాటు చేసుకున్నారు.. పంచేంద్రియాల పనితనం మంచులో కప్పబడి పోవటంతో తుపాన్లు, అగ్నిపర్వతాల బెడద లేని విచిత్రలోకంలో అప్పుడు నిద్రపోగలుగుతున్నారు"

- కార్పొరేట్ కళాశాలలో విద్యార్థుల మానసికస్థితి



ఇలాంటి మెరుపులాంటి వాక్యాలు 'వెంట వచ్చునది' కథా సంకలనంలో అడుగడుగునా తళుక్కున మెరుస్తూంటాయి. అభిరుచి ఉన్న కవి కావటం ఎమ్వీరామిరెడ్డికి కలిసొచ్చే అంశం. ప్రవాహవేగంతో కథ సాగటమే కాదు. వాక్యాలు పదునుదేరి భావగర్భితంగా సాగుతూంటాయి. అలాగే తనకు చిరపరిచితమైన వ్యక్తుల్ని.. పరిసరాలను కథలకు ఇతివృత్తంగా ఎంచుకోవటంతో కథావరణానికి సహజత్వం అబ్బింది.

ఇక కథలోకి వెళదాం..

రైతుకు, తన పంట పొలానికి నడుమ బంధం అనిర్వచనీయమైంది. ఈ ఆత్మీయ బంధాన్ని రామిరెడ్డి చాలా కథల్లో ప్రభావవంతంగా చెప్పుకొచ్చారు. 'పొలాల తలాపున' కథనే తీసుకుందాం. ఇందులో గొంతుకేన్సర్‌కు చికిత్సపొందుతున్న పానకాలుకు ఆస్పత్రి పరిసరాలు అంతగా రుచించవు. ఊపిరందక ఉక్కిరిబిక్కిరయినట్టుగా అనిపిస్తుంది. ఎప్పుడెప్పుడు అక్కడ నుంచి పారిపోదామా అని తపిస్తాడు. "నాకు దేముడు అన్నీ ఇచ్చాడు. రత్నాల్లాంటి ఇద్దరు కొడుకులు, కన్నబిడ్డల్లాంటి కోడళ్లు, బంగారంలాంటి మనవలు, మనవరాళ్లు, నన్ను ప్రాణంగా చూసుకునే ఇల్లాలు.. ఇలా అన్నీ అందరూ నన్ను కళ్లల్లో పెట్టుకుని చూస్తున్నారు. ఇప్పుడు నాకు సంతృప్తిగా జీవించాలనుంది' అని చెప్పి సొంత ఊరికి వెళ్లిపోతాడు. పొలంలో అడుగుపెట్టగానే అతనిలో కొత్త జీవం పుట్టుకొస్తుంది. "అయిన వాళ్ల ఆత్మీయ కుశల ప్రశ్నలు, జన్మభూమి గాలీ వెలుతురు కొత్త రక్తం ఎక్కించాయి. పోయిన శక్తి తిరిగివచ్చినట్టయింది" అంటూ పంట పొలంతో రైతుకున్న అనుబంధాన్ని చెప్పుకొస్తారు. గుండె బరువెక్కుతుంది.

'రేవటి బీడు' కథలోనూ అంతే. ల్యాండ్‌పూలింగ్‌లో భాగంగా పొలాన్ని పోగొట్టుకున్న శ్రీను... "ప్రభుత్వానికి నా వంతు కానుకగా భూమి ఇచ్చేశాను. తల్లి వేరు తుంచుకున్నాను. మట్టిబంధం తెంచుకున్నాను. రేపట్నుంచి ఎలా బతకాలి. తెల్లారి లేచి ఏ దిక్కుగా నడవాలి" అని పత్తి చేనును పొదివి పట్టుకుని గుండెలవిసేలా రోదిస్తాడు. శ్రీను పత్తిసాగు చేస్తూంటాడు.

రచయిత ఏదో స్వచ్ఛంద సంస్థలో చేరతాడు. ప్రభుత్వం అమరావతి రాజధాని ప్రకటన చేయగానే వారి స్నేహితుడు రమేష్ పొలం అమ్మేసి డబ్బు చేసుకుంటాడు. మిగతా ఇద్దరు ల్యాండ్ పూలింగ్‌లో పొలాలను వదులుకోవలసి వస్తుంది. "రాత్రికి రాత్రి మా ఊరి భూములకు రెక్కలొచ్చాయి. పొలాలు కోట్లకు పడగలెత్తాయి. మారుమూల గ్రామాల్లో రియల్ ఎస్టేట్ ఆఫీసులొచ్చాయి. కార్లు క్యూ కట్టాయి. దళారుల్ని ఆకస్మిక అదృష్టం వరించింది" అంటూ రచయిత పాఠకుణ్ని కథలోకి లాక్కుంటాడు. ఆ తర్వాత పరిస్థితులు మారిపోతాయి. రమేష్ భార్యను నిర్లక్ష్యం చేసి ఓ టీవీ నటికి చేరువవుతాడు. చివరకు ఆ నటి ఆత్మహత్యకు పాల్పడటంతో నేరం రమేష్ పైన పడుతుంది. అకస్మాత్తుగా వచ్చిపడే సంపద మనిషిని ఒక్కసారిగా స్థితిపరుణ్ని చేయటమే కాదు. అతన్ని కొత్త వ్యసనాలకు చేరువ చేస్తుంది. లేనిపోని బలహీనతలవైపు పురిగొల్పుతుంది అన్న విషయం అర్థమవుతుంది. భూసమీకరణలో రైతులు కొందరు పొలాలను స్వచ్ఛందంగా ఇస్తే మరి కొందరి పొలాలను ప్రభుత్వమే నిర్బంధంగా తీసుకోవటం వంటి అంశాలను రచయిత ఇందులో

సృజించారు.

'త్రిశంకు స్వప్నం' అన్న మరో కథలో రాజధాని ప్రకటనతో మారిన పల్లె స్వరూపాన్నే కాదు. మానవసంబంధాలు విచ్ఛిన్నం కావటం వంటి అంశాలను చిత్రించారు. ఒక్కసారిగా పంట పొలాలకు గిరాకీ వచ్చి కొందరు అకస్మాత్తుగా శ్రీమంతులు కావటం, కార్లజోరు పెరగటం వంటి పరిణామాలు పల్లెలో చోటుచేసుకుంటాయి. నిన్న మొన్నటి వరకూ సఖ్యంగా ఉన్న అన్నదమ్ముల మధ్య కక్షలు చెలరేగి అన్ననే తమ్ముడి తలతెగనరకుతాడు.

అమరావతి రాకతో ఉపాధి కోల్పోయిన రోజుకూలీ అగచాట్లను 'సమిధ' అని అతి చిన్న కథలో ఆసక్తికరంగా వివరించారు. పట్టణంలో వివిధ వృత్తుల్లో ఉన్న అరాచకాన్ని ఇందులో చూపించారు. తనను తాను కోల్పోకుండా ఒక ఆకుపచ్చ జీవితాన్ని తొడుక్కోగల అవకాశాలు మృగ్యమేనని ఈ కథ చాటిచెబుతుంది.

× × ×

'రుణాత్మకం' రియల్ ఎస్టేట్ వ్యాపారుల మనస్తత్వాన్ని పరిచయం చేసే కథ. బాలరాజు అప్పు తీర్చే దారిలేక సతమత మవుతూంటాడు. తనకు మంచి భూమి చూపిస్తే కమిషన్ మొత్తాన్ని అప్పులో తెగ్గొడతానన్న ప్రతిపాదన చేస్తాడు శివరామయ్య. దాంతో బాలరాజు ఆయనను వెంటబెట్టుకుని కారులో బయలుదేరతాడు. మార్గమధ్యంలో కారు కుంటలోకి జారిపోయి శివరామయ్య ప్రాణం మీదకు వస్తుంది. మృత్యుముఖంలో ఉన్న ఆయనను ఆస్పత్రికి చేర్చటానికి చాలా శ్రమ తీసుకుంటాడు బాలరాజు. స్వస్థత చేకూరాక శివరామయ్యలో మునుపటి మనిషి మేల్కొంటాడు. తనకు ప్రాణభిక్ష పెట్టాడన్న కనీస కృతజ్ఞతయినా చూపకుండా మనిషిని పంపి అప్పుతీర్చమని ఒత్తిడి చేస్తాడు. ఇల్లు అమ్మేసి బాకీ తీర్చటానికి సిద్ధమవుతాడు బాలరాజు. "రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించిన తర్వాత.. అంతకు ముందు రూపాయి వడ్డీ వసూలు చేసే వ్యక్తి దాన్ని రెండు రూపాయలకు మార్చాడు. ఎనిమిది వేల పైచిలుకు మొత్తానికి నోటు రాయించుకున్నాడు. ఎన్నోసార్లు పదివేలు, పాతిక వేలు అప్పుఇచ్చి వడ్డీ లేకుండా చేసిన వ్యక్తి, పాత బాకీ చెల్లించమంటూ ఒత్తిడి చేస్తున్నాడు" అంటూ శివరామయ్య పాత్రను పరిచయం చేస్తారు. మునుపటి స్వభావానికి భిన్నంగా ఫక్తు డబ్బుమనిషిగా ఎలా మారాడో చెప్పుకొస్తారు. కుంట నుంచి శివరామయ్యను రక్షించే క్రమంలో బాలరాజు పడిన అవస్థను వర్ణించటంలో కథకుని ఊహాబలం ముచ్చటేస్తుంది.

రచయిత
ఎమ్వీ రామిరెడ్డి

× × ×

ప్రయోగాత్మక కథల్లోనూ ప్రత్యేక ముద్ర

కంకాళశాల, మృగయా కథల్లో రచయిత విభిన్నమైన ప్రయోగం చేశారు. కార్పొరేట్ కాలేజిని 'కంకాళశాల' అంటారు. ఆ వాతావరణంలో ర్యాంకుల కోసం పోటీలో విద్యార్థులెంత దీ(హీ)నంగా బతుకుతారో వ్యంగ్యాత్మకంగా వివరిస్తారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల హింస వారిని మానసికంగా చిత్రవధ చేస్తున్న తీరు చదువుతుంటే మనసు కరిగి కన్నీరవుతుంది. అక్కడ ఉండేది విద్యార్థులు కాదు. కేవలం అస్థిపంజరాలేనని చెప్పటం చిత్రమైన ఊహ. వాళ్లవి ఆత్మహత్యలుకావు. కేవలం ప్రాయోపవేశాలే అనటం గమ్మత్తయిన వ్యాఖ్యానం.

ఆడపిల్లల జీవితాల్లో మగాళ్లు మృగాల్లా ఎలా వ్యవహరిస్తారో, భయకంపితుల్ని చేస్తారో వివరించే కథ 'మృగయా'. ఇది ఒక్క స్వప్న కథ కాదు. మన చుట్టూ ఉన్న ఎందరో ఆడపిల్లల హృదయ విదారక విషాద గాథ. పైకి మృదువుగా మాట్లాడే సమీప కుటుంబ సభ్యులు, పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, ప్రేమిస్తానని వెంటపడే వాళ్లు, పెళ్లాడేవాళ్లు, ఒక్కొక్కరు ఒక్కో

ఒక్కో రకంగా ఆమె శరీరంతో ఆడుకునే తీరు ఒళ్లు గగుర్పొడుస్తుంది. పాము, తోడేలు, ఎలుగుబంటి, హైనా, హిప్పో, ఖడ్గమృగం గుంటనక్క పాత్రలతో కథ చెప్పిన తీరు ఆకట్టుకుంటుంది.

× × ×

ఈ సంకలనంలో ఆలోచింపచేసే కథగా 'తాలు'ను చెప్పుకోవచ్చు. కంప్యూటర్ ఏమైనా చేయగలదు.. కానీ గిద్దెడు బియ్యం గింజలను పండించగలదా? కొత్త యాప్ సృష్టించి.. సన్మానం అందుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను.. వ్యవసాయ దారుడయిన అతని తండ్రి అడిగిన ఈ ప్రశ్న ఆలోచింప చేస్తుంది. సాంకేతిక ప్రగతి అని జబ్బలు చరుచుకునే ప్రభుత్వాలు ఈ విషయంపైన మనసు పెడితే రైతు సమస్యలకు కొంతవరకయినా సమాధానం దొరుకు తుంది. అప్పుడే నిజమైన ధాన్యం రాశులు పండుతాయి అన్న సందేశం ఇందులోకథలో కనిపిస్తుంది. "ఎన్ని యాపులైనా ఒక యాపచెట్టుకు సమానం కాదు. మనిషికి గుప్పెడు గింజలు పెట్టగలిగితేనే ఏ టెక్నాలజీకైనా అర్థం, పరమార్థం"అనేది ఆచరణీయమైన జీవనసత్యం.

కొందరు కేవలం పనిమనుషులుగా మిగిలిపోరు. తాము పని చేసే ఇళ్లలో పిల్లల్ని సొంత తల్లికంటే ఎక్కువగా సాకుతారు. పిల్లలికి కష్టాలొచ్చినప్పుడు గుండెల్లో పెట్టుకోవటమే కాదు. నీవెనుక నేనున్నాను అన్న భరోసా ఇస్తారు. అలాంటి తల్లి సుశీలను పరిచయం చేసే ప్రయత్నమే 'కాపలా తల్లి' కథ. ఇందులో వర్ణిత తన పాతజ్ఞాపకాలను తడుముకుంటూ.. సుశీలను వెతుక్కుంటూ వస్తుంది. ఆమె ఇంటికి చేరటంతో కథ ముగుస్తుంది. ఇరువురి మధ్య భావోద్వేగాల ప్రస్తావన ఉండదు. ముగింపు భిన్నం.

'ముళ్లపూలూ' చాలా ఇళ్లలో సాగే కథే. మగపిల్లలపైన గంపెడాశలు పెట్టుకోవటం..ఆడపిల్లల తెలివితేటల్ని తక్కువ చేయటం, వారి ప్రతిభాపాటవాలను గుర్తించకపోవటమే కాదు. చులకన చేయటం మనం వింటున్నదే. ఈ కథలో మగపిల్లలు..

నిజానికి సొంత బిడ్డలు కాదు. చనిపోయిన సోదరి పిల్లలను తెచ్చుకుని పెంచుకుంటాడు రచయిత. కుమార్తె సుమ అభిప్రాయాలను గౌరవించడు. స్కాలర్‌షిప్పులతో చదువుకుంటూ అంచెలంచెలుగా ఎదిగి సోషల్‌వర్క్ పిజీ పూర్తిచేసి ప్రతిభావంతురాలిగా రాణిస్తున్నా ఖాతరు చేయడు. చివరికి పరిస్థితులు అతనికి కనువిప్పు కలిగేలా చేస్తాయి.

మంత్రులు, ఇంజినీర్లు, గుత్తేదారుల మధ్య అనైతిక పొత్తును 'కొండ అద్దం మందు' మనకు పరిచయం చేస్తుంది. క్షేత్రస్థాయిలో అంశాలతో పరిచయం లేకపోతే ఇలాంటి కథలను రాయటం కష్టం. అసలంటూ లేని కొండను, ఫ్లైఓవర్‌ను కాగితంలో చూపించి ఎవరికి వారు ఎలా లబ్ధిపొందారో, ప్రత్యర్థులను ఎలా దెబ్బతీశారో ఈ కథ గొప్పగా చెబుతుంది.

× × ×

స్ఫూర్తిదాయక కథల్లోనూ వైవిధ్యం

ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని దాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన రిటైర్డ్ ఉద్యోగిని 'మొగ్గలు వికసించే చోటు'లో చూపిస్తారు. 'బ్లూవేల్' ప్రభావంతో తనను తాను హింసించుకుని ఆస్పత్రిపాలయిన తన మనవణ్ని అక్కడకు తీసుకొచ్చి ఆయన సంస్కరిస్తారు. గోటీబిళ్ల, గోలీలాట, బొంగరాలాట, ఏడుపెంకులాట లాంటి ఆటలను, పతంగులు ఎగరవేయటం, ఈత కొట్టడం, చెక్కభజన వంటి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తారు. పిల్లల్లో అంతర్గత శక్తులు తేజోవంతమైతే.. వారు ఏవిషయమైనా ఇట్టేపట్టేస్తారు. ఆటపాటల్లో నిమగ్నమయ్యే విద్యార్థులు చదువుల్లో రాణిస్తారని, నెంబర్ ఒన్‌గా నిలుస్తారని కూడా అర్థమయ్యేలా విడమరిచి చెబుతారు. మనవడిలో కలిగిన మానసిక మార్పు అతన్ని కార్పొరేట్ కళాశాలను వదిలి అదే ప్రభుత్వపాఠశాలలో చదివేలా చేస్తుంది.

నాలుగ్గోడల మధ్యనా విద్యార్థిని బంధించి చదువుల పేరుతో వారిని బంధిస్తే ఎప్పుడెప్పుడు ఆ గోడలను బద్దలు కొట్టుకుని బయట పడాలా అనే ఆలోచిస్తారు తప్ప వారికి చదువుపైన మనసు లగ్నం కాదని... 'శిలలు' కథ చదివితే అర్థమవుతుంది.

'చిగురించని వసంతం' కథలో.. భూమిక చురుకైన అమ్మాయి. సాటి మనుషుల పట్లే కాదు. మూగజీవాల పైనా సానుభూతి చూపుతుంటుంది. శేఖర్‌కు ఆమెను గాఢంగా ప్రేమిస్తాడు. నిజానికి ఆమె నాయకత్వ లక్షణాలే నచ్చి ప్రేమలో పడినా, అనాథ ఆశ్రమంలో పెరిగిన అనిల్‌పై ఆమె ప్రేమాభిమానాలు వ్యక్తం చేయటం అతనికి నచ్చదు. చివరకు ఆమెను అర్థం చేసుకుని పశ్చాత్తాపానికి గురయినా ఆమె తిరస్కరిస్తుంది.

హంగేరికి చెందిన కెరోలీ టాకాక్స్ స్ఫూర్తితో.. పారా ఒలంపిక్స్‌లో పోటీకి సిద్ధమైన ఒక యువకుని గాథను ఆధారంగా చేసుకుని 'అవయవాలు మొలిచిన మనిషి' కథ అల్లారు.

సత్‌సంకల్పం అంటూ ఉండాలేగానీ ఏ పనైనా పూర్తికావటం తథ్యం. 'దాహనీగిసిదరప్పా' కథలో.. దుబారా అవుతున్న ప్రభుత్వ నిధులను మళ్లించి ఓ గ్రామంలో దాహార్తిని తీర్చటానికి ఇద్దరు వ్యక్తులు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసి తమ మానవీయతను చాటుకుంటారు.

పురిటినొప్పులతో విలవిలలాడుతున్న గిరిజన మహిళను రక్షించటం అన్న మానవీయ స్పందన ఒక వైపు, మావోయిస్టులను ఎదుర్కోవటం అన్న కర్తవ్యనిర్వహణ మరో వైపు సమాంతరంగా సాగి 'పురిటినొప్పులు' కథ సస్పెన్స్ సినిమాలా సాగుతుంది. విలువైన భూమిని కాజేసేందుకు ఓ రాజకీయనేత పన్నిన కుట్రలో భాగంగా సుపారీ తీసుకున్న ముగ్గురు వ్యక్తులు అవతల వ్యక్తిని బెదిరించి విజయవంతంగా సంతకాలు పెట్టించుకుని తిరిగివస్తారు. ప్రమాదంలో చిక్కుకుంటారు. వాళ్లను రక్షించిన వ్యక్తి మరెవరో కాదు. తాము మోసం చేసిన వ్యక్తే కావటం గమనార్హం.

అజరామరం, మనిషిజాడ, బిందువు కవితా సంపుటాలు, వెన్నెలో లావా కథాసంపుటితో ఇప్పటికే ప్రసిద్ధుడైన ఎమ్వీరామిరెడ్డి ఈ రచనతో పాఠకుల్లో బలమైన ముద్ర వేసుకున్నారు. ఇప్పటికే ఈ కథా సంపుటికి పలు అవార్డులు వచ్చాయి. అభివృద్ధి కోసం భూములు కోల్పోయిన అన్నదాతలకు ఈ పుస్తకాన్ని అంకితమివ్వటం ఆయన చిత్తశుద్ధికి, మానవీయ హృదయానికి అద్దం పడుతుంది. రాబోయే రోజుల్లో ఈ రచయిత కలం మరిన్ని వెలుగులు విరజిమ్ముతూ పైపైకి సాగుతుందని ఆశిద్దాం.

– శ్రీసాయిపల్లవి
m : 9985050134

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

'కవి బ్రహ్మ' పోతన

పోతన

లక్కమాంబ పుణ్య లక్షణంబుల సొంపు
కేసనార్య ఒడిని కేలియాడె
సహజ పండితుండు సర్వోత్తముడనగ
భాగవతము కూర్చె భక్తి యుతము

జనులు మెచ్చునటుల అనుగు జానపదము
రసన లందు ఒలుక రమ్య తరము
కావ్య మాల గూర్చి కైదండ లొనరించి
పరమ భక్తుడనగ వరము నొందె

– ధూళిపాళ అరుణ
m :8712342323

చందాదారులుగా చేరండి... చేర్పించండి...

పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్ ఏడేళ్ళు పూర్తి చేసుకొని ఎనిమిదవ సంవత్సరంలోనికి అడుగు పెడుతున్నది. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది.

స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, చరిత్ర, సాహిత్యం, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యావరణం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరి స్తున్నది కథ, కవితలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు విశ్లేషణలతో మీ ముందుంచుచున్నాము. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళు తుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ
– మణికొండ వేదకుమార్
సంపాదకులు

చందా వివరాలు:

వార్షిక చందా	:	రూ. 300
2 సం॥లకు	:	రూ. 600

'దక్కన్ ల్యాండ్' పేరిట ఎంఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

చిరునామా :

DECCAN LAND :
"CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
Fax: 040-27635644 Mobile: 9030626288
E-mail:desk.deccan@gmail.com ww.deccanland.com

దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:

Name	: DECCAN LAND
Bank	: KOTAK MAHINDRA BANK
A/c No	: 7111218829
IFSC Code	: KKBK0007463
Branch Code	: 007463

వెలిగేచీకటి

చేతికున్న వాచీలో టైం చూసుకొని వెహికిల్ స్పీడ్ పెంచాను. ఎంత స్పీడు పెంచితే మాత్రం ఏం లాభం... ముందర సిగ్నల్ దగ్గర అయిదునిమిషాలైన ఆగక తప్పదు. ఇలాంటి ఇంకో నాలుగైదు సిగ్నల్స్ దాటుకుంటే గానీ ఆఫీసుకి చేరుకోలేను. ప్చ్... ఎంత తొందరగా ఇంట్లోంచి బయటపడినా ఈ రోడ్లమీద ట్రాఫిక్‌ని తప్పించుకొని ఆఫీసుకు చేరుకునేసరికి ప్రతిరోజూ ఆలస్యమే. భగవంతుడా! అసలీ హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యకి పరిష్కారమే లేదా? ఎం.ఎం.టి.ఎస్.లూ, మెట్రో రైల్... ఎన్నైనా సరిపోనంతగా రోజురోజుకీ పెరుగుతున్న జనం, రోడ్ల మరమ్మత్తుల విషయంలో విఫలమవుతున్న అధికారులు... హు... ఎవర్ని నిందించి మాత్రం ఏం ప్రయోజనం!

ఆలోచనలతోపాటే వేగంగా డ్రైవ్‌చేసుకుంటూ ఆఫీసుకు చేరుకునేసరికి సమయం పదిన్నర... అంటే ఇవాళ కూడా అరగంట ఆలస్యం. బాస్‌కి మళ్ళీ ఏదో ఓ కథ అల్లి చెప్పక తప్పదు, లేదంటే 'హాఫ్ డే సాలరీ' కట్ అంటూ అనవసరంగా బీపీ రెయిజ్ చేసుకుంటాడన్న సంగతి గుర్తొచ్చి తొందరగా వెహికిల్ స్టాండ్‌వేస్తుండగా జేబులోని సెల్‌ఫోన్ రింగయింది... డిస్ప్లేలో చూశాను. ఛోటుగాడి స్కూల్ నుంచి ఫోన్.. మొన్నే కద యానివల్ ఫీజ్ పే చేశాను కద, మళ్ళీ వీళ్ళు ఫోనెందుకు చేస్తున్నట్టు అనుకుంటూ ఫోన్ లిఫ్ట్ చేసి,

"హలో..." అన్నాను.

"గుడ్మార్నింగ్ సర్.. ఉజ్వల కాన్వెంట్ స్కూల్ నుంచి మీ అబ్బాయి అనురాగ్ క్లాస్‌టీచర్‌ని మాట్లాడుతున్నాను" అవతల్నించి ఓ తీయని కంఠం.

"గుడ్మార్నింగ్ టీచర్... చెప్పండి!" అన్నాను విషయమేమిటో అర్థం కాక.

"ఇవాళ పదకొండు గంటలకు సెకండ్ క్లాస్ వాళ్ళకు పి.టి.ఎం. (పేరెంట్-టీచర్ మీటింగ్) ఉంటుంది. మీ అబ్బాయి సెకండ్ క్లాస్ రిపోర్ట్‌కార్డ్ తీసుకోవడానికి మీ అబ్బాయితోపాటు మీరూ రావలసి ఉంటుంది..." అంది ఇంగ్లిషులో సౌమ్యంగా.

అప్పటికే ఆఫీసుకు అరగంట ఆలస్యంమైందన్న టెన్షన్‌లో ఉండగానే, మధ్యలో ఇదేమి గోల అన్న చిరాకుతో "ఏమిటి టీచర్! ఇప్పటికిప్పుడే ఫోన్ చేసి రమ్మంటే ఎలా రాగలం చెప్పండి. కనీసం ఒకరోజు ముందయినా ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని తెలియదా మీ స్కూల్‌వాళ్ళకి?" అన్నాను.

దానికి అవతల్నుంచి తమ తప్పేమీ లేదన్నట్లుగా, "అయ్యో... అదేమిటి సార్.. నిన్ననే మీ మొబైల్‌కి మెసేజ్ పంపించాం... అంతేకాదు మీ బాబు స్కూల్ డైరీలో కూడా రెండ్రోజుల్నించి మెన్షన్ చేస్తూనే ఉన్నాం కదా... మీరు చూసుకోలేదా?" అన్న వివరణతో డీలాపడిపోయాను.

నిజమే! నెలాఖరు రోజులవడంతో ఆఫీసులో పని ఒత్తిడివల్ల నాలుగైదు రోజుల్నించి ఛోటుగాడి గురించి పట్టించుకున్నదే లేదు కదా అనుకుంటూ, "అవునా...? అయాం సారీ టీచర్.. నేను చూసుకోలేదు. సరే.. తప్పక అబ్బాయితో కలిసి వస్తాను" అంటూ ఫోన్ పెట్టేశాను.

ఎలాగూ ఆఫీసుకు లేటయ్యింది కదా.. ఇవాళ్టికి లీవ్ పెట్టేస్తే సరి అనుకుని ఆఫీసుకు ఫోన్ చేసి ఏదో కారణం చెప్పి ఇవాళ రాలేకపోతున్నానంటూ ఇన్ఫర్మేషన్ ఇచ్చి వెహికిల్ స్టార్ట్ చేసి వెనక్కి మళ్ళించాను.

× × ×

ఇంటికెళ్ళి అనురాగ్‌ని తీసుకొని స్కూల్‌కి చేరుకునేసరికి సరిగ్గా పదకొండున్నర అయింది.

అనురాగ్‌తో కలిసి లోపలికడుగుపెట్టగానే ఎదురుగా గులాబీ రంగు చీరలో, అదే రంగులో ఉండిలేనట్టున్న చిన్ని స్టిక్కర్ బొట్టుతో ఏయిర్ హోస్టెస్‌లా సన్నగా, నాజూగ్గా ఉన్న టీచర్ ఎదుర యింది. అలా వదిలేసిన పొడగాటి సిల్కీ హెయిర్‌తో, పెదవులకు లిప్‌స్టిక్ దగ్గర్నించి, చెవులకు దుద్దులూ, చేతులకు గాజులూ.. కాళ్ళకి చెప్పులూ అన్నీ మ్యాచ్ అయ్యేలా అందంగా అలంకరించుకున్న ఆమె రూపం ఎవరినైనా ఇట్టే ఆకర్షించేలా వుంది. అప్పటివరకు ప్రసన్నంగా వున్న ఆమె ముఖం ఎందుకో మమ్మల్ని చూడగానే కోపంగా ఎర్రబడింది.

చిరునవ్వుతో ఆమె దగ్గరికెళ్ళి విష్ చేయబోతుండగా మధ్యలోనే అడ్డుకుని.. వెయిటింగ్ రూం వైపు చూపిస్తూ "మీరు కాసేపు ఆ గదిలో వెయిట్ చేయండి. మీతో ప్రత్యేకంగా మాట్లాడాలి" అంది సీరియస్‌గా.

ఆమె ఎందుకంత సీరియస్‌గా ఉన్నదో నాకేమీ అర్థం కాలేదు. వీడేమైనా తప్పుచేశాడా.. అన్న అనుమానంతో వాడి వంక చూశాను. టీచర్ తీరుకి భయపడినట్లున్నాడు పాపం. వాడి కళ్ళల్లో భయం స్పష్టంగా కన్పిస్తుంది. నెమ్మదిగా వెళ్ళి వెయిటింగ్ చైర్స్‌లో కూర్చున్నాం.

కూర్చోగానే ఛోటుగాడు, "డాడీ.. టీచర్ చాలా కోపంగా ఉన్నట్లుంది" అన్నాడు చెవిలో గుసగుసగా.

"అవును. ఎందుకంటావు? అన్నట్లు నీ రిపోర్ట్ కార్డులో మార్కులు బాగానే వచ్చాయి కదా?" అడిగాను నేను కూడా లోగొంతుకతో.

"ఐ డోంట్ నో డాడ్.. నేనైతే చూడనేలేదు... నాకెలా తెలుస్తుంది చెప్పు?" అన్నాడు వాడు అమాయకంగా చేతులు తిప్పుతూ.

"ఏమోరా ఛోటూ! మీ టీచర్ తీరు చూస్తుంటే, ఇవాళ నీతో పాటు, నాకు కూడా క్లాస్ పీకేటట్లుందనిపిస్తుంది" అన్నాను ఆవిడ బారినుండి ఎలా తప్పించుకోవాలా అని ఆలోచిస్తూ.

పదినిమిషాల తర్వాత అటెండర్ వచ్చి, "సార్! మిమ్మల్ని మేడమ్ గారు పిలుస్తున్నారు" అన్నాడు వినయంగా.

ఛోటుగాడితో పాటు తన చాంబర్‌వైపు కదిలాను. గుమ్మం దగ్గర మమ్మల్ని చూడగానే, "రండి... కూర్చోండి.." అంది గంభీరంగా ఎదురుగా ఉన్న చైర్స్‌వంక చూపిస్తూ.

కూర్చున్నాను. ఛోటుగాడు నా వెనకే వాళ్ళ టీచర్‌కి కనిపించకుండా నక్కినక్కి నిల్చున్నాడు.

"చూడండి! మీ అబ్బాయి అనురాగ్ మీద చాలా కంప్లయింట్స్ ఉన్నాయి. కాని, ముందుగా ఇతని ఎగ్జామ్స్, రిపోర్టుకార్డు సంగతి చూడండి. చూసిన తర్వాత ఇతనికి మేం ఏం నేర్పించాలో, ఎలా బోధించాలో మీరే తేల్చండి" అంటూ ఒక్కమాటలోనే సారాంశాన్నంతా వివరిస్తూ రిపోర్టుకార్డును నా ముందుకు తోసింది సీరియస్‌గా.

నాకిప్పుడు అర్థమయింది ఆమె ఎందుకంత కోపంగా ప్రవర్తిస్తుందో.

మౌనంగా రిపోర్టుకార్డు చేతిలోకి తీసుకొని సబ్జెక్ట్‌లవారీగా మావాడు సాధించిన మార్కుల్ని గమనిస్తుండగానే, "ముందు ఇంగ్లీష్ పేపర్ చూడండి. మీవాడు ఇంగ్లీష్‌లో ఫెయిల్ అయ్యాడు!" ఆవేశంగా అంటూ ఆన్సర్ పేపరును నాకందించింది.

పేపర్‌ని తీసుకొని మొదట్నించి చివరిదాకా పరిశీలించాక, మావాడి ముఖంలోకి చూశాను. బుద్ధిగా చేతులు కట్టుకొని అమాయకంగా నిల్చుని భయంగా చూస్తున్నాడు వాడు. పాపం వాడిని చూస్తే జాలేసింది. తలతిప్పి టీచర్ వంక చూశాను. ఆమె ముఖంలో ఎలాంటి మార్పులేదు. అదే సీరియస్‌నెస్‌తో నా సమాధానం కోసం ఎదురుచూస్తున్నట్లుంది.

రాని చిరునవ్వుని ముఖానికి అతికించుకుని, "చూడండి టీచర్! ఆంగ్లభాష ఒక పరభాష. అంటే విదేశీ భాష. కనీసం వాడికిప్పుడు నిండా ఏడేళ్ళుకూడా లేవు. ఈ వయసులో వాడికి మాతృ భాషనే పూర్తిగా అర్థమై చావదు. ఇంకా ఇంగ్లీషంటారా? అదంతా పై తరగతుల్లో వాడే నేర్చుకుంటాడులే.." అన్నాను చాలా తేలికైన విషయంగా కొట్టిపారేస్తూ.

తనేమాత్రం ఊహించని ఇలాంటి నా సమాధానానికి అసలే కోపంతో ఉడికిపోతున్న ఆవిడ ముఖం మరింత అరుణవర్ణంలోకి మారసాగింది. దాంతో కుర్చీలోంచి ఆవేశంగా ముందుకు వంగుతూ, "అవును.. మీరన్నట్లు ఇంగ్లీషు విదేశీ భాష. అది పరభాషనే అనుకుందాం. మరి తెలుగు వాడి మాతృభాషనే కద! అయినా మీవాడు తెలుగులో కూడా ఫెయిల్ అయ్యాడు! దీనికేమిటి మీ సమాధానం?" అంటూ మా వాడి తెలుగు పేపర్‌ని నా ముందుకు తోసింది విసురుగా.

తీసుకొని చూశాను. చాలాచోట్ల ఒత్తులు, దీర్ఘాలు, పొల్లులు మరిచినట్లున్నాడు. దాదాపుగా తప్పులు కనిపించాయి వాడు రాసిన పేపర్‌లో.

మరోసారి వాడివంక చూశాను. పాపం వాడు 'సారీ డాడ్.. క్షమించ' మన్నట్టు దీనంగా చూస్తున్నాడు నావంక. పాపం పసివయసు లోనే వాడికిన్ని కష్టాలా అనిపించింది. వాడిపట్ల నాకు సానుభూతి పెరిగింది. అలాగని టీచర్ చెబుతున్నదాంట్లో కూడా తప్పేమీ కనిపించ లేదు.

"మీరన్నది నిజమే టీచర్! తెలుగు మాతృభాషనే కాదనను. కాని అది చాలా కఠినమైన భాష. అంతేకాదు, తెలుగు భాష ధ్వని, ఉచ్ఛారణలపై ఆధారపడిన భాష. ఉచ్ఛారణ ఎలా ఉంటుందో, ఎలా పలుకుతామో అలాగే రాయాల్సి వుంటుంది. మీరు ఉపాధ్యాయ వృత్తిలోనే ఉన్నారు కాబట్టి ఈవిషయం మీకు తెలియందేమీ కాదు. అన్నట్లు మీది ఇంగ్లీష్ మీడియం స్కూల్. మీ స్కూల్లో తెలుగులో స్పష్టమైన ఉచ్ఛారణతో బోధించగలిగే టీచర్లు ఎవరున్నారు చెప్పండి? అయినా మా వాడి తెలుగు పేపర్ చూస్తుంటే మీ టీచర్లు తెలుగు ఎంత బాగా బోధిస్తున్నారో అర్థమవట్లేదా...!" అన్నాను కాస్త ఘాటుగానే తప్పంతా వాళ్ళపైకే నెట్టేస్తూ.

దానికావిడ పిచ్చి కోపంతో రియాక్టవుతూ, "అయితే తప్పంతా మా టీచర్లదేనంటారు మీరు. మరయితే తరగతిలోని మిగతా విద్యార్థులందరూ ఎలా..." అంటూ ఏదేదో వివరించబోతుంటే ఆవిడ వాక్యాన్ని మధ్యలోనే కట్‌చేస్తూ... "చూడండి టీచర్! క్లాసులోని మిగతా స్టూడెంట్స్ విషయం నేనెలా చెప్పగలను?" అన్నాను సీరియస్‌గా.

"హలో సార్!.. ముందు చెప్పేది పూర్తిగా వినండి. ఆ తర్వాత మీరు మాట్లాడండి. అంతేగాని, మధ్యలోనే అడ్డు కుంటూ, మీకు తోచినవిధంగా మీరేదేదో మాట్లాడేస్తూ మమ్మల్నీ, మా టీచర్లని దూషిస్తే ఎలా?" అంటూ ఇరిటేటింగ్‌గా దాదాపు అరచినంతపనిచేసింది టీచర్.

ఒక్క క్షణం సైలెన్స్‌గా ఆమె వంక చూసి, "ఓకే... చెప్పండి టీచర్! మీరేం చెప్పదలచుకున్నారో పూర్తిగా చెప్పండి. ఆ తర్వాతే నేను మాట్లాడతాను" అన్నాను శాంతంగా.

"అయితే వినండి! ఇంగ్లీషులో, తెలుగులో మీ అబ్బాయి ఫెయిల్ అయినా మీరు సమర్థించుకున్నారు. ఓకే... కానీ మిగతా సబ్జెక్టుల్లో కూడా మీవాడు చాలా పూర్. ఇవాళరేపు పిల్లలు మొబైల్ ఫోన్స్, ల్యాప్‌టాప్‌లూ, కంప్యూటర్లో ఏవేవో గేమ్స్, యాప్స్ అంటూ, ఎంత తెలివిగా ఉపయోగిస్తున్నారో తెలుసు కదా. కాని అనురాగ్ కంప్యూటర్ సైన్స్‌లో కూడా చాలా తక్కువ మార్కులు స్కోర్ చేశాడు. ఎందుకంటారు? ఇదిగో మీ వాడి కంప్యూటర్ పేపర్ ఎలా ఆన్సర్ చేశాడో మీరే చూడండి" అంటూ పేపర్‌ను నాకందించబోతుంటే వద్దని వారిస్తూ...

"నో టీచర్! వాడి పేపర్ నేనేమీ చూడవలసిన అవసరం లేదు. కాని, ఒక్కటి చెప్పండి! సెకండ్ స్టాండర్డ్ పిల్లలకి ఏ రైమ్స్‌నో, మోరల్ స్టోరీసో, టేబుల్స్ నేర్పిస్తే సరిపోదా? ఈ వయసులో వాళ్ళకు కంప్యూటర్ పరిజ్ఞానం, మొబైల్స్ యూజ్ చేయడం అంత అవసరమంటారా? చిన్నపిల్లలు.. ఎప్పుడెప్పుడు లీజర్ దొరుకుతుందా, ఎప్పుడెప్పుడు గ్రౌండ్‌కెళ్ళి ఆడుకుందామా అని చూస్తారే తప్ప, క్లాస్‌రూముల్లో కంప్యూటర్లకి అతుక్కుపోయి కూర్చోవాలని ఎంతమంది పిల్లలు కోరుకుంటారు మీరే చెప్పండి?" అంటూ రివర్స్‌గా రియాక్టయాను.

నా మాటలతో ఆమె కోపం బహుశ... నషాలన్ని తాకి ఉంటుందన్న సంగతి ఆమె ముఖంలో మారుతున్న రంగుల్ని బట్టి

అర్థమవుతుంది. కోపంతో అనురాగ్‌గాడి వంక చూసింది. వాడు భయంతో మరింత తల దించుకుని నేలచూపులు చూస్తున్నాడు.

చూపు మరల్చుకుని, టేబిల్‌మీదున్న పేపర్లను సర్దుకుంటూ, “హుఁ...! మీ అబ్బాయిని మీరింతగా వెనకేసుకొస్తుంటే ఇంక మేంమాత్రం ఏం చేయగలం. ఇదిగో ఇది మీ అబ్బాయి సైన్స్ పేపర్! అయినా.. మీకు చూపిస్తే మాత్రం ఫలితమేముంటుంది? దానికి మీ సమాధానమెలా ఉంటుందో నేనూహించగలను! ‘ఐనిస్టన్ కూడా చిన్నప్పుడు చాలా డల్ స్టూడెంట్. సరిగ్గా చదివేవాడు కాదు. ప్రతి క్లాస్‌లో రెండుమూడుసార్లు ఫెయిలయ్యేవాడంటూ, ఇలాంటివే ఏవో ఉదాహరణలు చెబుతారు అంతే కదా!” అంది నన్ను ఇమిటేట్ చేస్తున్నట్లుగా.

ఏదేమైనా మొత్తానికి నన్ను బాగానే అర్థం చేసుకున్నట్లుందని నాలో నేను నవ్వుకున్నాను.

కొద్దిక్షణాలు ఇద్దరి మధ్యా మౌనం ఘనీభవించింది.

రెండు నిమిషాల తర్వాత మావాడి గురించి మరిన్ని కంప్లైయింట్స్ ఏకరువు పెడుతూ– “ఒక చదువు విషయంలోనే కాదు, కనీసం డిసిప్లిన్‌గా ఉండడం కూడా తెలియదు మీ అబ్బాయికి. క్లాస్‌లో పక్కవాళ్ళతోనో, ముందూ, వెనకలవాళ్ళతోనో మాట్లాడుతూ చీటికిమాటికీ అందర్నీ డిస్టర్బ్ చేస్తుంటాడు. టీచర్ బయటికెళ్ళిందంటే చాలు బెంచీలపై ఇటునుంచి అటు, అటునించి ఇటు గెంతుతూ అందర్నీ ఆటలువట్టిస్తుంటాడు. అబ్బబ్బ... నిజంగా వాడిని కంట్రోల్ చేయడం మా టీచర్ల వల్ల కావడంలేదంటే నమ్మండి” అంటూ వాడిపట్ల తనకున్న విసుగునంతా వెళ్ళగక్కింది.

వాడి అల్లరి గురించి వింటుంటే నాకు వాడిమీద కోపం రాలేదు. పైగా నా బాల్యం గుర్తుకొచ్చి ఈసారి పైకే నవ్వుకున్నాను. దాంతో ఆమెలో కోపం మరింతగా కట్టలు తెంచుకుని ఒక్కసారిగా బరస్టవుతూ, “చూడండి.. నేనింతగా మీ అబ్బాయిని గురించి మాట్లాడుతుంటే మీకు నవ్వులాటగా ఉందా? మీరెందుకిలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు” అంటూ గట్టిగా నిలదీసింది.

“ఇదిగో చూడండి టీచర్! పిల్లలన్నాక అల్లరిచేయడం సహజం. ఇవన్నీ చాలా చిన్న విషయాలు. వదిలిపెట్టండి. అన్నట్లు.. మీరొకటి మరిచిపోయినట్లున్నారు. ఇంతకీ మావాడి మ్యాథమేటిక్స్ పేపర్ సంగతేమిటి? మ్యాథ్స్‌లో మావాడి కెన్ని మార్కులొచ్చాయో మీరు చూపించనేలేదు” అన్నాను.

దానికావిడ మొహం తిప్పుకుంటూ, “హుఁ...! చూసిన పేపర్లు సరిపోలేదా? ఇంకా మాథ్స్ పేపర్ చూసిమాత్రం చేసేదేముందిలే” అంది గంభీరంగా.

“అన్ని సబ్జెక్టుల పేపర్లు చూపించి ఆ లెక్కల పేపరొక్కటి ఎందుకు చూపించట్లేదు? అది కూడా చూపించండి. అందులో వాడెంత స్కోర్ చేశాడో నేను చూడాలి” అని పట్టుబట్టాను.

ఒక్కసారి తను అనురాగ్ వంక చూసింది. వాడు తలదించుకుంటూ మరింతగా నా వెనకగా జరిగాడు.

మ్యాథ్స్ పేపర్ గురించి నేనలా పట్టుబట్టడంతో ఫైల్లోంచి తీసి, ఇవ్వాలా వద్దా అని సందేహిస్తూనే నా ముందుంచింది.

చేతిలోకి తీసుకొని చూశాను. అయితే, అన్ని సబ్జెక్టులకంటే మ్యాథ్స్‌లో మార్కుల పరిస్థితి భిన్నంగావుంది. మ్యాథ్స్‌లో వందకి వంద శాతం మార్కులు సాధించాడు అనురాగ్.

టీచర్ వంక చూశాను. తనిప్పుడు నావంక చూడట్లేదు. ముభావంగా ముందున్న ఫైళ్ళకి తలదించుకొని ఏదో చూస్తున్నట్లు నటిస్తుంది. దాంతో ఒక్కసారిగా నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది, “మావాడికి ఇంగ్లీష్ ఎవరు బోధిస్తారు?” అడిగాను సీరియస్‌గా.

నా స్వరంలోని తీవ్రతకి ఒక్కక్షణం ఉలిక్కిపడి, తేరుకుంటూ... మెల్లగా తలెత్తి “నేనే” అంది.

“తెలుగు ఎవరు బోధిస్తారు?”

“నేనే” సమాధానమిచ్చింది.

“మరి కంప్యూటర్ సైన్స్?”

“నేనే మీ వాడి మదర్ టీచర్‌ని. అది కూడా నేనే” అంది సూటిగా నావంక చూడలేక ఫైల్లోకి తలదూరుస్తూ.

“అయితే ఇప్పుడు చెప్పండి. అనురాగ్‌కి మ్యాథమేటిక్స్ ఎవరు బోధిస్తారు?'' అనగానే, తనేదో చెప్పబోతుంటే, మధ్యలోనే తనకన్నా ముందు నేను కుర్చీలోంచి విసురుగా లేచి నిలబడుతూ,

“నేను... అవును... మా అబ్బాయికి ప్రతిరోజూ ఇంటిదగ్గర మ్యాథమేటిక్స్ ‘నేనే’ బోధిస్తాను” అన్నాను ఆవేశంగా ఊగిపోతూ.

నాలోని ఆవేశానికి టీచర్ భయంతో తలొంచుకొంటూ, “అవును నాకు తెలుసు” అంది నెమ్మదిగా!

“మరయితే, గుడ్ టీచర్ ఎవరో మీరే తెలుసుకొండి. అయినా... అనురాగ్ మీరు చెబుతున్నంత డల్ స్టూడెంట్ ఏమీ కాడు. అలాగయితే మ్యాథ్స్‌లో వందకు వంద ఎలా సాధించగలిగాడు. వాడో వెలిగేచీకటి. వాడిలోని అంధకారాన్ని తొలగించి ఉజ్వలంగా తీర్చిదిద్దాల్సిన మీరు.. ఇలా అనవసరంగా లేనిపోని ఫిర్యాదులు చేయడం సరికాదు. ఇక వాడి అల్లరంటారా?... పిల్లలు పెరిగేకొద్దీ వాళ్ళ అల్లరి అదే తగ్గుతుంది. దానిగురించి మనమేమీ వర్రీ అవ్వాల్సిన పనిలేదు” అంటూ రెండు చేతులు జోడించి నేను ఛోటుగాడితో కలిసి బయటికి నడుస్తుంటే...

తను కూడా సీట్లోంచి విసురుగా లేచి కోపంతో కుర్చీని వెనక్కి నెడుతూ, “మీ తండ్రీ కొడుకుల సంగతి ఇవాళ మన ఇంటిదగ్గర తెలుస్తా.. మీరైతే ఇంటికి పదండి” అంటూ ఉక్రోషంగా గొణుక్కుంటూ మమ్మల్ని అనుసరించింది ‘శ్రీమతి నిశిగంధ టీచర్’.

–మోని శ్రీనివాస్
m : 9291223136, 9182931109
e : srinivasmonis@gmail.com

ఈ పుస్తకం రాయడానికి ప్రేరణ ఏమిటీ?

ముప్పై ఏళ్ల నా జర్నలిజం జీవితంలో సగభాగం హైదరాబాద్ నగరంపైనే రిపోర్టింగ్ చేశాను. తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సమయంలో ఆరేళ్లపాటు హైదరాబాద్ రిపోర్టింగ్ బ్యూరో ఛీఫ్‌గా పనిచేశాను. ఈ సమయంలో హైదరాబాద్ నగర చరిత్రను విభిన్న కోణాల్లో 'వార్త' దినపత్రిలో ప్రత్యేక కథనాలుగా మలిచాము. అప్పుడే హైదరాబాద్ చరిత్రపై నాకు మక్కువ పెరిగింది. పుస్తకాలుగా తీసుకురావాలని అనుకున్నాను.

శాసనసభ పరిధిని ఎంచుకోవడానికిగల కారణం?

ఇంగ్లీష్, ఉర్దూలలో హైదరాబాద్‌పై వెయ్యికిపైగా పుస్తకాలు వచ్చాయి. తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెలుగులో కూడా వచ్చాయి. అయితే ఇవన్నీ కూడా ఎక్కువగా కుతుబ్‌షాషి, అసబ్‌షాషిల పాలన, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారవ్యవహారాలకు సంబంధించి నవలలు, కథలు, వ్యాసాలుగా వచ్చాయి. తెలంగాణ చరిత్ర ధ్వంసంపై ఎక్కువగా పుస్తకాలు వెలువడ్డాయి. శాసనసభ పరిధిని తీసుకోవడం వల్ల అక్కడి ప్రాంతీయత, చరిత్ర రూపురేఖలను విశ్లేషించడానికి అవకాశముంటుంది. అంబర్‌మియా అనే సూఫీ ప్రవక్త పేరు మీద అంబర్‌పేట ఏర్పడింది. ఈ అంబర్‌మియా గురించి ఏ చరిత్ర పుస్తకంలో కూడా లేదు. అంబర్‌పేట మీద పుస్తకం తీసుకురావడం వల్ల అంబర్‌మియా గొప్పతనం, ఈ ప్రాంత విశిష్టత వెలుగులోకి తీసుకురాగలిగాము. అంబర్‌మియా వంటి వ్యక్తులు ఇతరత్రా శాసనసభ పరిధిలో ఎందరో ఉంటారు. అలాంటివారు వెలుగులోకి రావాలని, చరిత్రలో వారికి చోటు కల్పించాలనేది నా ప్రధాన ఆశయం.

కోడం పవన్‌కుమార్
'అంబర్‌పేట' పుస్తక రచయిత

ఈ తరహాలో మరిన్ని పుస్తకాలు తీసుకువచ్చే ఆలోచన ఉందా?

తెలంగాణ సమగ్ర చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి శాసనసభ పరిధితో కూడిన పుస్తకాలు రావలసిన అవసరముందని బలంగా విశ్వసిస్తున్నాను. తెలంగాణలోని 119 నియోజకవర్గాలపై చారిత్రాత్మక వాస్తవ కథనాలతో కూడుకున్న పుస్తకాలు రావాలి. ఇవన్నీ 'ఎన్‌సైక్లోపిడియా'లా ఉండాలి. హైదరాబాద్‌లోని శాసనసభ నియోజకవర్గాలలో వీలైనంత మేరకు తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నాను. ఆయా నియోజకవర్గాల ప్రతినిధులను కలసి అంబర్‌పేట పుస్తకాన్ని చూపిస్తున్నాను. మంచి ప్రయత్నంగా వారు అభినందిస్తున్నారు.

అంబర్‌పేట పుస్తకం తీసుకురావడంలో ఇబ్బందులు ఏవేనా...

ఈ పుస్తకం ఓ ప్రయోగంగా మొదలుపెట్టాను. చాలా రిలాక్స్‌గా పనిచేసుకుంటూ పోయాను. కాల పరిమితిని పెట్టుకోకుండా ముందుకుసాగాను. మధ్యలో కొంతకాలం ఓ హెల్త్ టీవీ ఛానల్‌లో పని చేశాను. మరికొంతకాలం ఓ దినపత్రికలో పనిచేశాను. వీటన్నింటినీ వదిలి సీరియస్‌గా పనిచేసుకుంటూ పోయాను. పాతతరం వ్యక్తులను కలుసుకుంటున్నప్పుడల్లా కొత్త విషయాలు తెలిసేవి. ఇవన్నీ క్రోడీకరించుకుంటూ ముందుకుసాగాను. రెండు వందల పేజీల పుస్తకం సిద్ధమయింది. దీన్ని కమర్షియల్‌గా తీసుకురావాలని, అప్పుడే ప్రజలకు చేరుతుందని భావించాను. ప్రకటనల ద్వారా ఆర్థికపరిపుష్టి చేకూరింది. నేను అనుకున్న లక్ష్యం నెరవేరింది.

ఈ పుస్తకం ద్వారా మీరు ఆశిస్తున్న ప్రయోజనాలేమిటీ?

చరిత్రను ప్రేమించే నాలాంటి వారు ఎంతోమంది రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నారు. వీరంతా తమ తమ స్థానిక శాసనసభ పరిధిని ఎంచుకుని ఇలాంటి పుస్తకాలను తీసుకురాగలిగితే సమగ్రమైన తెలంగాణ చరిత్రను ముందుతరాలకు అందించినవాళ్లమవుతాము. చరిత్ర వక్రీకరణకు గురయ్యే అవకాశం కూడా ఉండదు. తెలంగాణ ప్రభుత్వం ముందుకువచ్చి చరిత్రకారులను ప్రోత్సహించాలి. ఈమేరకు తెలంగాణ సాహిత్య అకాడమీ సమగ్రమైన ప్రణాళికను రూపొందించవలసిన అవసరముంది.

– సచిన్, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

పుస్తక పరిచయం

పుస్తక పరిచయం శీర్షిక ద్వారా వివిధ పుస్తకాలను పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం ఇది. ఈ వేదిక ద్వారా పాఠకులకు తమ పుస్తకాలను పరిచయం చేయాలనుకునే రచయితలు, ప్రచురణ సంస్థలు తమ పుస్తకాలు రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపించవచ్చు. వీలు వెంట వాటిని ప్రచురిస్తాం. సమకాలీన సామాజిక అంశాలతో కూడిన కొత్త పుస్తకాలకు ప్రాధాన్యం.

పుస్తకాలు పంపించాల్సిన చిరునామా:

Telangana Resource Centre

Deccan Land : "CHANDRAM" 3-6-712/2, St.No.12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
Fax: 040-27635644 Mobile: 9030626288
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

గతానికి వర్తమానానికి వారధి, భావి నిర్మాణానికి మార్గదర్శి

అంబర్‌పేట-ఆకాశానికి పూచిన మందారం

నైసర్గిక, కృతక స్వరూప స్వభావాల దృష్ట్యా, జనాభా విస్తరణ, పాలనాపరమైన ప్రభుత్వ నిర్ణయాలు తెచ్చే మార్పులు... తదితర చారిత్రక పరిణామాలతో ఒక ప్రాంతం కొన్ని ప్రత్యేకతలు సంతరించుకుని వర్తమాన సామాజిక, రాజకీయ చిత్రపటంలో విశిష్ట స్థానాన్ని ఆక్రమిస్తుంది. విశ్వనగరంగా రూపుదిద్దుకుంటూ అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకుపోతున్న హైదరాబాద్ మహానగరంలో వివిధ మతాలవారు, విభిన్న సంస్కృతీ సంప్రదాయాలు ఆచరించే ప్రజలు, దేశం నలుమూలల నుంచీ శాంతియుత సహజీవనం చేస్తున్నారు. ఫలితంగా మత, భాషా సంస్కృతీపరంగా అత్యంత వైవిధ్య భరితమైన, విలక్షణమైన ప్రజాజీవన విధానం ఇక్కడ నెలకొనివుంది. దక్కన్‌ల్యాండ్ ప్రత్యేకమనదగ్గ ఈ అపారమైన వైవిధ్యాన్ని, సంస్కృతి, సాంప్రదాయిక విభిన్నతను పూర్తిగా పుణికి పుచ్చుకున్న సువిశాల ప్రాంతం అంబర్‌పేట. ఇది తెలంగాణ రాష్ట్రంలో (ఉమ్మడి రాష్ట్రంలో కూడా) ఒక శాసనసభా నియోజకవర్గం. హైదరాబాద్ నగరంలో ఒక ప్రధాన మండల కేంద్రం. అన్ని రకాలుగా అభివృద్ధి చెంది జనంతో నిత్యం కిటకిటలాడే రోడ్లతో బాగా విస్తరించిన ప్రముఖ భాగం కూడా.



పాత్రికేయుడు, కవి, రాజకీయ విశ్లేష కుడిగా సుపరిచితుడైన కోడం పవన్‌కుమార్, మరిద్దరు మిత్రుల సహకారంతో, అంబర్‌పేట ప్రాంతపు అన్ని పార్శ్వాలను స్పృశిస్తూ సమగ్ర వివరణతో 'అంబర్‌పేట-ఆకాశానికి పూచిన మందారం' పేరుతో 202 పేజీలతో చారిత్రాత్మక పుస్తకాన్ని తీసుకువచ్చాడు. ఇందులోని విషయసామాగ్రి... చరిత్ర, అత్రాఫ్-ఐ-బల్దా, జ్ఞాపకాలు, రాజకీయ స్వరూపం, మారిన డివిజన్లు, శాసనకర్తలు, అంతరంగం, అంబర్‌పేటలోని డివిజన్లు... తదితర విభాగాలుగా విభజించాడు. ఈ ప్రాంతానికి ఆ పేరు రావడానికి మూలకారకుడైన అంబర్‌మియా జీవన విశేషాలు, ఒకనాటి సబ్బుండవర్ణాలు, సమస్తవృత్తుల కాణాచిగా, తహసీల్ కార్యాలయ కేంద్రంగా విలసిల్లిన అంబర్‌పేట గ్రామం క్రమంగా గోల్కొండ నవాబులు, ఏడవ నిజాం హయాంలో అభివృద్ధి చెందిన విధానం, విశాలాంధ్ర అవతరణ అనంతరం చోటు చేసుకున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మార్పులు, వివిధ రాజకీయ పార్టీల ప్రాబల్యదశలు, వాటి ఉత్థాన పతనాలు, వాటికి పునాదులు వేసిన రాజకీయ ప్రముఖుల జీవనచిత్రాలు, ప్రస్తుత హోదాలు, పదవుల్లో వున్న ప్రసిద్దుల జీవన విశేషాలు, దేశ, రాష్ట్ర రాజకీయాలపై కీలక ప్రభావం పడవేసిన జాతీయ పార్టీల నాయకుల అంతరంగాలతో పాటు అంబర్‌పేట సామాజిక, ఆర్థిక పరిణామక్రమాన్ని సన్నిహితంగా పరిశీలిస్తూ వస్తున్న కొందరు ప్రముఖుల ఆసక్తికరమైన జ్ఞాపకాలు ఈ పుస్తకంలో పొందుపరుచబడ్డాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత భూపాల్, ప్రముఖ రచయిత్రి కె.వి.కృష్ణకుమారి, డాక్టర్ అజిత్ ఎగ్బోటే, షర్మిష్టాదేవిల జ్ఞాపకాలతో అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంటల వందేళ్ల పరిస్థితిని కళ్లకు కట్టినట్లుగా గుర్తుకుతెచ్చారు. అలాగే ఈ ప్రాంతంలోని రాజకీయవేత్తలు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావులు అంతరంగాన్ని పంచుకోవడం వల్ల నాటి నుంచి నేటివరకు జరిగిన రాజకీయ పరిణామాలను మనకు పూసగుచ్చినట్లుగా వివరించారు.

అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల స్థితిగతులను ఏ డివిజన్‌కు ఆ డివిజన్‌గా విభజించడంతో శాసనసభ నియోజకవర్గం ముఖచిత్రం పాఠకులకు అందుతుంది. 'ఫర్‌ఫ్యూమ్ ఆఫ్ హెవెన్' పేరిట అంబర్‌పేట, 'కులవృత్తుల సమాహారం'గా బాగ్‌అంబర్‌పేట, 'కాచె కులస్థుల జీవనదృశ్యం'తో కాచిగూడ, 'కుంటపై విరిసిన నల్లకలువ'గా నల్లకుంట, 'నిజాం సైనికుల కాపలా కేంద్రం'గా గోల్నాక డివిజన్ల రూపురేఖలు, జనసరళి, భౌగోళిక స్వరూపం, కార్పొరేటర్లు, నాయకుల రాజకీయ జీవన నేపథ్యాలను జర్నలిస్టు పవన్‌కుమార్ ఆకట్టుకునే శైలిలో వివరించారు. హైదరాబాద్ నగర తొలి కార్పొరేషన్ ఎన్నికలు జరిగిన 1951 నుంచి 2016 ఎన్నికల సమీక్షతో పాటు కార్పొరేటర్ల వివరాలను పొందుపరిచారు. చాలామందికి తెలియని తొలితరం కార్పొరేటర్లు పుస్తకం ద్వారా పరిచయం కావడం అరుదైన సమాచారంగా పేర్కొనవచ్చు.

సుల్తాన్‌బజార్, గగన్‌మహల్, హిమాయత్‌నగర్, ప్రస్తుత అంబర్‌పేటగా మారిన శాసనసభ తీరును కూలంకషంగా వివరించడం ఒక ఎత్తయితే, ఈ నియోజకవర్గాలలో పోటీచేసిన వారందరి పేర్లు, వారికి వచ్చిన ఓట్లు తదితర వివరాలు ఇవ్వడం గొప్ప సమాచార సేకరణగా భావించాలి. గెలిచిన శాసనసభ్యులు ఆలె నరేంద్ర, వి.హనుమంతరావు, కృష్ణయాదవ్, కిషన్‌రెడ్డిలు శాసనసభ్యులుగా అందరికీ తెలిసినవారే అయినప్పటికీ, వాసుదేవ కృష్ణాజీ నాయక్, శ్రీమతి శాంతాబాయి తల్పల్లికర్, తెళ్ళ లక్ష్మీకాంతమ్మ, జి.నారాయణ రావుగౌడ్‌లను ఈ తరానికి పరిచయం చేశాడు. కార్పొరేషన్, శాసనసభ, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల ఎన్నికల్లో అంబర్‌పేట ఓటర్లు ఏయే కాలల్లో, ఏయే పార్టీలవైపు మొగ్గు చూపారో గణాంకాలతో సహా ఇవ్వడం జరిగింది. ఇక్కడి ప్రజాజీవనంలో భాగమైన పోలీస్ శిక్షణా కేంద్రం, పోలీసు ఆర్టీసీ క్వార్టర్లు, స్మశానవాటికలు, మాయమైన, ఉనికి కోల్పోతున్న చెరువులు, కుంటలు, దేవాలయాలు, మసీదులు, చర్చీలు, విద్యాలయాలయాలు, సిద్దిఅంబర్ సమాధి, బురుజు, చారిత్రక కట్టడాలు, స్థూపాలు, స్మృతిచిహ్నాలు, గ్రంథా లయాలు, ఆసుపత్రులు, వసతిగృహాలు తదితరమైనవన్నింటి గురించి సవివరమైన సమాచారం ఈ పుస్తకంలో దొరుకుతుంది.



కేశవనిలయం, సావర్కర్ కాంస్య విగ్రహం, బూర్గుల, దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ల గృహాలు, ఆంధ్ర యువతి మండలి తెచ్చిన మహిళా విప్లవం, పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించిన బాలనందం, నైజాం రాష్ట్రంలో నూర్‌మహల్ టాకీస్ చరిత్ర, తొలి ఫిలిం స్టూడియో రూపుదిద్దుకున్న తీరు, ప్లేగు వ్యాధిగ్రస్తులకు శిబిరంగా ఉన్న వీరన్నగుట్ట, దేవిడీలకు నిలయంగా మారిన బర్కత్‌పుర, లింగంపల్లి వంటి ప్రాంతాలు... మరెన్నింటితో సుమారు ఐదువందల ఏళ్ల చరిత్రను ఈ పుస్తకం మోసుకొచ్చింది. నిన్న మొన్నటి యధార్థాలను గుదిగుచ్చిన చరిత్రను వర్తమానానికి వారధిగా ఈ పుస్తకం నిలిచిందనడంలో ఏలాంటి సందేహం లేదు. ఈతరం వారికి అంబర్‌పేట గురించిన అనేక విషయాలను తెలియజేస్తుంది. దీనిని 'అంబర్‌పేట ఎన్‌సైక్లోపీడియా' అనవచ్చు. గత వైభవపు ఫొటోలతో పొరలు పొరలుగా చూపే అందమైన, ఆకర్షణీయమైన ఈ పుస్తకంలో ఇక్కడి ప్రజలకు అందని ఫలాలు, నెరవేరని ఆకాంక్షలను కూడా ఎత్తిచూపించింది. అన్యప దేశంగ భవిష్యత్తు గురించిన పలు విలువైన సూచనలు చేసింది. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఈ పుస్తకం కూర్చిన కోడం పవన్ కుమార్, డాక్టర్ ధనుంజయ, శ్రీనివాస్ ముదిరాజ్‌లు, లయ పబ్లికేషన్‌కు అభినందనలు. ఇలాంటి ఆత్మ చరిత్రాత్మక వాస్తవ కథనాలతో కూడిన పుస్తకాలు మరిన్ని రావలసిన అవసరం ఎంతైనా వుంది.

- ఆడెపు లక్ష్మీపతి

m : 9701227207

e : kodams@gmail.com

పత్రికలు - పరిచయం:

గమనిక: ఈ శీర్షిక ప్రచురించేందుకు ఆయా పత్రికలు, ప్రత్యేక సంచికల వివరాలను మాకు తెలియ జేయగలరు.

తెలుగు వెలుగు
సంపాదకులు :
రామోజీరావు

ఫోన్: 8415 2 46888

బాలబాట
సంపాదకురాలు :
కె.యస్వీ.రమణమ్మ

ఫోన్: 9347211537

బాలభారతం
సంపాదకులు :
రామోజీరావు



ఫోన్: 8415 2 46888

బాలవినోదిని
సంపాదకులు :
కంచిరాజు వీఱ్ఱాజు (కౌండిన్య)

ఫోన్: 040-24145027



కోడూరి విజయకుమార్‌ది తెలుగు కవిత్వ ప్రపంచంలో ఒక ప్రత్యేకమైన సంతకం. ఒకసారి హృదయంతో చూస్తే చాలు, మరచిపోలేని సంతకం. వాతావరణం నుండి ఆక్వేరియంలో బంగారుచేప మీదుగా అనంతరం దాటుకుని ఒకరాత్రిని మరొక రాత్రితో పోల్చి చూసిన అతడి కవిత్వం నాలుగు దశాబ్దాల తెలుగు ప్రజల ఉత్థాన పతనాలకు, భావోద్వేగ ప్రయాణానికి అచ్చమైన చారిత్రక రూపం. పదునైన, నిష్పాక్షికమైన డాక్యుమెంటేషన్. విజయ్ కవిత్వం చదివితే చాలు తెలుగుదేశం ఏఏ అగాధాల అగడ్తలు దాటిందో, ఏఏ కీర్తి శిఖరాలు అధిరోహించిందో చాలా సులువుగా అర్థం అవుతుంది.

రేగుపండ్ల చెట్టు (కవిత్వం): కోడూరి విజయకుమార్, **ప్రచురణ:** కృష్ణప్రియ ప్రచురణలు, **వెల** : రూ.60, **ప్రతులకు** : అనల్ప బుక్ కంపెనీ, సికింద్రాబాద్. ఫోన్ : 7093800678

గరిపల్లి అశోక్ పరిశోధనా ప్రణాళిక ప్రణాళికా బద్ధంగానే ఉన్నది. మొదటి అధ్యాయంలో నాంపల్లి జీవిత నేపథ్యమే 'నేను పద్యం రాస్తాను, వచనం రచిస్తాను, హరికథలు చెబుతాను' అని నిర్ణయింపజేసింది నాంపల్లి గారిచేత. రెండవ అధ్యాయంలో నాంపల్లి రచనలు – ప్రేరణ ఉంది. వారి రచనలకు స్ఫూర్తిదాయకంగా ఎవరు నిలిచారో చెప్పడం కృతజ్ఞతాభావ సూచకం. మూడో అధ్యాయంలో రచనల్ని ప్రక్రియా పరంగా విశ్లేషించడ అశోక్ పరిశోధనకు వన్నె తెచ్చింది. మొత్తం పదిహేను అధ్యాయాల్లో అశోక్ పరిశోధన పరచుకుని ఉన్నది. ఈ అధ్యాయాల్లో నాంపల్లిగారి రచనల్లోని సామెతలను సైతం పేర్కొనడం మంచి పరిశోధనా సరళికి దృష్టాంతం.

దూడం నాంపల్లి రచనలు - పరిశీలన : గరిపల్లి అశోక్, **ప్రచురణ** : మానేరు రచయితల సంఘం, **వెల** : రూ. 100, **ప్రతులకు** : 404, వివెల్ఆర్ రెసిడెన్సీ, సిద్ధార్థ స్కూల్ పక్కన, శ్రీనివాసనగర్, సిద్ధిపేట. ఫోన్ : 9849649101 ప్రముఖ పుస్తక కేంద్రాలలో.





కొత్తగా ఊహించడం, కొత్తదనం నిర్మించడం మహేందర్ కవిత్వ విశేషం. కదిలిపోతున్న కాలంలో ఘర్షణ పడుతున్న సమూహాలు తన కవితా వస్తువులు. గడ్డకట్టిన దశ నుంచి కరిగిపోయే దశ, ఘనీభవించిన స్థితిని ద్రవీభవించే చైతన్యం ఈ కవి సొంతం. హేతుబద్ధంగా ఆలోచించి ప్రశ్నించి మరుగునపడి ఉన్న మానవత్వాన్ని మేల్కొల్పటమే కవిత్వ లక్ష్యం. ఆ పని నిండుగా మహేందర్ కవిత్వం చేస్తున్నది. హేతుబద్ధంగా ఆలోచించి ప్రశ్నించి మరుగునపడి ఉన్న మానవత్వాన్ని మేల్కొల్పటమే కవిత్వ లక్ష్యం. ఆ పని నిండుగా మహేందర్ కవిత్వం చేస్తున్నది.

ఇప్పుడొక పాట కావాలి (కవిత్వం) : బిల్ల మహేందర్, **వెల** : రూ. 150, **ప్రతులకు** : 35-7-674, టీఎన్జీవోస్ కాలనీ, ఫేజ్-2, వడ్డేపల్లి, హన్మకొండ, వరంగల్. ఫోన్ : 9177604430. ప్రముఖ పుస్తక కేంద్రాలలో

జీవితయాత్రలో తెలంగాణలో ఒకప్పటి సామాజిక, ఆర్థిక స్థితిగతులు, రాజకీయాలు, క్రమంగా నేటి వరకు జరిగిన పరిణామాలన్నీ కన్పిస్తాయి. ఒక న్యాయవాదిగా వీరు కేవలం న్యాయంకోసం పోరాడడమే కాక సమానత్వం, సంస్కరణల కోసం కూడా పాటుపడ్డారు. న్యాయవాద వృత్తి ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తూ మరోవైపు న్యాయవ్యవస్థకు, పరిపాలనా రంగానికి తగు గౌరవం కలిగే విధంగా చూశారు.

నా జీవితయాత్ర (ఆత్మకథ) : చలిమెడ ఆనందరావు,
తెలుగు అనువాదం : డా॥ గంధ్ర లక్ష్మణరావు, **ప్రచురణ** : చలిమెడ జానకీదేవి మెమోరియల్ ట్రస్ట్, **ప్రతులకు** : 1-2-56/38, దోమల్‌గూడా, హైదరాబాద్. ఫోన్ : 98496 45599



సూచన: ఈ శీర్షికలో ప్రచురణ కోసం : రెండు పుస్తకాలను పంపించాలి.



ఆదిలాబాద్ జిల్లా సాహిత్య చరిత్ర
రచన : డాక్టర్ ఉదారి నారాయణ
ప్రచురణ : తెలంగాణ సాహిత్య అకాడమి
వెల : రూ. 40
ప్రతులకు : కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం,
హైదరాబాద్ - 500 004.
ఫోన్ : 040-29703142

పాల్కురికి సోమనాథుని బసవపురాణము
సంపాదకులు : డా॥ నలిమెల భాస్కర్,
శ్రీ బూర్ల వేంకటేశ్వర్లు
ప్రచురణ : కరీంనగర్ సాహితి, వెల : రూ. 250
ప్రతులకు : ఇం.నెం.2-10-1524/10, ఫ్లాట్ నెం. 403, వెంకటేశ్వర టవర్స్, జ్యోతినగర్, కరీంనగర్.
ఫోన్ : 94915908040, 9704374081



అంతా నిజమే చెప్తా (జీలానీ బానూ కథలు)
అనువాదం : మెహక్ హైదరాబాదీ
ప్రచురణ : నవచేతన పబ్లిషింగ్ హౌస్
వెల : రూ. 150
ప్రతులకు : గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్)
జి.ఎస్.ఐ.పోస్ట్. హైదరాబాద్-500068
ఫోన్ :040- 24224453/54



కొత్తతొవ్వ (కవిత్వ పాఠాలు)
సంపాదకులు : డా॥ వి. శంకర్
ప్రచురణ : తెలంగాణ రచయితల సంఘం
వెల : రూ. 40
ప్రతులకు : డా॥ వి. శంకర్,
ఫోన్ : 9440798954.
మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



చివురు కోయిల
రచన : యడవల్లి శైలజ
ప్రచురణ : సాయికుమార్, సంధ్య ప్రచురణలు, ఖమ్మం
వెల : రూ. 100
ప్రతులకు : శ్రీసాయివాసు ప్రథమ చికిత్సాకేంద్రం
ఇం.నెం.6-36, పాండురంగాపురం, బల్లేపల్లి,
ఖమ్మం-507 002. ఫోన్ : 9394171299



పుటం (విశ్వకర్మ వృత్తి కవిత్వం)
రచన : దాసోజు కృష్ణమాచారి
ప్రచురణ : ఎరుక సాహితీ సామాజిక సాంస్కృతిక వేదిక
వెల : రూ. 80
ప్రతులకు : ఫ్లాట్ నెం. 3, స్ట్రీట్ నెం.8, శక్తినగర్,
చింతలకుంట, ఓల్డ్ చెక్‌పోస్ట్, ఎల్బీనగర్, హైదరాబాద్.
ఫోన్ : 9542869968



నేల విమానం (కవిత్వం)
రచన : వాసరచెట్ల జయంతి
ప్రచురణ : తెలంగాణ రచయితల సంఘం
వెల : రూ. 120
ప్రతులకు : ఫ్లాట్ నెం.504, 5వ అంతస్థు, దత్తశ్రీ
అవెన్యూ, అన్నపూర్ణ ఎంక్లేవ్, బిఎస్ఎన్ఎల్
ఆఫీస్‌వద్ద, ఫోన్ : 9985608077.
ప్రముఖ పుస్తక కేంద్రాలలో



యోగవాశిష్ఠమ్
రచన : వల్లూరు శ్రీరామచంద్రమూర్తి
ప్రచురణ : వియస్ఆర్ ఫౌండేషన్
వెల : రూ. 50
ప్రతులకు : వియస్ఆర్ ఫౌండేషన్, బి-61,
డిడి కాలనీ, హైదరాబాద్ - 500 007
ఫోన్ : 9440603499

మమతల హృదయాలు (కన్నెగంటి గజళ్ళు)
రచన : కన్నెగంటి వెంకటయ్య
వెల : రూ. 100
ప్రతులకు : 3-21/134, శ్రీసాయినగర్,
కొత్త సత్యనారాయణపురం, యెడ్లపురం, ఖమ్మం
ఫోన్ : 98856 57582
ప్రముఖ పుస్తక కేంద్రాలలో

శోధన (సాహిత్య వ్యాస సంపుటి)
రచన : డా.కసప నరేందర్
ప్రచురణ : తెలుగు అసోసియేషన్, హైదరాబాద్
వెల : రూ. 200
ప్రతులకు : 2-4-120/ఎస్ఎస్/31, శ్రీశక్తి కాలనీ,
సౌత్ స్వరూప్‌నగర్, ఉప్పల్, హైదరాబాద్
ఫోన్ : 9491548748



దేశభాషలందు తెలుగులెస్స
(పద్య గేయ కవితా సంకలనం)
సంపాదకులు : పున్న అంజయ్య
ప్రచురణ : సాహితీమేఖల, నల్లగొండ
వెల : రూ. 100
ప్రతులకు : 6-2-954/2, మీర్‌బాగ్ కాలనీ,
హైద్రాబాద్‌రోడ్, నల్లగొండ. ఫోన్ :9396610639



తెలంగాణ చరిత్ర (కొత్త వెలుగులు)
రచయిత : ఆవాల బుచ్చిరెడ్డి
వెల : రూ. 150
ప్రతులకు : 'స్మిత' 16-11-511/డి/48,
శాలివాహన నగర్, మూసారాంబాగ్, హైదరాబాద్.
ఫోన్ : 9493207198











చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు- ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం.

పిల్లలలో నైతికను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. ***'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ'*** తెలంగాణాలోని ఉమ్మడి 10 జిల్లాల ***"బడి పిల్లల కథలు"*** సంకలనాలుగా అందమైన బొమ్మలతో వెలువరించింది.

10 పుస్తకాల సెట్ ధర రూ. 330
తగ్గింపు ధర రూ. 300

ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

మరియు

'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com









DECCAN LAND, Telugu Monthly Magazine 15th - April - 2020, ISSN 2581-3188
Postal Dates: 28th & 29th Every Month
RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, RNP/HD/1167/2018-2020

Students presenting a play on Saving Mother Earth. Spreading awareness to stop the cutting of the trees, planting trees to stop the "GLOBAL WARMING".

I go to Oxford (ogs) to learn life!

ogs JUNIORS - grow naturally -

Oxford Grammar School

KNOWLEDGE IS POWER

13TH STREET, HIMAYATNAGAR, HYD.

39 Years of meritorious performance

CBSE & SSC

RECONNECTING CHILDREN WITH NATURE

Phone: 040-27636214, Mobile: 9959612345,
email: ogshyd@gmail.com
website: www.oxfordgrammarschool.com

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar